సోమవారం
23-12-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 92
పేజీలు : 8, వెల:రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కాంగోలో పడవ బోల్తా: 38 మంది మృతి

కిన్షాసా: కాంగో మరోమారు పడవ ప్రమాదం సంభవించి 38 మంది ప్రాణాలు కోల్పోయారు. బుసిరా నదిలో పడవ బోల్తా పడి 100 మందికిపైగా గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఉండటంతోనే ప్రమాదం జరిగిందన్నారు. క్రిస్మస్ కోసం సొంతూళ్లకు వెళుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు తెలిపారు. కాగా, ప్రమాదం జరిగినప్పుడు పడవలో 400 మందికిపైగా ఉన్నారని చెప్పారు. 20 మందిని రక్షించగా, మిగతా వారి కోసం సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. 100 మందికిపైగా ఆచూకి లేకపోవడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడమే ప్రమాదానికి కారణమని వారన్నారు.

పుష్పపై ఆగ్రహం

- లోపలకు దూసుకెళ్లేందుకు యత్నం
- రాళ్ల దాడిలో పూలకుండీల ధ్వంసం
- తారస్థాయికి ఉద్రిక్తత
- పోలీసు బలగాలతో భారీ బందోబస్తు

అల్లు అర్జున్ ఇంటి వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన

హైదరాబాద్‌లోని కాంగ్రెస్ నేత ఫసియుద్దీన్ అధ్వర్యంలో అల్లు అర్జున్ దిష్టిబొమ్మ దహనం

దాడిపై ఫిర్యాదు
అల్లు అరవింద్
2లో

విశాలాంధ్ర–హైదరాబాద్/కరీంనగర్: జూబ్లీహిల్స్‌లోని పుష్ప 2 హీరో అల్లు అర్జున్ ఇంటి వద్ద ఆదివారం విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో మహిళ రేవతి మరణానికి అల్లు అర్జునే కారణమంటూ విద్యార్థి సంఘాల నేతలు నినాదాలు చేశారు. బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రేవతి కుటుంబానికి న్యాయం చేయకుండా ... న్యాయ వ్యవస్థపై తనకు నమ్మకం ఉందంటూ చలోక్తులు విసిరిన అల్లు అర్జున్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రెస్‌మీట్ పెట్టి తాను నిర్దోషినని నిరూపించుకోవడానికే అల్లు అర్జున్ ప్రయత్నించారని, సాయం చేస్తానని మభ్యపెట్టడం కూడా చట్ట వ్యతిరేకమన్నారు. ఈ క్రమంలో కొందరు అల్లు అర్జున్ నివాసంపై రాళ్లు విసిరారు. ఆయన ఇంట్లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. రాళ్లు తగిలి ఇంటి ఆవరణలోని పూల కుండీలు ధ్వంసమయ్యాయి. ఉద్రిక్తత తారాస్థాయికి చేరుకోవడంతో అదనపు పోలీసులు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆందోళన జరుగుతున్న సమయంలో అల్లు అర్జున్ ఇంట్లో లేరు. సమాచారం తెలుసుకున్న ఆయన మామ చంద్రశేఖర్‌రెడ్డి అక్కడికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు.

చట్టప్రకారమే చర్యలు: డీజీపీ

పౌరులుగా అందరూ బాధ్యతాయుతంగా ఉండాలని డీజీపీ జితేందర్ అన్నారు. వ్యక్తిగతంగా తాము ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం సంధ్య థియేటర్ ఘటనపై ఆయన స్పందించారు. 'సంధ్య థియేటర్ ఘటన దురదృష్టకరం. అల్లు అర్జున్‌కు మేం వ్యతిరేకం కాదు. చట్ట ప్రకారం ఆయనపై చర్యలు తీసుకున్నాం. ఆయన సినీ హీరో కావొచ్చు... క్షేత్రస్థాయి పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ప్రజల భద్రత కంటే సినిమా ప్రమోషన్ ముఖ్యమైన అంశం కాదు. జర్నలిస్టుపై దాడి కేసులో సినీనటుడు మోహన్‌బాబుపై కేసు నమోదు చేశాం. చట్ట ప్రకారం ఆయనపై చర్యలు ఉంటాయన్నారు.

న్యాయ సలహా తీసుకుంటాం: సీపీ

సంధ్య థియేటర్ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, న్యాయ పరమైన సలహాలు తీసుకుని ముందుకెళ్తామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ నెల నాలుగో తేదీన సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై మీడియా అడిగిన ప్రశ్నలకు సీపీ సమాధాన మిచ్చారు. ఘటనకు సంబంధించి సీసీ ఫుటేజ్‌ను విడుదల చేశారు. బౌన్సర్లు ఇకపై పోలీసులను ముట్టుకున్నా, అనుచితంగా ప్రవర్తించినా వదిలిపెట్టే ప్రసక్తే లేదని సీపీ హెచ్చరించారు.

సినిమా చూసిన తర్వాతే వెళ్తానని చెప్పారు: చిక్కడపల్లి ఏసీపీ

సంధ్య థియేటర్ వద్ద ఈ నెల నాలుగో తేదీ రాత్రి ఏం జరిగిందే విషయాన్ని చిక్కడపల్లి ఏసీపీ

- మిగతా 2 లో

పుష్ప ఘటనలు పునరావృతం కారాదు: నారాయణ 8లో

శ్రీతేజ్‌కు రామకృష్ణ పరామర్శ 8లో



పెగాసెస్‌పై ఇప్పటికైనా సుప్రీంకోర్టు విచారిస్తుందా?

న్యూఢిల్లీ: ప్రముఖ సామాజిక మాధ్యమం వాట్సప్ వినియోగదారులపై ఇజ్రాయిల్‌కు చెందిన ఎన్ఎస్ఓ గ్రూపు నిఘా పెట్టినట్లు అమెరికా కోర్టులో తేలడంతో పెగాసెస్ స్పైవేర్ కేసులో తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఇప్పటికైనా చేపడుతుందా అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సూర్జేవాలా ఆదివారం ప్రశ్నించారు. 300 మంది వాట్సప్ వినియోగదారులపై స్పైవేర్ ద్వారా నిఘా పెట్టినట్లు అమెరికా కోర్టు తీర్పు వచ్చిందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. హ్యాకింగ్‌కు ఎన్ఎస్ఓ గ్రూప్ కారణమని కోర్టు పేర్కొనడంపై వార్తా నివేదికను ట్వీట్‌చేశారు. పెగాసెస్ నిఘా

- మిగతా 2 లో

రైతుల నిరసన 314వ రోజుకు...

చండీగఢ్ : హర్యానా సరిహద్దుకు సమీపంలోని సంగ్రూర్ జిల్లాలోని ఖనౌరీ సరిహద్దులో పంజాబ్ రైతులు నిర్వహిస్తున్న నిరసన ఆదివారం నాటికి 314వ రోజుకు చేరుకుంది. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కి హామీ ఇచ్చే చట్టంతో సహా తమ వివిధ డిమాండ్లపై ఒత్తిడి తేవాలని ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి నిరసనలు చేస్తున్నారు. తమను ఆదుకోవడానికి పెద్ద సంఖ్యలో ఖనౌరీ, శంభు సరిహద్దులకు చేరుకోవాలని రైతు సంఘం నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్

- మిగతా 2 లో

ఐరాస న్యాయ మండలి చైర్‌పర్సన్‌గా జస్టిస్ లోకుర్

న్యూఢిల్లీ: ఐక్యరాజ్య సమితి అంతర్గత న్యాయ మండలి చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకుర్ నియమితులయ్యారు. 2028, నవంబరు 12 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. న్యాయ వృత్తిలో అనుభవం, నైపుణ్యత దృష్ట్యా చైర్‌పర్సన్‌గా జస్టిస్ లోకుర్‌ను ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ నియమించారు. ప్రముఖ న్యాయ నిపుణులతో కూడిన ఈ మండలికి జస్టిస్ లోకుర్ నేతృత్వం వహిస్తారు. మండలి సభ్యులలో ఉరుగ్వేకు చెందిన కార్మెన్ ఆర్టిగస్ ఆస్ట్రేలియా నుంచి రొసాలి బల్కిన్, ఆస్ట్రియా నుంచి స్టీఫన్ బ్రెజినా, అమెరికా నుంచి జయ్ పొంజెనెల్ ఉన్నారు.

ఏపీ సీఎంకు సాంకేతిక రక్షణ

- అటానమస్ డ్రోన్లతో పర్యవేక్షణ
- ఉండవల్లి నివాసంలో భద్రతా ఏర్పాట్లు
- పరిసరప్రాంతాలపై పటిష్ట నిఘా

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో భద్రత కల్పించనున్నారు. అటానమస్ డ్రోన్ల సాయంతో భద్రతా చర్యల పర్యవేక్షణకు అధికార యంత్రాగం నిమగ్నమైంది. ఉండవల్లిలోని సీఎం నివాసంలో అత్యాధునిక డ్రోన్లను ఏర్పాటు చేశారు. సీఎం ఆదేశాలతో సాంకేతిక సాయంతో తక్కువ మందితో మెరుగైన భద్రతకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. చంద్రబాబు నివాసం దగ్గర అటానమస్ డ్రోన్లతో పరిసరి ప్రాంతాల్లో భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ఆయా డ్రోన్లు ప్రతి రెండు గంటలకు ఒకసారి పరిసర ప్రాంతాల్లో ఎగిరి వీడియోలను చిత్రీకరిస్తాయి. అనుమానాస్పద వస్తువులు, కొత్త వస్తువులు కనిపించినా మానిటరింగ్ బృందానికి డ్రోన్లు సమాచారం ఇస్తాయి. సీఎం నివాసంలో ఈ డ్రోన్ అటనామస్ వ్యవస్థను అమర్చారు. ఆటోపైలెట్‌గా ఆయా ప్రాంతాల్లో ఎగిరిన తర్వాత ఆ డ్రోన్... తిరిగొచ్చి నిర్దేశించిన డక్‌పై దిగి... తానే ఛార్జింగ్ పెట్టుకుంటుంది. ఈ డ్రోన్లు పంపే డేటాను విశ్లేషించడం ద్వారా సీఎం ఇంటి పరిసర ప్రాంతాల్లో భద్రతా చర్యల్ని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. అటానమస్ డ్రోన్ల ద్వారా తక్కువ సమయం, సిబ్బందితో ఎక్కువ పని జరిగే అవకాశం ఉంటుంది. సీఎం పర్యటనల సమయంలో ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా చూడాలని, పార్టీ కార్యకర్తలను తనకు దూరం చేసేలా బందోబస్తు ఉండరాదని చంద్రబాబు ఆదేశించారు. దీంతో భద్రతా చర్యలను సరళీకృతం చేయడం, దానికితోడు సాంకేతిక

- మిగతా 2 లో

రైతులపై అణచివేత ఆపాలి

- దిల్లీలో దలేవాల్ ప్రాణాలకు రక్షణ కల్పించాలి
- ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి డిమాండ్
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ ప్రాణాలను కాపాడాలని, ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై అణచివేత చర్యలను ఆపాలని, లక్సర్ జైలు నుంచి రైతులందరినీ విడుదల చేయాలన్న తదితర డిమాండ్లతో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి (ఎస్‌కేఎం) నిరసనలకు పిలుపునిచ్చింది. దేశ వ్యాప్త రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపులో భాగంగా విజయవాడ లెనిన్ సెంటర్‌తో పాటు అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరసనలు కొనసాగుతాయి. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ కోరారు. ఈ నిరసనల అనంతరం ఆయా రైతాంగ సమస్యలపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాసిన వినతి పత్రాన్ని అన్ని జిల్లా కలెక్టర్లకు, అధికారులకు అందజేయనున్నారు. రైతు సంఘాలతో చర్చలు నిర్వహించాలని, రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ ప్రాణాలను కాపాడాలని, ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న

- మిగతా 2 లో

ఏపీలో 2025 సాధారణ...
ఐచ్ఛిక సెలవులు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: 2025 సంవత్సరానికి సంబంధించి ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సాధారణ, ఐచ్ఛిక సెలవులను ప్రభుత్వం అధికారికంగా ఇటీవల విడుదల చేసింది. ఇందులో మొత్తం 23 సాధారణ సెలవులు, 21 ఐచ్ఛిక సెలవులు ఉన్నట్లు తెలిపింది. వచ్చిన సాధారణ సెలవుల్లోనూ రిపబ్లిక్ డే, ఉగాది, శ్రీరామనవమి, మొహర్రం, ఇతర పండుగలు ఆదివారాలు కలిపి ఉన్నాయి. జనవరి, ఏప్రిల్, ఆగస్టు నెలల్లో మాత్రం నాలుగేసి రోజుల చొప్పున సెలవులు వచ్చాయి.

ఏపీలో సాధారణ సెలవులిలా..

జనవరి 13 (సోమవారం) – భోగి
జనవరి 14 (మంగళవారం) – సంక్రాంతి
జనవరి 15 (బుధవారం) – కనుమ
జనవరి 26 (ఆదివారం) – రిపబ్లిక్ డే
ఫిబ్రవరి 26 (బుధవారం) – మహా శివరాత్రి
మార్చి 14 (శుక్రవారం) – హోలీ
మార్చి 3 (ఆదివారం) – ఉగాది
మార్చి 31 (సోమవారం) – రంజాన్
ఏప్రిల్ 5 (శనివారం) – బాబు జగ్జీవన్ రామ్ జయంతి

- మిగతా 2 లో

సింగరేణి... తెలంగాణకు తలమానికం

ఆవిర్భావ దినోత్సవంలో భట్టి

విశాలాంధ్ర–హైదరాబాద్: బొగ్గు ఉత్పత్తి ద్వారా రాష్ట్ర, దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో సింగరేణి సంస్థ కీలక పాత్ర పోషిస్తూ, రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి కాలరీస్ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం జరిగింది. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి సింగరేణి వెన్నెముకగా నిలుస్తుందన్నారు. తెలంగాణలోని ఆరు జిల్లాల్లో లక్షల మంది ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనాధారంగా ఉన్న సింగరేణిని కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం చేయకుండా ఇతర రంగాలలోకి కూడా ప్రవేశించి మరింత విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ సుస్థిర భవిష్యత్ కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శ్రమశక్తిని చాటుతూ సంస్థను అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితమవ్వాలని పిలుపునిచ్చారు.

మళ్లీ భూ ప్రకంపన !



విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ప్రకాశంజిల్లాలో తాజాగా మళ్లీ భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. 24 గంటల్లో రెండోసారి జిల్లాలో భూమి కంపించడంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ముండ్లమూరు మండలంలో ఒక సెకన్ పాటు భూమి కంపించింది. ముండ్లమూరు, సింగన్నపాలెం, మారెళ్లలో ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఒక్కసారిగా భూమి కంపించడంతో ఏం జరిగిందో తెలియక ఇళ్లలో నుంచి బయటకు వచ్చామని స్థానికులు తెలిపారు. 21వ తేదీ శనివారమూ ఇదే ప్రాంతంలో ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో రెండు సెకన్ల పాటు భూమి కంపించంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ముండ్లమూరు, పసుపుగల్లులో వేంపాడు, మారెళ్ల, తూర్పుకంభంపాడు, తాళ్లూరు, శంకరాపురం, పోలవరం, గంగవరం, రామభద్రాపురం, శంకరాపురంలో భూకంపం సంభవించింది. ముండ్లమూరు పాఠశాల నుంచి విద్యార్థులు బయటకు పరుగులు తీశారు. తరచూ భూ ప్రకంపనలు రావడంతో ప్రభుత్వం దృష్టి సారించింది.

మంచి నాయకుడిని కోల్పోయాం

- రొయ్యల కృష్ణమూర్తి మృతికి సీపీఐ సంతాపం
- కూనంనేని సాంబశివరావు, పల్లా వెంకటరెడ్డి నివాళి

విశాలాంధ్ర–మల్కాజిగిరి: సీపీఐ రాష్ట్ర సమితి మాజీ సభ్యుడు రొయ్యల కృష్ణమూర్తి మృతి బాధాకరమని ఎమ్మెల్యే, సీపీఐ తెలంగాణ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. పార్టీ మంచి నాయకుడిని కోల్పోయిందని అన్నారు. ప్రజా ఉద్యమాలలో కృష్ణమూర్తి చురుగ్గా పాల్గొనేవారన్నారు. గుండెపోటు రావడంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కృష్ణమూర్తి (58) శనివారం రాత్రి కన్నుమూశారు. ఆయనకు సీపీఐ నేతలు అరుణాంజలి ఘటించారు. మౌలాలిలోని నివాసానికి వెళ్లి కృష్ణమూర్తి భౌతిక కాయాన్ని సందర్శించారు. కృష్ణమూర్తి భార్య గిరిజ, కుటుంబ సభ్యులను ఓదార్చారు. కూనంనేని మాట్లాడుతూ ఇటీవల మరణించిన ఎస్.బాల మల్లేష్‌కు కృష్ణమూర్తి అత్యంత సన్నిహితుడన్నారు. బాల మల్లేష్ మరణం కృష్ణమూర్తిని కృంగదీసిందని, దాంతో ఆయనకు గుండెపోటు వచ్చిందని, చికిత్స పొందుతూ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నచ్చినోడా! పండక్కి బంగారం చేయించడం మానేసి, తాగడానికి ఉన్న తాళిబొట్టు ఎత్తుకుపోతున్నావా!?

రాహుల్ గాంధీకి
బరేలీ కోర్టు సమన్లు

జనవరి 7న హాజరుకావాలని ఆదేశం



లక్నో : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆర్థిక సర్వేకు సంబంధించి కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై జనవరి 7న తమ ఎదుట హాజరుకావాలని

- మిగతా 2 లో

ఇక వ్యూహాత్మక భాగస్వామ్యం

భారత్, కువైట్ సంకల్పం

న్యూఢిల్లీ/కువైట్: భారత్, కువైట్ దేశాల మధ్య భాగస్వామ్యం వ్యూహాత్మక భాగస్వామ్యంగా పురోగతి సాధించింది. తమ బంధాన్ని మరింత పెంపొందించుకోవాలని రెండు దేశాలు సంకల్పించాయి. ఫార్మా, ఫిన్‌టెక్, మౌలిక వసతులు, రక్షణ, ఐటీ రంగాల్లో సహకారాన్ని మరింతగా పెంచుకోవాలని నిర్ణయించాయి. తమ మైత్రి మరింత బలపడుతుందని ఆకాంక్షించాయి. భారత ప్రధాని మోదీ రెండు రోజుల కువైట్ పర్యటనలో భాగంగా ఆదివారం ఆ దేశ రాజు షేక్ మెషల్ అల్ అహ్మద్ అల్ జుబేర్ అల్ సబాతో భేటీ అయ్యారు. సమావేశం కోసం బయన్ ప్యాలెస్‌కు చేరుకున్న మోదీకి కువైట్ ప్రధాని అహ్మద్ అల్ అబ్దుల్లా అల్ అహ్మద్ అల్ సబా ఘన స్వాగతం పలికారు. కువైట్

- మిగతా 2 లో

స్టాలిన్ 145వ జయంతికి రష్యా అరుణాంజలి

మాస్కో: సోవియట్ విప్లవయోధుడు జోసఫ్ స్టాలిన్ 145వ జయంతిని పురస్కరించుకొని రష్యాలోని రెడ్‌స్క్వేర్ వద్ద ప్రజలు ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. తమ అభిమాన నాయకుడికి అరుణాంజలి ఘటించేందుకు వందలాది మంది ఆయన స్మారకాన్ని సందర్శించారు. గడ్డ కట్టే చలిని సైతం లెక్కచేయకుండా క్రెమిన్ నెక్రోపోలిస్‌లోని స్టాలిన్ సమాధి వద్ద క్యూ కట్టారు. సోవియట్ జెండాలు, స్టాలిన్ చిత్రాలు, పుష్పాలతో కమ్యూనిస్టులు, కార్మికులు, మహిళలు, పురుషులు, అన్ని వయస్సుల వారు స్టాలిన్‌కు విప్లవాంజలి ఘటించారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ లెనిన్‌గ్రాడ్ సహా రష్యాలోని ఇతర నగరాల్లోనూ స్టాలిన్‌కు ఘనంగా నివాళులర్పించారు.

అధైర్యపడేందుకు ఇది సమయం కాదు

పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పాలా రైముండో పిలుపు

లిస్బన్: ప్రజలను చైతన్యపరిచేందుకు, వారితో సంబంధాలను మరింతగా బలపర్చుకునేందుకు గొప్ప మాధ్యమంగా స్థానిక ఎన్నికలు ఉండాలని పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ (పీసీపీ) ప్రధాన కార్యదర్శి పౌలా రైముండో పిలుపునిచ్చారు. అధైర్యపడేందుకు ఇది సమయం కాదని ఉద్ఘాటించారు. నేటి పరిస్థితులు సవాళ్లభరితంగా ఉన్నాయని, ప్రత్యర్థి వద్ద బలం, వనరులు పుష్కలంగా ఉన్నాయని...పార్టీని మరింతగా బలపర్చుకోవాలన్నారు. పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ 22వ మహాసభలు రాజధాని లిబ్బన్‌లోని అల్మాడా జిల్లాలో విజయవంతమైంది. ఈ సందర్భంగా 125 మంది కేంద్ర కమిటీకి కొత్తగా ఎన్నికయ్యారు. మహాసభల ముగింపు సభలో పార్టీ ప్రధాన కార్యదర్శి పౌలా రైముండో ప్రసంగించారు. పీసీపీపై నమ్మకంతో భుజం భుజం కలిపి ముందడుగు వేయాలన్నారు. నేటి అనిశ్చితి

దృష్ట్యా పార్టీ మరింత బలపడటం అవసరమని సూచించారు. అన్యాయాన్ని ఎదిరించేందుకు, పెట్టుబడిదారీ వర్గ ఆటలను కట్టడి చేసేందుకు, కార్మికులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కమ్యూనిస్టు పార్టీ అవసరం పోర్చుగీస్ ప్రజలకు ఎంతో ఉందన్నారు. ప్రజల్లో ఆశలు, విశ్వాసాన్ని నింపే దిక్సూచిగా పార్టీ ముందుకెళ్లాలని సూచించారు. దేశానికి ఎంతో అవసరమైన కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేసుకోవడమ తక్షణ కర్తవ్యమన్నారు. పార్టీ బలహీనంగా ఉందని భావించిన వారికి ఈ మహాసభల ద్వారా మన బలం, ఐక్యత, సంకల్పం, ధైర్యం తెలిసి వచ్చాయని పార్టీ ప్రధాన కార్యదర్శి ఉద్ఘాటించారు. మనల్ని నిలదీయాలనుకున్న వారికే ప్రశ్నలు ఎదురయ్యాయన్నారు. కార్మికులు, ప్రజలు, యువతలో ధృఢ సంకల్పం ప్రత్యర్థులను ఆశ్చర్యపరిచిందన్నారు. మన పోరాటం ఆగకూడదని పిలుపునిచ్చారు. తన ప్రసంగాన్ని ముగిస్తూ శాంతి వర్థిల్లాలి! 22వ మహా సభ వర్థిల్లాలి!! పీసీపీ వర్థిల్లాలి!! అంటూ నినాదాలిచ్చారు.

మాతో పెట్టుకోవద్దు

అమెరికాకు చైనా హెచ్చరిక: తైవాన్‌కు రక్షణ సాయంపై మండిపాటు

బీజింగ్: తైవాన్ విషయంలో అమెరికా జోక్యాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. ద్వీప దేశానికి అగ్రరాజ్యం 571.3 మిలియన్ డాలర్ల రక్షణ సాయాన్ని ప్రకటించడాన్ని ఆక్షేపించింది. మాతో పెట్టుకోవద్దు... మా వ్యవహారాల్లో తలదూర్చవద్దంటూ అమెరికాను హెచ్చరించింది. తైవాన్‌తో ఉద్రిక్తత క్రమంలో అమెరికా జోక్యం చైనాకు కోపం తెప్పించింది. తైవాన్ అధ్యక్షుడు 'లాయ్ చింగ్ తె' అమెరికాకు చెందిన హవాయి, గువామ్‌లో పర్యటించడం కూడా చైనా ఆగ్రహానికి కారణమయ్యాయి. దీంతో తైవాన్ చుట్టుపక్కల సైన్యాన్ని మోహరిస్తోంది. ఈ పరిస్థితుల్లో తైవాన్‌కు అమెరికా సాయాన్ని ప్రకటించడంతో చైనా మండిపడింది. 'తైవాన్ జలసంధిలో శాంతి, స్థిరత్వాన్ని దెబ్బతీసే చర్యలను ఆపండి. నిప్పుతో చెలగాటం వద్దు' అంటూ అమెరికాకు బీజింగ్ విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో హెచ్చరించింది. అమెరికా అధ్యక్ష పదవి నుంచి వైదొలగనున్న జో బైడెన్... తైవాన్‌కు రక్షణ సాయం ప్రకటించిన విషయం విదితమే. 265 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాల విక్రయానికి, 571 మిలియన్ డాలర్ల రక్షణ సాయానికి బైడెన్ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. తైవాన్ రక్షణ వ్యవస్థ మెరుగుదల, సైనిక శిక్షణ, యుద్ధ సామగ్రి కొనుగోలు కోసమే తమ సాయమని బైడెన్ చెప్పడం తెలిసిందే.

హౌతీలపై అమెరికా ప్రతీకార దాడులు

సనా: ఇజ్రాయిల్ రాజధాని టెల్ అవీవ్‌పై హౌతీల క్షిపణి దాడులకు ప్రతీకారంగా అమెరికా దాడులు చేసింది. యెమన్ రాజధాని సనాలోని హౌతీల స్థావరాలే లక్ష్యంగా దాడులు సాగించింది. హౌతీల కార్యకలాపాలు దెబ్బతిసేలా ఎర్ర సముద్రం, బాబ్ అల్ మాండెబ్, ఏడెన్ గల్ఫ్‌లో వాణిజ్య నౌకలపై దాడులు చేశామని అమెరికా సైన్యం ప్రకటించింది. హౌతీల కార్యకలాపాలకు అంతరాయం కలిగించడమే తమ దాడుల లక్ష్యమని తెలిపింది. అయితే టెల్‌అవీవ్‌పై హౌతీలు దాడి చేసిన కొన్ని గంటల్లోనే అమెరికా ప్రతీకార దాడులు చేయడం గమనార్హం.

పెగాసెస్‌పై ఇప్పటికైనా సుప్రీంకోర్టు విచారిస్తుందా?

(మొదటిపేజీ తరువాయి)

పెట్టిన ఆ 300 మందికి మోదీ ప్రభుత్వం సమాధానం చెప్పే సమయం ఇదేనన్నారు. 'ఆ ఇద్దరు కేంద్ర మంత్రులు ఎవరు? ముగ్గురు విపక్ష నేతలు ఎవరు? రాజ్యాంగబద్ధ అధికారి ఎవరు? జర్నలిస్టులు ఎవరు? వ్యాపారవేత్తలు ఎవరు? బీజేపీ ప్రభుత్వం, ఏజెన్సీలు సేకరించిన సమాచారం ఏమిటి? అది ఎలా వినియోగమైంది... ఏ విధంగా దుర్వినియోగమైంది? దాని పర్యవసానాలు ఏమిటి? అంటూ మోదీ ప్రభుత్వానికి సూర్జేవాలా వరుస ప్రశ్నలు సంధించారు. ఎన్ఎస్ఓను నడిపే కంపెనీపై, ప్రస్తుత ప్రభుత్వంలోని అధికారులపై క్రిమినల్ కేసులు పెడతారా అని అడిగారు. మెటా వర్సెస్ ఎన్ఎస్ఓ కేసులో అమెరికా కోర్టు తీర్పును సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంటుందా? 2021-22లో పెగాసెస్ స్పైవేర్‌పై సాంకేతిక నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను బహిర్గతం చేస్తుందా? అని సూర్జేవాలా ప్రశ్నించారు. పెగాసెస్ కేసులో న్యాయం కోసం 300 మంది భారతీయులతో పాటు మొత్తం 1400 వాట్సప్ నంబర్లపై సుప్రీంకోర్టు ఆరా తీస్తుందా? ఈ వ్యవహారంలో తదుపరి విచారణను చేపడుతుందా? మెటా నుంచి ఆ 300 మంది పేర్లు కోరుతుందా? పెగాసెస్ బారిన పడిన 300 మంది పేర్లను విడుదల చేయాల్సిన బాధ్యత ఫేస్‌బుక్ (మెటా)పై లేదా? అంటూ సూర్జేవాలా ఎక్స్ వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. ఇదిలావుంటే వాట్సప్‌లోని బగ్ సాయంతో ఇజ్రాయిల్ సంస్థ తమ వినియోగదారులపై అనధికారికంగా నిఘా పెట్టినట్లు ఓక్లాండ్ కోర్టులో ఐదేళ్ల క్రితం మెటా దావా వేసింది. హ్యాకింగ్, ఒప్పంద ఉల్లంఘనకు ఎన్ఎస్ఓ బాధ్యత వహించాలని మెటాకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చింది.

రైతుల నిరసన 314వ రోజుకు...

(మొదటిపేజీ తరువాయి)

ముందుగా రెండు రాష్ట్రాల నివాసితులకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతుల డిమాండ్లను నొక్కి చెప్పడానికి 20 రోజులకు పైగా ఆమరణ నిరాహార దీక్ష రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దలేవాల్ ఇటీవల ఖనౌరి సరిహద్దులో నిరసన స్థలంలో స్పృహ తప్పి పడిపోయిన తరువాత ఉద్రిక్తతలు పెరిగాయి. సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర) కన్వీనర్ జగ్జిత్ సింగ్ దలేవాల్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండేలా చూడడం పంజాబ్ అధికారుల బాధ్యత అని సుప్రీం కోర్టు శుక్రవారం పేర్కొంది. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం దలేవాల్ ఆరోగ్యానికి ఎలాంటి హాని జరగకుండా చూసేందుకు తీసుకున్న చర్యలతో పాటు అతని ఆరోగ్య పరిస్థితిపై అఫిడవిట్ దాఖలు చేయాలని పంజాబ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైద్య బోర్డు (దలేవాల్ ఆరోగ్యాన్ని పర్యవేక్షించడానికి ఏర్పాటు చేయబడింది) చైర్‌పర్సన్‌ను కోరింది.

రాహుల్ గాంధీకి బరేలీ కోర్టు సమన్లు

(మొదటిపేజీ తరువాయి)

ఇక్కడి కోర్టు సమన్లు జారీ చేసింది. రాహుల్ గాంధీకి జిల్లా, సెషన్స్ జడ్జి సుధీర్ కుమార్ శనివారం నోటీసు జారీ చేశారు. అఖిల భారత హిందూ మహాసంఘ్ సంస్థ మండల అధ్యక్షుడు పంకజ్ పాఠక్ దాఖలు చేసిన పిటిషన్‌కు సంబంధించిన సమన్లు ఇవి. గాంధీపై కేసు నమోదు చేయాలని అభ్యర్థిస్తూ పాఠక్ తొలుత ఆగస్టులో ఎమ్మెల్యే-ఎంపీ కోర్టు/సీజేఎం కోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టు ఆగస్టు 27న దరఖాస్తును తిరస్కరించింది. పాఠక్ సెషన్స్ కోర్టులో రివిజన్ పిటిషన్‌ను దాఖలు చేయడంతో ప్రస్తుత సమన్లకు దారితీసింది. పాఠక్ తరపున వాదిస్తున్న న్యాయవాది వీరేంద్ర పాల్ గుప్తా... లోక్‌సభ ఎన్నికల సమయంలో గాంధీ, 'బలహీన వర్గాల శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ, వారి స్వంత ఆస్తి శాతం చాలా తక్కువగా ఉంది. ఇది ఇలాగే కొనసాగితే, అధిక జనాభా ఉన్నవారు మరింత ఆస్తిని డిమాండ్ చేయవచ్చుని చెప్పారని' పేర్కొన్నారు. 'రాజకీయ లబ్ధి కోసం వర్గ విద్వేషాన్ని సృష్టించడం' లక్ష్యంగా ఉన్న ఈ ప్రకటనలతో గాంధీ బలహీన వర్గాలను రెచ్చగొట్టడానికి ప్రయత్నించారని గుప్తా ఆరోపించారు. కాంగ్రెస్ ప్రయోజనాలను పెంచే ప్రయత్నంలో ఆర్థికంగా బలహీన వర్గాల మధ్య శత్రుత్వాన్ని విత్తడానికి గాంధీ ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించారని ఆరోపించారు.

వలంటీర్ల వర్రీ

- రూ.10 వేల గౌరవభృతిపై ఆశలు
- ఆరు నెలలైనా స్పందించని కూటమి సర్కారు
- హామీల అమలు కోసం ఉద్యమబాట
- 2న మంత్రివర్గ సమావేశంలో స్పష్టత వచ్చేనా?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

గౌరవ వేతనం రాక...ఉద్యోగ భద్రత లేకపోవడంతో రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లు కలవరం చెందుతున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి పార్టీల(టీడీపీ, జనసేన) తరఫున ప్రస్తుత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విడుదల చేసిన మేనిఫెస్టోలో వలంటీర్లకు రూ.5వేల నుంచి రూ.10వేలకు గౌరవ వేతనం పెంచుతామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయినా...వారి గౌరవ వేతనం ప్రస్తావనేలేదు. ఇచ్చినమాట ప్రకారం అమలు చేస్తే... ఈ ఆరు నెలల నుంచి ప్రతి వలంటీరుకు రూ.60వేల బకాయిలు చెల్లించాల్సి ఉంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన అనేక కేబినెట్ సమావేశాలు జరిగాయిగానీ ఇప్పటివరకు వలంటీర్ల వ్యవస్థ ప్రస్తావనే లేదు. ఈనెల 2వ తేదీన జరగబోయే కేబినెట్ భేటీలోనైనా వలంటీర్లకు మోక్షం కలుగుతుందా? లేదా? అని ఎదురు చూస్తున్నారు. వలంటీర్లకు గౌరవవేతనం, ఉద్యోగభద్రత కల్పించాలన్న డిమాండ్లతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్ల అసోసియేషన్(ఏఐవైఎఫ్ అనుబంధం) అధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు కొనసాగుతున్నాయి. విజయవాడ ధర్నా చౌక్ కేంద్రంగా నిరహార దీక్షలు చేపట్టి..ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చింది. 2.60 లక్షల మంది వలంటీర్లను నియమించింది. వీరి ద్వారానే ప్రతి నెలా పెన్షన్ల పంపిణీ, పథకాల అమలు, రేషన్ పంపిణీ వంటి ముఖ్యమైన పనులు జరిగేవి. ఇటీవల సార్వత్రిక ఎన్నికల సమయంలో వలంటీర్లను ఎన్నికల సంఘం పక్కనపెట్టింది. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పెన్షన్ల డబ్బుల్ని లబ్ధిదారుల ఖాతాల్లోను, కొందరికి ఇళ్లకు తీసుకెళ్లి పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో వేలాదిమంది వలంటీర్లు రాజీనామా చేశారు. వలంటీర్ల వ్యవస్థ కొనసాగిస్తామని, వారి గౌరవ వేతనం రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచుతామని కూటమి పార్టీలు హామీ ఇచ్చాయి. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ల బదులు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల చేత పెన్షన్లు పంపిణీ చేయిస్తున్నారు. నాడు ఉద్యోగ

భద్రతతోపాటు వేతనాలు పెంచుతారన్న ఆశతో ఇంటర్ నుంచి డిగ్రీ, పీజీ చదివిన నిరుద్యోగులు వలంటీర్లుగా చేరారు. గత ప్రభుత్వ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొని..వారంతా విభిన్న సేవలందించి ప్రజల మన్ననలు పొందారు. వలంటీర్లు లేకపోతే సంక్షేమ పథకాలు లేవనే స్థాయికి వచ్చింది. ఎన్నికల సమయంలో వైసీపీ నేతల ఒత్తిళ్లతోగానీ, ఇతరత్రా కారణాలతోగానీ లక్షా 7వేల మంది రాజీనామాలు చేసినట్లుగా కూటమి ప్రభుత్వం చెబుతోంది. అదే ప్రభుత్వ లెక్కల ప్రకారం మరో లక్షా 53వేల మంది వలంటీర్లుగా ఉన్నట్లు లెక్కలు చూపుతున్నాయి. ఆయా రాజీనామాల లెక్కలను తారుమారుచేసి... వలంటీర్ల వ్యవస్థకే మంగళం పాడే తరహాగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్న విమర్శలున్నాయి.

రూ.203 కోట్లు ఎలా ఇచ్చారు ?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జులైలో జరిగిన అసెంబ్లీలో వలంటీర్ల గౌరవ వేతనం కోసం (రూ.5వేల చొప్పున) గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.203కోట్ల నిధులకు బడ్జెట్ కేటాయింపులకు ఆమోదించింది. ఆ తర్వాత గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులకు, వలంటీర్లకు పేపర్ కోసం కేటాయించిన రూ.200 రద్దుచేస్తూ ఉత్తర్వులిచ్చారు. గత ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను 2023 ఆగస్టు 15న రెన్యువల్ చేయాల్సి ఉందని, ప్రస్తుతం వలంటీర్లు ఉద్యోగాల్లో లేనట్లేనంటూ గ్రామ, వార్డు సచివాలయ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయులు వ్యాఖ్యానించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బయట జరిగిన సమావేశాల్లో జీవో రెన్యువల్ కాలేదంటూ దాటవేత వేశారు. అలాంటపుడు గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.203 కోట్ల బడ్జెట్‌ను ప్రస్తుత ఈ కూటమి ప్రభుత్వం ఎందుకు మంజూరు చేసింది?, దానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని దాటవేసేందుకే ప్రభుత్వం కుంటిసాకులు చెబుతుందన్న విమర్శలున్నాయి. సూపర్-6లో ప్రభుత్వం పెన్షన్లను పెంచి..వాటిని ప్రతినెలా సక్రమంగా అమలు చేస్తోంది. అదే సమయంలో వలంటీర్లకు చెందిన చిన్న చిన్న డిమాండ్ల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, నెలకు రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్లపై అన్ని జిల్లాల్లోనూ వలంటీర్లు రోడ్డెక్కి ఆందోళనబాట పట్టారు.వారికి ఏపీ రాష్ట్ర వలంటీర్ల అసోసియేషన్ అండగా నిలుస్తోంది. మంత్రి వాసంశెట్టి సుభాష్... వలంటీర్ల వ్యవస్థ కచ్చితంగా ఉంటుందని ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఆసక్తిగా మారాయి. ఇదే శాఖకు చెందిన మంత్రి డోలా వీరాంజనేయులు మాత్రం వలంటీర్ల వ్యవస్థ ప్రస్తుతం మనుగడలో లేదని శాసన మండలిలో వైసీపీ సభ్యులడిగిన ప్రశ్నలకు బదులివ్వడం గమనార్హం. వీరిద్దరి మాటలు చూస్తుంటే..ప్రజల్ని తప్పుదోవ పట్టించడంతోపాటు వలంటీర్ల వ్యవస్థను కొనసాగించలేకే మైండ్‌గేమ్‌కు దిగుతున్నారన్న వాదనలున్నాయి. వలంటీర్ల వ్యవస్థ కొనసాగింపు పైన, వారికి రూ.10వేల గౌరవ వేతనంపై జనవరి2న జరిగే కేబినెట్‌లో చర్చించాలని కోరుతున్నారు.

28న ఉద్యమ కార్యాచరణ -ఏపీ స్టేట్ వలంటీర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లంకా గోవిందరాజులు

వలంటీర్లు ప్రజలకు కావాలా? వద్దా? అనే అంశంపై ఈనెల 28వ తేదీ నుంచి ఉద్యమ కార్యాచరణకు సన్నద్ధమవుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్టేట్ వలంటీర్ల అసోసియేషన్(ఏఐవైఎఫ్ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంకా గోవిందరాజులు తెలిపారు. ఇప్పటికే దేవస్థానం నుంచి న్యాయస్థానం పేరుతో ఉద్యమం నిర్వహించినట్లు గుర్తుచేశారు. త్వరలో న్యాయస్థానం మెట్లెక్కనున్నట్లు చెప్పారు.

'పుష్ప' పై ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

రమేశ్ కుమార్ మీడియాకు వివరించారు. 'అల్లు అర్జున్ మేనేజర్ సంతోష్‌ని కలిసి తొక్కిసలాటలో మహిళ చనిపోయింది, బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు, పరిస్థితి అదుపుతప్పింది, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించాం. అయినా... మేనేజర్ మమ్మల్ని అల్లు అర్జున్ వద్దకు వెళ్లనీయలేదు. అతి కష్టం మీద వారిని నెట్టుకుంటూ వెళ్లి జరిగిన విషయం అల్లు అర్జున్‌కు చెప్పా. మీకు అధికారులంతా సహకరించి రూట్ క్లియర్ చేశారు. దయ చేసి ఇక్కడి నుంచి ఖాళీ చేయండి అని చెప్పా. సినిమా చూసిన తర్వాతే వెళ్తానని చెప్పారు. వెంటనే డీసీపీకి చెప్పాం. ఆయన... మేము లోపలికి వచ్చి 10 నిమిషాలు సమయం

ఇచ్చాం. ఆ తర్వాత అల్లు అర్జున్‌ను బయటకు తీసుకొచ్చాం. మేం లోపలికి వెళ్లే వీడియోలు ఉన్నాయి. అల్లు అర్జున్‌తో మాట్లాడే ఫుటేజ్ కోసం ట్రై చేశాం దొరకలేదు' అని చిక్కడపల్లి ఏసీపీ వివరించారు. "అల్లు అర్జున్ వద్దకు తాము వెళ్లేందుకు మేనేజర్ ఒప్పుకోలేదు. అక్కడి నుంచి అల్లు అర్జున్ వెళ్లకపోతే పరిస్థితి చేయి దాటిపోతుందని చెప్పాం' అని చిక్కడపల్లి ఎస్‌హెచ్ఓ తెలిపారు.

రైతులపై అణచివేత ఆపాలి

(మొదటిపేజీ తరువాయి)

రైతులపై అణచివేతను ఆపాలని నోయిడా-గ్రేటర్ నోయిడా రైతులందరినీ లక్సర్ జైలు నుంచి తక్షణమే విడుదల చేయాలని, జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, అన్ని రైతు సంఘాలతో తక్షణమే చర్చించాలని రైతు సంఘాల సమన్వయ సమితి డిమాండ్ చేస్తోంది. 2021 డిసెంబరు 9న సంయుక్త కిసాన్ మోర్చాతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఎన్డీఏ-2 ప్రభుత్వం ఉల్లంఘించింది. అయితే దిల్లీ సరిహద్దుల్లో రైతుల చారిత్రాత్మక పోరాటం నేపథ్యంలో కేంద్రం మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసింది. 18వ లోక్‌సభ ఎన్నికల అనంతరం ఎన్డీఏ-3 ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 2024 జులై 16,17,18 తేదీల్లో రైతు సంఘాల సమన్వయ సమితి అధ్వర్యంలో ప్రధాన మంత్రికి, పార్లమెంటు ఉభయ సభల్లోని ప్రతిపక్ష నాయకులకు, ఎంపీలకు వినతిపత్రం అందజేసింది. 9 ఆగస్టు 2024న దేశ వ్యాప్తంగా వ్యవసాయంపై కార్పొరేట్ నియంత్రణకు వ్యతిరేకంగా రైతులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. రైతు సంఘాల సమన్వయతో పాటు కేంద్ర కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల వేదికలు 500 కంటే ఎక్కువ జిల్లాల్లో భారీ కార్మిక-రైతు నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. దాదాపు 10 లక్షల మంది ప్రజలు పాల్గొని వినతులు సమర్పించారు. ప్రధాని మోదీ... రైతు సంఘాలతో చర్చలు నిర్వహించేందుకు సిద్ధంగా లేరు. దీంతో పాటు రైతులు శాంతియుత ప్రదర్శనలు నిర్వహించినందుకు వారిపై బాష్ప వాయు గోళాలు, రబ్బర్ బుల్లెట్లు, జల ఫిరంగులు ప్రయోగించడంతో పాటు వందలాది మంది రైతులను జైళ్లలో పెట్టడం ద్వారా పంజాబ్, ఉత్తర ప్రదేశ్‌లోని నోయిడా, గ్రేటర్ నోయిడాలోని శంభు, ఖనౌరి సరిహద్దుల్లో రైతుల పోరాటాలను క్రూరంగా అణిచివేసేందుకు స్థిరమైన గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయి. తక్షణమే రాష్ట్రపతి జోక్యం చేసుకొని వాటిని పరిష్కరించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఈ నిరసనలను రైతు సంఘాల సమన్వయ సమితి చేపట్టనుంది. అనంతరం రాష్ట్రపతికి రాసిన వినతిని జిల్లా కలెక్టర్లకు నేతలు సమర్పిస్తారు.

ఏపీలో 2025 సాధారణ... ఐచ్ఛిక సెలవులు

(మొదటిపేజీ తరువాయి)

ఏప్రిల్ 6 (ఆదివారం) - శ్రీరామ నవమి
ఏప్రిల్ 14 (సోమవారం) - అంబేద్కర్ జయంతి
ఏప్రిల్ 18 (శుక్రవారం) - గుడ్ ఫ్రైడే
జూన్ 7 (శనివారం) - ఈదుల్ అజా (బక్రీద్)
జూలై 6 (ఆదివారం) - మొహర్రం
ఆగస్టు 8 (శుక్రవారం) - వరలక్ష్మీవ్రతం
ఆగస్ట్ 15 (శుక్రవారం) - స్వాతంత్ర్య దినోత్సవం
ఆగస్ట్ 16 (శనివారం) - శ్రీ కృష్ణాష్టమి
ఆగస్ట్ 27 (బుధవారం) - వినాయక చవితి
సెప్టెంబర్ 5 (శుక్రవారం) - ఈద్ మిలాదున్ నబీ
సెప్టెంబర్ 30 (మంగళవారం) - దుర్గాష్టమి
అక్టోబర్ 2 (గురువారం) - మహాత్మా గాంధీ జయంతి/విజయ దశమి
అక్టోబర్ 20 (సోమవారం) - దీపావళి
డిసెంబర్ 25 (గురువారం) - క్రిస్మస్

ఐచ్ఛిక సెలవులు ఇవీ...

జనవరి 1 (బుధవారం) - నూతన సంవత్సరం
జనవరి 123 (సోమవారం) - హజ్రత్ అలీ పుట్టినరోజు
జనవరి 27 (సోమవారం) - షాబ్-ఇ-మెరాజ్
ఫిబ్రవరి 14 (శుక్రవారం) - షబే ఎ బరాత్
మార్చి 22 (గురువారం) - షాహదత్ అలీ
మార్చి 28 (శుక్రవారం) - జుమాతుల్ వాడ / షాబ్-ఇ-ఖాదర్
ఏప్రిల్ 10 (గురువారం) - మహావీర్ జయంతి
ఏప్రిల్ 30 (బుధవారం) - బసవ జయంతి
మే 12 (సోమవారం) - బుద్ధ పూర్ణిమ
జూన్ 15 (ఆదివారం) - ఈద్-ఎ-గదీర్
జూన్ 27 (శుక్రవారం) - రథ యాత్ర
జూలై 5 (శనివారం) - మొహర్రం
ఆగస్ట్ 15 (శుక్రవారం) - శ్రావణ పూర్ణిమ
సెప్టెంబర్ 21 (ఆదివారం) - మహాలయ అమవాస్య
సెప్టెంబర్ 9 (గురువారం) - యాజ్ దహుమ్ షరీఫ్
నవంబర్ 5 (బుధవారం) - కార్తీక పూర్ణమ/గురునానక్ జయంతి
డిసెంబర్ 24 (బుధవారం) - కిస్మస్ ఈవ్
డిసెంబర్ 26 (శుక్రవారం) - బాక్సింగ్ డే
అక్టోబర్ 19 (ఆదివారం) - నరక చతుర్థి

దాడిపై ఫిర్యాదు: అల్లు అరవింద్

విశాలాంధ్ర-హైదరాబాద్: జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ ఇంటిపై జరిగిన దాడిని ఆయన తండ్రి, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తీవ్రంగా ఖండించారు. బన్నీ నివాసం వద్ద ఆదివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. మా ఇంటి వద్ద జరిగిన ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాం. కేసు నమోదు చేశారు. మా ఇంటి దగ్గర మళ్లీ ఎవరు గొడవ చేసినా వాళ్లను తీసుకెళ్లేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని... అరెస్ట్ తప్పదని హెచ్చరించారు. సంయమనం పాటించాల్సిన అవసరం ఉందని అన్నారు. దయచేసి అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా, పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ దగ్గర తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా.. ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు వేసి అల్లు అర్జున్ను అరెస్ట్ వేయగా.. వాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. వెంటనే బన్నీ హై కోర్టును ఆశ్రయించగా అక్కడ ఊరట లభించింది. ఈ కేసులో అల్లు అర్జున్కు హై కోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

ఏపీ సీఎంకు సాంకేతిక రక్షణ

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు చేపట్టేందుకు అధికారులు నిమగ్నమయ్యారు. అన్ని జిల్లాల అధికారులు ఈ ఆదేశాలు పాటించాలని ప్రభుత్వం తేల్చిచెప్పింది. సీఎం ఆదేశాలతో అధికారులు భద్రతలో సమూల మార్పులు తీసుకొచ్చారు. ప్రైవేట్ కార్యక్రమాలకు వెళ్తున్న సందర్భంలో అక్కడి వారికి ఇబ్బంది లేకుండా పరిమిత సిబ్బందిని పెట్టాలని సీఎం ఆదేశించారు. ఇలాంటి ప్రాంతాల్లో బందోబస్తు హడావుడి తగ్గించాలని సూచించారు. ప్రతి విషయంలో సీఎం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉండడంతో చాలా వరకు సీఎం పర్యటన సందర్భంగా ఆంక్షల సమస్య తలెత్తడం లేదు. వాటిని మరింత సరళీకృతం చేసేందుకు భద్రతా అధికారులు సిద్ధమయ్యారు. దీంతో గత ముఖ్యమంత్రికి ఉన్న భారీ భద్రతకు, బందోబస్తు చర్యల కంటే ప్రస్తుత సీఎం చంద్రబాబుకు భద్రతా చర్యల్లో తేడా స్పష్టంగా కన్పిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రికి 980మందితో భద్రత కల్పించగా... ఇప్పుడది కేవలం 121మందికి చేరింది. వైఎస్ జగన్ సీఎంగా ఉండగా... ఆయన కాన్వాయిలో 17వాహనాలు ఉండగా, జడ్ ప్లస్ భద్రత ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు వాహన శ్రేణి 11వాహనాలకే పరిమితమైంది. ఇతర రాష్ట్రాల్లో పర్యటించినప్పుడు... అవసరమైన కనీస సిబ్బందితో ఆయన భద్రత కొనసాగుతుంది. ఎక్కువ మంది పోలీసులు, సిబ్బంది కంటే..సాంకేతికతో తక్కువ మందితో మెరుగైన భద్రతపై సీఎం దృష్టి పెట్టారు.

ఇక వ్యూహాత్మక భాగస్వామ్యం

(మొదటిపేజీ తరువాయి)

రాజుతో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. లక్షలాది మంది భారతీయులను కువైట్ ఆదరిస్తుండటంపై హర్షం వ్యక్తంచేశారు. అక్కడి ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తమ దేశాభివృద్ధికి భారత్ తోడ్పాటును కువైట్ రాజు అభినందించారు. కువైట్ 'విజన్ 2035'... లక్ష్యసాధన కోసం ఆ దేశం కార్యాచరణను మోదీ మెచ్చుకున్నారు. ఇటీవల గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)ను విజయవంతంగా నిర్వహించినందుకు అభినందించారు. అరేబియల్ గల్ఫ్ కప్ ప్రారంభోత్సవానికి 'గెస్ట్ ఆఫ్ హానర్'గా తనను ఆహ్వానించిన కువైట్ రాజుకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. కువైట్ రాజు కూడా మోదీతో ఆత్మీయంగా మాట్లాడారు. పరస్పర సంబంధాల బలోపేతాన్ని ఆకాంక్షించారు. తమ దేశాభివృద్ధికి భారత్ సహకారాన్ని కొనియాడారు. భారత్ పాత్రను ప్రశంసించారు. కువైట్‌కు, గల్ఫ్ ప్రాంతానికి విలువైన భాగస్వామి దేశంగా భారత్‌ను అభివర్ణించారు. ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ (ఎంఈఏ) ఒక ప్రకటన చేసింది. కువైట్ రాజుతో భేటీ అనంతరం మోదీ ఎక్స్ మాధ్యమంగా తన అనుభవాన్ని పంచుకున్నారు. తమ సమావేశం స్నేహపూర్వకంగా, ఫలప్రదంగా సాగినట్లు పేర్కొన్నారు. విజన్ 2035 సాధనలో భారత్ నుంచి గణనీయమైన తోడ్పాటును కువైట్ ఆశిస్తున్నట్లు ఎంఈఏ పేర్కొంది. కాగా, భారత్‌కు రావాలని కువైట్ రాజును మోదీ ఆహ్వానించారు.

మోదీకి కువైట్ అత్యున్నత పురస్కారం

నాలుగు దశాబ్దాల తర్వాత తమ దేశానికి భారత ప్రధాని రావడాన్ని కువైట్ స్వాగతించింది. ప్రధాని మోదీని తమ దేశ అత్యున్నత పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్'తో సన్మానించింది. భారత్, కువైట్ మధ్య ద్వైపాక్షిక బంధం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించింది. ఈ దిశగా భారత్ అందించే తోడ్పాటుకుగాను అత్యున్నత పురస్కారంతో భారత ప్రధానిని సత్కరించింది. ఈ గౌరవాన్ని అందుకోవడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. రెండు దేశాల దీర్ఘకాల మైత్రికి ఈ పురస్కారాన్ని ఆయన అంకితమిచ్చారు. ఇదిలావుంటే, మోదీకి ఇది 20వ అంతర్జాతీయ పురస్కారం.

మంచి నాయకుడిని కోల్పోయాం

(మొదటిపేజీ తరువాయి)

తుదిశ్వాస విడిచారని కూనంనేని సాంబశివరావు చెప్పారు. కృష్ణమూర్తి ఆరోగ్యంపై ఆయన భార్యకు ఫోన్ చేయగా కోలుకుంటున్నారని చెప్పారని, తెల్లారేసరికి దుర్వార్త వినాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. మౌలాలిలోని కృష్ణమూర్తి నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయాన్ని కూనంనేని సందర్శించారు. పుష్పాంజలి ఘటించారు. కృష్ణమూర్తికి నివాళులర్పించిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నర్సింహ, వీఎస్ బోస్, మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్ రెడ్డి, నాయకుడు రచ్చ కిషన్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, యాదాద్రి భోనగిరి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, మేడ్చల్ జిల్లా కార్యదర్శి సాయిల్ గౌడ్,

జిల్లా నాయకులు దశరథ, సహదేవ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాదర్శి ధర్మేంద్ర, ఉపాధ్యక్షుడు సత్యప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్ రెడ్డి, ఉమా మహేశ్, స్థానిక నాయకులు శంకర్, యాదయ్య గౌడ్, సత్యనారాయణ, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్‌తో పాటు నాయకులు కరణం గోపి, వగ్గు చంద్రశేఖర్, బత్తిని నర్సింహా గౌడ్, జనార్థన్, కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు చుంకు శ్రీనివాస్ ఉన్నారు.

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉద్యోగ, నియామకాలు జరపాలి

సీఎంను కలిసి కోరిన ఆదివాసీ ఎమ్మెల్యేల ప్రతినిధి బృందం

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ ఎమ్మెల్యే, వెడ్మా బొజ్జు పటేల్ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయుల నియామకానికి సంబంధించిన జిఓ-3 ని సుప్రీంకోర్టు కొట్టివేయడంతో షెడ్యూల్డ్ ఏరియాలోని గిరిజన నిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని జి.ఓ. 3కి బదులుగా విద్యా హక్కు చట్టం కింద భాషా ప్రాతిపదిక మీద ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని అవి కూడ ఐటిడిఎ ద్వారా చేపట్టాలని మంత్రి సీతక్క నాయకత్వంలో ఎమ్మెల్యేలు, కోరారు. ఆదివాసీ ప్రొఫెసర్లు చిదం కిషోర్, డాక్టర్ అనురాధ, జి. వెంకట రమణ, డాక్టర్ పద్మజ తదితరులతో కూడిన ప్రతినిధి బృదం శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి భాషా ప్రతిపదికన నియామకాలు జరిగితే గోండు, కోలాం, మన్నెవార్, నాయకపోడ్, కోయ తదితర ఆదివాసి తెగలకు న్యాయం జరుగడమే కాకుండా ఆయా తెగల విద్యార్థులకు కూడ గుణాత్మక విద్య అందుతుందని ప్రతినిధి బృదం సీఎం దృష్టికి తీసుకెళ్ళింది. ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. భాషా ప్రాతిపదిక మీద నియామకాలు చేపట్టే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించారు. ఆదివాసుల్లో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులే లేరని విద్యా వంతులైన యువత సివిల్ సర్వీస్ పరీక్షలకు హాజయ్యేందుకు ఆసక్తి కనబరుస్తున్న వారికి సదుపాయాలు లేకపోవడంతో వెనుకడుగు వేసే పరిస్థితి ఉందని హైదరాబాద్‌లో ఆదివాసుల కోసం ప్రత్యేకంగా ఐఎఎస్ అకాడమీ ఏర్పాటు చేయాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారు. తదుపరి ఇందిరమ్మ ఇళ్లు ఆదివాసులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శిని ఆదేశించారు.

ఘనంగా కేంద్ర మాజీ మంత్రి వర్ధంతి

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్ కార్యాలయంలో ఆదివారం అధికారికంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్ సూపర్‌ఇండెంట్ తహసిల్దార్ క్యాడర్ శ్రీనివాస్ కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుదీర్ఘ కాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా ప్రాతినిధ్యం వహించిన వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తిస్తూ నిరంతరం స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తోందని అన్నారు. వర్ధంతి కార్యక్రమంలో కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

విశాలాంధ్ర - పెనుబల్లి : పెనుబల్లి మండలం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంటులో అంబేద్కర్ పై అమీషా చేసిన వ్యాఖ్యలకు నిరసన వ్యక్తం చేశారు మండల కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేశారు పంది వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వెనక తీసుకోవాలని అమిత్ షాను బర్తరఫ్ చేయాలని కేంద్ర మంత్రిగా ఉంటూ భారత రాజ్యాగంను, అంబేద్కర్ ను విమర్శ చేయడం మంచిది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకా వెంకటేశ్వర్లు ఈడ కమలాకర్ మిట్టపల్లి కిరణ్ కుమార్ వంగ నిరంజన్ గౌడ్ మాలోత్ రాధాకృష్ణ గోదా చెన్నారావు మేక తోటి కాంతయ్య గోగినేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి



విశాలాంధ్ర - వనపర్తి : ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణవేణి, గీత, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు పి కళావతమ్మ డిమాండ్ చేశారు. వనపర్తి ఆఫీస్ లో భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రేషన్ కార్డుల పై సంక్రాంతికి సన్నబియ్యం ఇస్తామని ప్రభుత్వం చెబుతోందని ముందుగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఇప్పటికే కార్డులు కలిగిన వారి కుటుంబాల్లో పిల్లలు పెరిగి పెద్దవారయ్యారని వారి పేర్లను కార్డుల్లో చేర్చాలని ఏళ్లుగా అడుగుతున్న పట్టించుకోవటం లేదన్నారు. పాత కార్డులో వారి పేర్లు చేర్చాలన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన మహిళకు రూ. 2500 ఇవ్వాలని, పెరిగిన మహిళా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. మహిళా ప్రయాణికులను ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్లు చిన్నచూపు చూస్తున్నారని, స్టేజీల్లో మహిళలు కనిపిస్తే బస్సులు ఆపడం లేదన్నారు. బస్సులో సీట్ల కొరకు అడిగితే ఉచిత ప్రయాణికులకు సీట్లు ఎందుకని ఎగతాళి చేస్తున్నారని ఇది కాదన్నారు. ఫిర్యాదు చేస్తే అటువంటి సిబ్బందిపై చర్య తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. చట్టసభల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించాలన్నారు.మహిళలు బాలికలపై హత్యాచారాలు, వేధింపులు పెరిగాయి అన్నారు. నేరాలు చేసిన వారిపై కేసు నమోదు చేసిన శిక్షలు పడటం లేదని, నేరస్తులకు చట్టాలంటే భయం ఉండటం లేదన్నారు. కేసుల్లో శిక్షలు పడే విధంగా సరైన సాక్షాధాలను పోలీసులు కోర్టులో సమర్పించాలన్నారు. మహిళలు సంఘటితంగా గ్రామ కమిటీలను నిర్మించుకోవాలని కోరారు. ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు కళావతమ్మ, జిల్లా కార్యదర్శి గీత, పట్టణ కన్వీనర్ జయమ్మ, కో కన్వీనర్లు భూమిక, శిరీష, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యను చూసి ఆధైర్య పడొద్దు

రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : విద్యార్థులు సమస్యను చూసి అధైర్య పడకుండా పరిష్కారం కనుగొనాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. జీవితంలో కలలు కనాలి... వాటిని సాకారం చేసుకోవాలని సూచించారు. ఆదివారం మెదక్ జిల్లా కుల్చారం బాలికల సాంఘీక సంక్షేమ పాఠశాల, కళాశాల విద్యార్థినీలతో ఏర్పాటు చేసిన ముఖాముఖి చర్చా కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. గవర్నర్ మాట్లాడుతూ వివిధ పాఠశాలలకు చెందిన కొందరు విద్యార్థులు భారత దేశంలోని వివిధ పర్వతాలను అధిరోహించారని గుర్తు చేశారు. విద్యార్థులంతా బాగా చదువుకుని డాక్టర్లు, ఇంజనీర్ సైంటిస్టులు కావాలని ఆకాంక్షించారు. నేటి విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాదిలాంటివారని సమస్యలను అధిగమస్తూ లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. క్రీడలలో బ్యాడ్మింటన్ క్రీడ అంటే ఇష్టమని, భారత మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తనకు ఆదర్శమని, నిరంతరం చదవడం, రాయడంపైనే ఆసక్తి చూపుతానని, పుస్తకాలే తన నేస్తమన్నారు. మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు మాట్లాడుతూ... విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్న రెసిడెన్షియల్ పాఠశాలల లక్ష్యాలను ప్రశంసించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, రెసిడెన్షియల్ స్కూల్స్ సెక్రటరీ అలుగు వర్షిణి, అదనపు కలెక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర వారసత్వ మందిరం మెదక్ చర్చి...

కరువు కాలంలో నిర్మించిన మెదక్ కేథిడ్రల్ చర్చి (మహాదేవాలయం) ప్రజలకు ఉపశమనం ఇచ్చిన గొప్ప మందిరమని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు.

చర్చి శతాబ్ది ఉత్సవాలలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పాల్గొన్నారు. ఆదివారం చర్చి సందర్శనకు వచ్చిన గవర్నర్ ను చర్చి కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన వేదిక వద్ద ప్రిసిబిటరీ ఇంచార్జి రెవ. శాంతయ్య, ఇతర గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వదించి కమిటీ సభ్యులతో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఇది కేవలం 100 సంవత్సరాల సంబరమే కాదు, విశ్వాసం, తపన, భగవంతుని అమోఘమైన కృపకు నిదర్శనం అన్నారు. శతాబ్ది వేడుకలు ఒక మహత్తర ఘట్టం. గత శతాబ్దంగా మెదక్ చర్చి అనేక మందికి దైవ కేంద్రంగా నిలిచిందన్నారు. గవర్నర్ వెంట స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మైనపల్లి రోహిత్ రావు, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పి ఉదయ్ కుమార్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ నగేష్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కమిటీ సభ్యులు గంట సంపత్, శాంసన్ సందీప్ తదితరులున్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

గవర్నర్ విష్ణు దేవ్ వర్మ మెదక్ జిల్లా పర్యటన సందర్భంగా ఘన స్వాగతం లభించింది. ముందుగా కలెక్టరేట్కు గవర్నర్ రాగా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. పార్లమెంట్ సభ్యులు ఎం.రఘునందన్ రావు, ఎమ్మెల్సీ షేరి సుభాష్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ నగేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెల్ల మల్లికార్జున గౌడ్, బిజెపి జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, కోశాధికారి డిజి శ్రీనివాస్ శర్మ తదితరులు స్వాగతం పలికారు. గవర్నర్ పర్యటన నేపథంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కూనంనేని సమక్షంలో 60 కుటుంబాలు సీపీఐలో చేరిక

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నాం

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : మౌలిక సౌకర్యాల ప్రాధాన్యత క్రమంలో కొత్తగూడెం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి బాట పట్టిస్తున్నట్లు తీపి రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఎప్పటికైనా సమస్యలపై స్పందించే సిపిఐ పార్టీకి మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేసాడు. ఆదివారం కూనంనేని సమక్షంలో పాతకొత్తగూడెంకు చెందిన 60 కుటుంబాలు సిపిఐలో చేరారు. కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూ వాటి పరిస్కారానికి అనునిత్యం శ్రమిస్తున్నట్లు చెప్పారు. సిపిఐకి రోజు రోజుకి ప్రజాదరణ పెరుగుతోందన్నారు. పాతకొత్తగూడెం ఏరియా 2, 3, 4 వార్డులకు చెందిన 60 కుటుంబాలు చేరటం సిపిఐకి పెరుగుతున్న ఆదరణకు సాక్ష్యం అన్నారు. విద్యానగర్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో కూనంనేని సమక్షంలో సిపిఐలో చేరారు. వీరికి ఎర్ర కండువా కప్పి పార్టీలోని ఆహ్వానించారు. ప్రతి గ్రామాన్ని, బస్తీలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజలు ఎర్ర జెండావైపు ఆకర్షితులవుతున్నారన్నారు. నూతనంగా పార్టీలో చేరుతున్న నాయకులు ప్రజా క్షేత్రంలో పని చేయాలని, ప్రజల్లో మమేకమైతేనే పార్టీకి మరింత ఆదరణ పెరుగుతుందన్నారు. భవాని, నాగేంద్ర, మందా గణేష్, నరేష్ తదితరుల నేతృత్వంలో ఈ కుటుంబాలు సిపిఐ లొ చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాసి వెంకటేశ్వర్లు, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కిలారు ప్రసాద్, కొండా స్వామి, యాంద్ర మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్షన్ షెడ్యూల్ ప్రకారం విధులు నిర్వహించాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబూబాబాద్ : ఎలక్షన్ కమిషన్ సూచనల మేరకు క్షేత్రస్థాయిలో షెడ్యూల్ ప్రకారం ఎన్నికల విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్లో ఎలెక్టోరల్ రోల్ అబ్జర్వర్ బాలమాయాదేవి స్పెషల్ సమ్మరీ రివిజన్ 20 -25, పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ సూచనల మేరకు క్షేత్రస్థాయిలో షెడ్యూల్ ప్రకారం ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. పెండింగ్లో ఉన్న ఫామ్ 6,7,8, లను వెంటనే పరిష్కరించాలని, దివ్యాంగ ఓటర్లను, గుర్తించాలని, షెడ్యూల్ ప్రకారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. వారి సలహాలు, సూచనలు ఎన్నికల కమిషన్కు పంపాలని తెలిపారు. ఓటర్ అవగాహనపై స్వీప్ ఆక్టివిటీస్, స్టార్ క్యాంపైనర్స్ ద్వారా డిగ్రీ కాలేజెస్, ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడికల్ కాలేజ్ అన్ని విద్యాసంస్థలలో కార్యక్రమాలు నిర్వహించి ఓటరు నమోదు ఓటు హక్కు పై అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.అన్ని పోలింగ్ కేంద్రాలలో, దివ్యాంగుల కోసం ర్యాంప్స్ ఏర్పాటు చేయాలని, త్రాగునీరు, మరుగుదొడ్ల, విద్యుత్ సరఫరా సౌకర్యం, అన్ని మౌలిక వసతులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్టీఆర్ స్టేడియం వద్ద వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసి, వసతి గృహంలోని డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, స్టడీ రూమ్, పరిసర ప్రాంతాలను పరిశీలించారు, పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య బోధనలు అందించాలని 100 శాతం ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.వీర బ్రహ్మచారి, తొర్రూరు, మహబూబాబాద్ ఆర్డిఓలు గణేష్, కృష్ణవేణి, స్వీప్ నోడల్ అధికారి మధుసూదన రాజు, బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహస్వామి పాల్గొన్నారు.

రైతాంగ పోరాటాలను అణచివేసే కుట్రలను ఆపాలి

విశాలాంధ్ర - గార్ల : రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంకై ఉద్యమిస్తున్న రైతాంగ పోరాటాలను అణచివేయాలనే కేంద్ర ప్రభుత్వం కుట్రలను ఆపేయాలని అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల బిక్షపతి, గౌని ఐలయ్య డిమాండ్ చేసారు. ఆదివారం కేంద్ర ప్రభుత్వం తక్షణమే రైతు సంఘాలతో చర్చలు జరుపాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహించి కేంద్రప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగజిత్ సింగ్ దలేవాల్ ఆరోగ్య పరిస్థితి క్షీణించిందన్నారు. ఏదైనా అవాంఛనీయ పరిణామాలు జరిగితే ప్రధాని మోడీ, అమిత్ షా, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ షైని లే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. గ్రేటర్ నోయిడాలో జైల్లో ఉన్న రైతు ఉద్యమకారులను విడుదల చేయాలని, అగ్రీ మార్కెటింగ్ పై కొత్త జాతీయ విధాన ముసాయిదాను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు. గత 19 రోజులుగా పంజాబ్ సరిహద్దుల్లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు దల్లేవాల్ ఆరోగ్య పరిస్థితి విషమించడం పై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జడ సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోకాళ్ళ మురళీకృష్ణ,గుజ్జు దేవేందర్, బొమ్మిడి సాంబయ్య, బాలరాజు, పాక వెంకన్న, నాదేళ్ల శ్రీనివాస్,గౌని భద్రయ్య, గుడి చుట్టూ శంకర్, బోసు బజార్, మాజీ సర్పంచ్ కుసిన బాబురావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలి

విశాలాంధ్ర - వనపర్తి : వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత విద్యార్థులు కూడా భవిష్యత్తులో కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆదివారం స్వర్ణోత్సవాలు నిర్వహించగా ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులైన తెలంగాణ ఎలక్ట్రిసిటీ నియంత్రణ కమిషన్ చైర్మన్ జస్టిస్ దేవరాజుల నాగార్జున, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్ట రెడ్డిలతో కలిసి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. కళాశాలలో చదివి ప్రస్తుతం ఉన్నత స్థాయికి ఎదిగిన ఆర్‌జెడి రాజేంద్ర సింగ్, గద్వాల అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ సహా పలువురు తమ సహచర పూర్వ విద్యార్థులతో కలిసి హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని కళాశాల పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అందరూ కలిసి "సమాజంలో బాధ్యత కలిగిన పౌరులం అంటూ" సమాజ, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. తమకు విద్యా బుద్ధులు నేర్పి ఉన్నత స్థాయికి చేర్చిన తమ గురువులకు ఘనంగా సన్మానించారు. కళాశాల స్థాపనకు కీలకమైన వ్యక్తి టైపు కృష్ణయ్య కూతురు సరళ ను, అప్పటి వనపర్తి ఎమ్మెల్యే జయరాములు కుమారుడు శ్రీనివాసులును, మరో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాలకృష్ణయ్య కుమార్తె జయంతి లను వేదికపైకి ఆహ్వానించి సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని వనపర్తి పట్టణం విద్యాపర్తిగా పేరు గాంచిందని చెప్పారు. వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత విద్యార్థులు కూడా భవిష్యత్తులో కళాశాలకు, వనపర్తికి మంచి పేరు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కళాశాల అభివృద్ధికి, అదేవిధంగా కళాశాలలో ఏదైనా సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్‌గా తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ నాగార్జున మాట్లాడుతూ పూర్వ విద్యార్థులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. కళాశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థిగా తనవంతుగా లక్ష రూపాయల విరాళం ఇస్తున్నానని ప్రకటించారు. కళాశాల ప్రిన్సిపాల్ రఘునందన్, సభాధ్యక్షులు శ్రీనివాసులు, మాజీ అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు, మీడియా కమిటీ సమన్వయకర్త మల్యాల బాలస్వామి, పూర్వ విద్యార్థులు వెంకటేశ్వరరావు, ప్రభుత్వ న్యాయవాది కిరణ్ కుమార్, పూర్వ విద్యార్థులు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఆసియా టుడే మీడియా 'ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్స్' ప్రదానం

హైదరాబాద్ : వివిధ రంగాలకు చెందిన అసాధారణ వ్యక్తులను వారి అంకితభావం, నైపుణ్యాలకు సంబంధించి సత్కరించేందుకు ఆసియా టుడే 'ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్ 2024'ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడు ఈటెల రాజేందర్, మెదక్ లోక్‌సభ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు తదితరులు హాజరయ్యారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా భారతీయ సమాజంలో అత్యున్నత స్థాయి విజయాలను గౌరవించడం లక్ష్యంగా పెట్టుకుంది. విభిన్న రంగాలలో అత్యుత్తమ విజయాలను ఇది వేడుక చేస్తుంది. కళలు, వినోదం, చదువు, ఆరోగ్య సంరక్షణ, వ్యాపారం, సామాజిక సేవలలో రాణించిన వ్యక్తులకు ఈ అవార్డులు బహుకరించారు. అవార్డు విజేతలలో పద్మశ్రీ ఎన్. ముఖేష్ కుమార్ (భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్), పద్మశ్రీ శ్రీకాంత్ కిడాంబి - భారత బ్యాడ్మింటన్ ప్లేయర్, పద్మశ్రీ డాక్టర్ హనుమంతరావు పసుపులేటి (శిశువైద్యులు, సామాజిక కార్యకర్త), జయప్రద (నటి), కల్లెం ఉపేందర్ రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఫర్ విమెన్ ఛైర్‌పర్సన్, తేజస్వరూప్ ప్రతాపనేని (ఛైర్మన్, ప్రజ్ఞ గ్రూప్ ఆఫ్ ఐఏఎస్‌ఇనిస్టిట్యూషన్స్), డాక్టర్ మీర్ జవాద్ జార్ ఖాన్ (జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్), డాక్టర్ దుగ్గరాజు లక్ష్మీ జ్యోతి (చర్మవ్యాధి నిపుణులు), మానస పురలాసే (డైరెక్టర్, మంజు హాస్పిటల్స్), డా. రాజేష్ బొల్లం (ఆంకాలజిస్ట్, హెమటాలజిస్ట్), మన్నె కిషోర్ కుమార్ (డైరెక్టర్, వైనెల్డ్ హైస్కూల్), డాక్టర్ జి.విజయ్ శ్రీనివాస్ (ఛైర్మన్, ఏపీ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్),డాక్టర్. సయ్యద్ ఉస్మాన్ (న్యూరాలజిస్ట్), డాక్టర్ గుర్రం మైథిలి (గైనకాలజిస్ట్), వినయ్ రామ్ నిడదవోలు (వ్యవస్థాపకులు, ప్లానెట్‌గ్రీన్ ఇన్‌ఫ్రా) పీటర్సన్ ల్యాక్ జూనియర్ (డైరెక్టర్, సెయింట్ల్యాక్స్ స్కూల్, కాలేజ్ ఆఫ్ నర్సింగ్) వంటి ప్రముఖులు ఉన్నారు.

నల్లగండ్లలో అత్యాధునిక ముజిగల్ మ్యూజిక్ అకాడమీ ప్రారంభం

హైదరాబాద్: భారతదేశపు అతిపెద్ద మ్యూజిక్ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్, ముజిగల్ తమ అత్యాధునిక సంగీత అకాడమీని హైదరాబాద్‌లో ప్రారంభించింది. నల్లగండ్ల (హైదరాబాద్)లో ఉన్న ఈ అకాడమీ 1200 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఇది గాత్ర మరియు వాయిద్యాలతో సహా సంగీతాన్ని నేర్చుకోవడానికి అత్యంత అనుకూలమైనది. దాదాపు 500 మంది విద్యార్థులకు పలు బ్యాచ్‌లుగా బోధన చేసే సౌకర్యాలు కలిగిన నల్లగండ్లలోని ఈ మ్యూజిక్ అకాడమీలో పియానో, కీబోర్డ్, గిటార్, డ్రమ్స్, కర్నాటిక్ వోకల్స్, హిందుస్తానీ వోకల్స్, వెస్ట్రన్ వోకల్స్, వయోలిన్ మరియు ఉకులేలేలో బోధన చేస్తారు. సంగీత అభ్యాసంలో సమగ్రమైన కార్యాచరణ అందించడం ద్వారా మరియు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రూపాలలో బోధనతో సంగీత విద్యలో అత్యున్నత ప్రమాణాలను ముజిగల్ యొక్క అత్యాధునిక అకాడమీ ఏర్పరిచింది. ఇదే కేంద్రంలో సంగీత పరికరాలను సైతం విక్రయాలకు అందుబాటులో ఉంచారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన

కలెక్టరేట్ ముందు చీపుర్లతో ఊడ్చిన ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు విమలక్క సంఘీభావం

విశాలాంధ్ర - ఖమ్మం : గత 12 రోజుల నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె శిబిరానికి ప్రజా ఉద్యమాల పోరాట వనిత విమలక్క వచ్చి సంఘీభావం తెలిపి న్యాయమైన సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్ అయిన పే స్కేల్‌ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనియెడల వారి ఉద్యమంలో భాగమై పోరాడుతానని ప్రకటించారు. ఆదివారం సమగ్ర శిక్ష ఉద్యోగులు చీపుర్లతో రోడ్లు ఊడుస్తూ వారి నిరసనను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య, అదనపు ప్రధాన కార్యదర్శి అనిల్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిర్మల, మహిళ అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు ఇస్మాయిల్, కార్యదర్శి కృష్ణ ప్రసాద్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కోనేరు ట్రస్ట్ దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర - కొత్తగూడెం : సింగరేణి ప్రాంతం రుద్రంపూర్ లోని సెయింట్ పీటర్స్ చర్చ్ ఆధ్వర్యంలో 130 మంది హిందూ, ముస్లిం, క్రైస్తవ పేదలకు రాబోయే క్రిస్టమస్ నేపథ్యంలో కొత్త దుస్తులు అందించి భోజన ఏర్పాట్లు చేశారు. ఆదివారం చర్చి ప్రాంగణంలో జరిగిన ఈ వస్త్ర, అన్నదానాన్ని మాజీ మంత్రి కోనేరు నాగేశ్వరావు పేరా తనయులు నిర్వహిస్తున్న కోనేరు ట్రస్ట్ ద్వారా వితరణ చేసారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బాధ్యులు కోనేరు సత్యనారాయణ (చిన్ని) ముఖ్య అతిథిగా హాజరై పేదలకు దుస్తులు తన చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలొ చర్చి పాస్టర్ రెవ పి. అనిల్ కుమార్ బాబు, చర్చి సెక్రటరీ జీ. రవి రత్న రాజు, ట్రెజరర్ ఎమ్. హవీలా కుమారి, కమిటీ సభ్యులు సైమన్, జయరాజు, పి. సుందర్, హాజరయ్య, చింటు, స్త్రీలు, సంఘ సభ్యులు హాజరయ్యారు.

ఆర్యభట్ట వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర (మహబూబాబాద్) తొర్రూరు: ఈనెల 28న మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఆర్యభట్ట పాఠశాలలో జరిగే 18వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పాఠశాల కరస్పాండెంట్ నెలకుర్తి మధుకర్ రెడ్డి కోరారు. ఆదివారం పాఠశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్యభట్ట పాఠశాలను 2006-07వ సంవత్సరంలో ప్రారంభించడం జరిగిందని తెలిపారు. పాఠశాల స్థాపించి 18 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వార్షికోత్సవంలో గత అనుభవాలు, జరగబోయే నిర్ణయాలను వెల్లడించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ సిబిఐ జెడి లక్ష్మీనారాయణ, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ లు పాల్గొని ప్రసంగిస్తారని,ఈ వేడుకల్లో భాగంగా ప్రత్యేక సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్ననట్లు తెలిపారు. తమ పాఠశాలకు సిబిఐసి అనుమతి వచ్చిందన్నారు. వార్షికోత్సవంలో భాగంగా పాఠశాల సావనీర్‌ను అవిష్కరిస్తున్నట్లు తెలిపారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపల్ శశికళ, ఉపాధ్యాయులు అశోక్, రామ్మూర్తి, మమత తదితరులు పాల్గొన్నారు.

సాధికార విమర్శ పెనుగొండ 'దీపిక'

సా హి తి

వేల్పుల నారాయణ
అరసం జాతీయ కార్యదర్శి, 9440433475

పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన సందర్భంగా

తెలుగు సాహిత్యానికి దీప దారిగా నిలుస్తున్న ప్రామాణిక విమర్శ గ్రంథం దీపిక. అందుకే ఈ సంవత్సరం అభ్యుదయ రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణ రాసిన ఈ దీపిక వ్యాస సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం తెలుగునాట అందరికీ సంతోషకరమైన విషయం.

ఆధునికతను, అభ్యుదయ సాహిత్యాన్ని వక్రీకరణలతో వక్రీకరించి నప్పుడు ఎంతటి పెద్దవారైనా నిర్మొహమాటంగా వాటిని సాధికారంగా విమర్శిస్తూ ఆధారాలతో వాస్తవాన్ని ప్రకటించే లోతైన అధ్యయనం అవగాహన ఇందులో ఉంది.

అభ్యుదయ దృక్పథంతో రాసిన ఈ వ్యాససంపుటి తెలుగు సాహిత్య పరిణామాలను ఎక్స్‌రే తీసింది. గత వర్తమాన కాలాలలో వెలువడిన సాహిత్యాన్ని, సాహితీ సంపుటాలను కూలంకషంగా మూల్యాంకనం చేస్తూ అనేక కొత్త విషయాలను ఈ వ్యాస సంపుటిలో పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రామాణికంగా విపులీకరించారు. పెనుగొండ లక్ష్మీనారాయణ ముఖ్యంగా కథా సాహిత్యంపై అపారమైన అనుభవం కలిగి ఉండడమే కాకుండా అనేక సంకలనాలను తన సంపాదకత్వంలో తీసుకువచ్చారు. కథ తీరుతెన్నులను, అవి సమాజం పట్ల బాధ్యతాయుతంగా రాయబడినవా, లేదా అనేది ఈ పుస్తకం చదివితే అర్థమౌతుంది. ఈ పుస్తకంలో అభ్యుదయ సాహిత్య ఉద్యమ రథసారథులు రాంభట్ల కృష్ణమూర్తి, సెట్టి ఈశ్వర రావు, ఆవంత్స సోమసుందర్, రెంటాల గోపాలకృష్ణ, డా.ఎస్.వి. సత్యనారాయణ, ముత్యాల ప్రసాద్‌లను పరిచయం చేయడమే కాకుండా వారి సాహితి సంపదను భావితరాలకు అందించే విధంగా సుసంపన్నం చేశారు. ఈ సంపుటిలో మొత్తం 36 వ్యాసాలు ఉన్నాయి.

1943లో ప్రారంభించిన అభ్యుదయ రచయితల సంఘానికన్నా ముందే అభ్యుదయ సాహిత్యం ప్రారంభమైన అభ్యుదయ సాహిత్యాన్ని విశ్లేషిస్తూ ఇదొక సజీవ సాహితీ స్రవంతి అని సోదాహరణంగా వివరించారు.

ప్రముఖ కవి డా.సి.నారాయణ రెడ్డి గురజాడతో పాటు రాయప్రోలు సుబ్బారావును యుగకర్తలుగా పేర్కొనడాన్ని ప్రశ్నిస్తూ ఇది అకాడమిక్ కుట్ర అని, గురజాడ ఒక్కడే యుగకర్త అని, అందుకు ఎస్వీ సత్యనారాయణతో పాటు పలువురి సూత్రీకరణలు ఆధారాలుగా చూపించారు. వ్యక్తి కేంద్రమైన ప్రణయ ధర్మానికి పట్టం కట్టిన రాయప్రోలును యుగకర్తగా అంటూ కొందరు, ఇరువురు యువకర్తలేనంటూ ఇంకొందరు, సమాజ కేంద్రమైన ప్రజాస్వామ్య ధర్మాన్ని ప్రవచించిన గురజాడ సరసన రాయప్రోలును నిలుపపూనడం ఆయా సాహితీ వేత్తల హ్రస్వదృష్టికి నిదర్శనమని ఈ సంపుటిలో పేర్కొన్నారు. ప్రముఖ కవి జాషువా మనకెప్పటికీ అవసరమే అనే వ్యాసంలో ప్రణయ వ్యాధిగ్రస్తులై ఉన్న భావకవులకు ధీటుగా జాషువా ప్రగతిశీల సాహిత్యాన్ని సృష్టించారని పేర్కొన్నారు.



ప్రామాణికత లోపించిన తొలి మలితరం కథా సంకలనంపై ఇందులో సూత్రబద్ధమైన విమర్శ చేశారు. ఈ సంకలనంలో అక్కిరాజు రమాపతిరావు సంపాదకత్వంలో వచ్చింది. దీనిలో 42 మంది కథా రచయితల కథలుండగా ఇద్దరు తప్ప 40 మంది బ్రాహ్మణ రచయితలేనని,అంటే ఆ కాలంలో బ్రాహ్మణ రచయితల పాత్ర తెలుసుకోవడానికి మాత్రమే దీన్ని తీసుకువచ్చినట్లు కుండబద్దలు కొట్టినట్లు ఇందులో ప్రకటించారు. అంతే కాకుండా 1903 లో వచ్చిన ఆచంట సాంఖ్యాయన శర్మ రాసిన అపూర్వోపన్యాసం మొదటి కథ ఎందుకు కాకూడదన్న అక్కిరాజు గారి సంశయాన్ని పటాపంచలు చేస్తూ 1902లో వచ్చిన భండారు అచ్చమాంబ ధనత్రయోదశి, స్త్రీ విద్య, తొలి తెలుగు కథ అని తేల్చి చెప్పారు.

అదే విధంగా భారత మాజీ ప్రధాని పీవి నర్సింహారావు రాసిన గొల్ల రామవ్వ కథలో కాంగ్రేసు పార్టీ నిజాంకు వ్యతిరేకంగా సాయుధ పోరాట వీరోచిత కృత్యాన్ని వివరించారని, కాని కాంగ్రేసు నిజాం పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని నిర్వహించిందా అనే ప్రశ్న లేవనెత్తారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాయుధ పోరాటం 1948 సెప్టెంబర్ వరకు నైజాంపాలనకు,ఆ తర్వాత 1951లో విరమించే వరకు భారత ప్రభుత్వంపైనా కొనసాగింది. ఐతే కొన్ని గ్రామాల్లో కాంగ్రేసు పార్టీ నామమాత్రపు దళాలను కలిగి ఉండి ఒకటి రెండు దళాలు రైఫిల్ వంటి ఆయుధాలను మాత్రమే కలిగి ఉన్నాయి. ఐతే ఆ దళంలోని ఒక కాంగ్రేసు కార్యకర్త సాహసకృత్యానికి రూపకల్పనే ఈ గొల్లరామవ్వ కథ అని, ఈ కథ వెల్వడకుంటే కాంగ్రేసు ఆ మేరకైనా నిజాం వ్యతిరేక సాయుధ పోరాటంలో పాల్గొన్నట్లు లోకానికి తెలిసేది కాదనే చారిత్రక వాస్తవాన్ని నిర్మొహమాటంగా చాటిచెప్పారు.

కడియాల రాంమోహన్ రాయ్ తెలుగు సాహిత్యంపై శ్రీశ్రీ ప్రభావం అనే శీర్షికతో రాసిన పరిశోధనలోని వక్రీకరణలను ఇదేం పరిశోధన రాయ్ గారు అని పెనుగొండ తన వ్యాసంలో ఎత్తి చూపుతూ ఆధారాలతో వాస్తవాలను ప్రకటించాడు. పెదపూడిలో అరసం నడిపిన పాఠశాలలో శ్రీశ్రీ పాల్గొనలేదనేది వాస్తవం కాదని, ఆ పాఠశాలలో పాఠాలు చెప్పిన 14 మందిలో శ్రీశ్రీ ఒకరని ఆయన కావ్య విమర్శపై పాఠం చెప్పారని ఆధారాలతో చూపించారు. శ్రీశ్రీ ప్రభావం తెలుగు వచన రచనలపై ఉందన్న రాయ్ వాదన కరెక్టు కాదని, ఆయన కవులను ఎంతగానో ప్రభావితం చేశారని, కాని కథకులను ప్రభావం చేసినట్లు ఏ కథకుడు చెప్పుకోలేదని తేల్చి చెప్పారు. 1955 తర్వాత అరసం ఉనికిని కోల్పోయిందని, అరసాన్ని గురించి రాంమోహన రాయ్ చేసిన వాదన సరైనది కాదని, అరసం స్థబ్దతకు గురైనా అభ్యుదయ సాహిత్య సృజన ఆగలేదని, అభ్యుదయ రచయితల కార్యకలాపాలు కొనసాగాయని ఆ కాలంలో వెల్వడిన అభ్యుదయ సాహిత్యాన్ని ఇందులో విశ్లేషించారు.

తెలంగాణ విమోచనపోరాట సాహిత్యం ఆంధ్రా అభ్యుదయ రచయితల సంఘీభావం అనే వ్యాసంలో అనేక ఆంధ్రాప్రాంత రచయితల సాహిత్యాన్ని ఇందులో పొందుపరిచారు. నిజాంకు వ్యతిరేకంగా,ఆ తరువాత యూనియన్ సైన్యాలకు వ్యతిరేకంగా 1947 సెప్టెంబర్ 11 నుంచి 1951 అక్టోబర్ 21 వరకు సాగిన సాయుధ పోరాటం అనేకమంది ఆంధ్రా కవుల గుండెలను మండించిందని, అందులో భాగంగానే స్పందిస్తూ అనేక కవితలు, కథలు, నవలలు, నాటకాలు రాశారని సోదాహరణంగా తెలిపారు. నవలా సాహిత్యంలో బొల్లిముంత శివరామకృష్ణ మృత్యుంజయులు, లక్ష్మీకాంత మోహన్ సింహగర్జన, మహీధర రామమోహనరావు ఓనమాలు, తిరునగరి రామాంజనేయులు సంఘం నవలలు తెలంగాణ సాయుధపోరాట ఉద్యమప్రేరణతో రాసినవేనని పేర్కొన్నారు.

కథా సాహిత్యం కూడా విరివిగా వెలువడిందని గంగినేని వెంకటేశ్వర రావు ఎర్రజెండాలు, తుమ్మల వెంకట రామయ్య కథలు, శారద కథలు విరివిగా రాశారని పేర్కొన్నారు. అట్లూరి పిచ్చేశ్వరరావు, కోదండ రామశాస్త్రీ, ఉప్పల లక్ష్మణరావు, లక్ష్మీకాంత మోహన్, శివశంకర శాస్త్రీ, కొసరాజు శేషయ్య, తెన్నేటి సూరి, గిడుతూరి సూర్యం లాంటి అనేకమంది రచయితలు సృష్టించిన తెలంగాణ సాయుధపోరాట కథాసాహిత్యాన్ని విస్తృతంగా ఇందులో చూపించారు. అలాగే గేయ, వచన కవిత్వం కూడా చాలా వచ్చిందని తిరునగరి రామాంజనేయులు, పులుపుల వెంకట శివయ్య, తుమ్మల వెంకట రామయ్య, ఆవంత్స సోమసుందర్, ఆరుద్ర, గంగినేని వెంకటేశ్వర్ రావు, కారుమంచి వెంకటేశ్వర్ రావు, కుందుర్తి అంజనేయులు, టి.కృష్ణ, రెంటాల గోపాల కృష్ణయ్య, అనిసెట్టి సుబ్బారావు, నార్ల చిరంజీవి, లాంటి అనేకమంది కవులు కవితలు రాయడమే కాకుండా కవితా సంపుటాలను, సంకలనాలను కూడా తీసుకువచ్చారని సోదాహరణంగా వివరించారు. అదే క్రమంలో నాటకసాహిత్యం కూడా వచ్చిందని, ముఖ్యంగా సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కర్‌రావులు మా భూమి, ముందడుగు నాటకాలు రాశారని అవి ఎంతగానో ప్రజలను ఉద్యమోన్ముఖుల్ని చేశాయని ఇందులో వివరించారు. అంతే కాకుండా మా గోఖలే అనేక రేఖాచిత్రాలు గీసారని ఇందులో పేర్కొన్నారు. వామపక్ష పాత్రికేయులు మద్దుకూరి చంద్రశేఖర్‌రావు తెలంగాణ పోరాటంపై వచ్చిన సాహిత్యాన్ని విశ్లేషించారని ఇందులో తెలిపారు.

ఉత్తమ మార్క్సిస్టు విమర్శకుడిగా రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి కృషిని ఉన్నతంగా చూపించారు. ఇందులో వైతాళికులు కవితా సంకలనం అదొక ప్రేమగోలని విమర్శించారు. ఇంకా ఈ వ్యాస సంపుటిలో అభ్యుదయ సాహిత్యం దళిత జీవన చిత్రణ అనే వ్యాసంలో దళిత సాహిత్యానికి అభ్యుదయ సాహిత్యం ఏ విధంగా తోడ్పడిందో వివరించారు. నవ్య కవిత ఝరి నయాగార, ఎన్వీ జీవితం ఒక ఉద్యమం,1932 నాటి కథావళి సంకలన పరిచయం మహోన్నతంగా చేశారు. కథలు రాయడం ఎలా, సాహిత్య పరిచయం, అనే వ్యాసంలో వివిధ రచయితలు రాసిన పుస్తకాలను ఇందులో పేర్కొన్నారు. ప్రాంతీయ కథా సంకలనాల పరామర్శ అనే వ్యాసంలో అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన వివిధ ప్రాంతాల ప్రతీ కథను మూల్యాంకనం చేశారు. మార్క్సిజం మార్గంలో ఉత్తరాంధ్ర ఉత్తమ కథలు అనే వ్యాసంలో ఆ ప్రాంతం నుంచి వచ్చిన అనేక కథలను విశ్లేషించారు. మనం సాధించాల్సిన సాంస్కృతిక విధానం అనే వ్యాసంలో విధాన ప్రాముఖ్యతను విశ్లేషణ చేస్తూ ఏ విధంగా ఉండాలో మేధావులు సూచించిన అభిప్రాయాలను విపులీకరించారు. ఇంకా అనేక వ్యాసాలు సాహిత్యం గురించి కొత్త ఆలోచనలను రేకెత్తిస్తాయి. చర్చలకు తావిస్తాయి. సాహిత్యానికి మార్గనిర్దేశం చేస్తాయి.

కొత్త శతాబ్దపు సహగీతం

హిందీ మూలం: డా॥కైలాశ్ బాజపేయి
(సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత)

ఏరకమైన బాధ కొత్తగా అనిపించదు
అలాగే దేని పట్లా ఆకర్షణ ఉండదు
మేము ఎక్కడ ఉన్నామో అక్కడ
తగ్గుతూ ఎక్కుతూ ఉంటుంది రుచిలేనితనం.
గుంపుని చీల్చుకుంటూన్న డొల్ల దృష్టి ఆగదు ఎక్కడా
కలుసుకోవడానికీ విడిపోవడానికీ అర్థమే లేదు కాబోలు!
గోల వినడానికి మనసు బాగా అలవాటు పడిపోయింది.
ఇక మాకు ఏ స్వరమూ కొత్తగా అనిపించదు
ఏ సరిగమలూ లేవు అక్కడ
నిన్న చనిపోయిన అతీతం పట్ల
మనం వీతరాగులం
ఎందుకంటే అందరి కోసమూ సమయం యొక్క
అంజలిలో నీళ్లు తక్కువ ఉన్నాయి
ఉదయం- అస్తమయం నుంచి మనము
ఎంత దూరం వచ్చేశామంటే
కొత్తగా అనిపించదు ఏ క్రమమూ
ఏ ఆవర్తన లేదు అక్కడ.

తెలుగు అనువాదం: పారనంది నిర్మల,
9985103804

జీవగర్ర

అప్పుడప్పుడు
ఒంటరిగా నిలుచొని
మనలోకి మనం
తొంగిచూసుకోవాలి

మనలోని మనసున్న మనిషి
మాయమైపోతున్నాడో
మనుగడ సాగిస్తున్నాడో
గమనించుకోవాలి

దారి తప్పుతున్నాడని
పిచ్చిపరుగులు తీస్తున్నాడని
మనసు అద్దం చూపిస్తే
సరిదిద్దుకోవాలి

మొత్తంగా
మనలోని మనిషితనం
కూలిపోకుండా జాగ్రత్తపడాలి

మనిషితనమే జీవగర్ర
అది కూలిపోయిన నాడు
మనమున్నా లేనట్టే..
నడిచే శవాలమైనట్టే.

కార్తీక రాజు,
8977336447

రాజాం రచయితల వేదిక 119వ సమావేశం

ఈ డిసెంబర్ నెల 29 ఆదివారం ఉదయం 10.00 గంటలకు విజయనగరం జిల్లా, రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 119వ సమావేశం జరుగుతుంది. సమతం మహేశ్వరరావు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో 'కళింగాంధ్ర దళిత కవిత్వం' అనే అంశంపై పిల్లా తిరుపతిరావు ముఖ్యప్రసంగం చేస్తారు.

గార రంగనాథం, 9885758123

'చెమట చెక్కిన వాక్యం' ఆవిష్కరణసభ

60మంది కవుల కవిత్వ పరామర్శ

విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో తేది 29.12.2024, ఆదివారం ఉదయం 10 గంటలకు కెంగార మోహన్ వ్యాస సంపుటి 'చెమట చెక్కిన వాక్యం' ఆవిష్కరణ సభ జరుగుతుంది. ప్రముఖ కవి, విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్య ఆవిష్కరిస్తారు. జి. వెంకటకృష్ణ, లోసాని సుధాకర్, కెంగార మోహన్, వొరప్రసాద్‌లు పుస్తకంపై మాట్లాడతారు. అందరికీ ఆహ్వానం.

సాహితీస్రవంతి, 9490099059

అనేక రచనాపార్శ్వాల పరిశోధనాత్మక గ్రంథం

గ్రంథ సమీక్ష

ఒక రచయిత అంతరంగాన్నీ, అతని రచనాంతరంగాన్నీ ప్రతిబింబించేది ఇంటర్వ్యూ. అది అతని వివిధ రచనాపార్శ్వాలను పాఠకలోకానికి అందిస్తూ, రచయితను పాఠకుడితో అనుసంధానం చేస్తుంది. అందుకే ఇంటర్వ్యూ ప్రయోజనం బహుళమైనది. విస్తృతమైనది. అది మిగిలిన అన్ని ప్రక్రియలకంటే విలక్షణమైనది. మిగతా రంగాల్లో లాగానే సాహిత్యంలోనూ ఇంటర్వ్యూ ప్రముఖపాత్ర వహిస్తుంది. సాహిత్యానికి సంబంధించి అనేక క్లిష్టమైన అంశాల పట్ల కూడా పాఠకుడికి అవగాహన కలిగిస్తుంది. రచన సమగ్ర స్వరూపాన్నీ, ఆ రచన చేసిన రచయిత నేపథ్యాన్నీ పాఠకుడికి అందించడానికి యత్నిస్తుంది. రచయిత నైపుణ్యాలను బేరీజువేయడంలో ఇంటర్వ్యూకర్త నైపుణ్యతను బట్టి ఈ ప్రయత్నం సఫలీకృతమై ఇంటర్వ్యూకర్త తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకో గలడు. ఈ ప్రయత్నంతోనే వర్తమానకవి కొమ్మవరపు విల్సన్‌రావు రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి 34 మంది సాహితీవేత్తల ఇంటర్వ్యూలతో వర్తమాన రచయితలు ఈతకోట సుబ్బారావు, డాక్టర్ సుంకర గోపాల్ సంపాదకత్వంలో వెలువరించిన బృహత్తర సంకలనం 'అంతరంగ వీక్షణం'.

ఒక రచయిత రచనలన్నీ చదవలేని పాఠకుడు ఆ రచయితను చేసే ఇంటర్వ్యూ ద్వారా అతని నేపథ్యాన్నీ, అతని అంతరంగాన్నీ, అతని దృక్పథాన్నీ, అతని రచనల సారాన్నీ తెలుసుకోవచ్చు. ఇదే ఇంటర్వ్యూ ప్రత్యేకత. రచయితలోని ప్రత్యేకతల్ని ఇంటర్వ్యూకర్త తన ప్రశ్నల ద్వారా సమాధానాల రూపంలో రాబట్టడం ఇంటర్వ్యూలో ఒక ప్రధాన అంశం. ఈ అంశం మీదే ఈ సంకలన ఇంటర్వ్యూకర్త తన దృష్టిని ప్రత్యేకంగా కేంద్రీకరించాడని చెప్పవచ్చు. ఈ సంకలనంలోని ఇంటర్వ్యూ చేయబడ్డ రచయితలు, కవులు వివిధ పార్శ్వాలలో, బహుముఖ అంశాలలో ప్రతిభావంతులు. ఆ పార్శ్వాలను, ఆ అంశాలను సమగ్రంగా అధ్యయనం చేస్తే గానీ వారిని సముచితరీతిలో ఇంటర్వ్యూ చేయడం సాధ్యం కాదు. ఈ విషయంలో ఇంటర్వ్యూకర్త విల్సన్ రావు ఎంతో పరిశోధన చేసినట్టు అవగతమవుతుంది. ఆయా రచయితల నైపుణ్యాలకనుగుణంగా వారిని పాఠకులతో మమేకం చేసేవిధంగా ప్రశ్నావళిని రూపొందించుకోవడం కత్తిమీదసాము వంటిదే. అందుకోసం ఇంటర్వ్యూకర్త ఒక పరిశోధకుడిలా వారినీ, వారి సాహిత్యాన్నీ అధ్యయనం చేయాలి. ఈవిషయంలో విల్సన్‌రావు చాలావరకు సఫలీకృతులయ్యారనే చెప్పవచ్చు. ఇందుకు సంబంధించిన పరిశోధన కోసం తాను నిద్రలేని రాత్రులను కూడా గడిపినట్టు ఈ పుస్తకం ముందుమాటలో ఆయన చెప్పుకోవడం ముదావహం.

ఆయా రచయితల, కవుల రచనల్లోని, దృక్పథాల్లోని అనేక కోణాలను స్పృశిస్తూ, ఎక్కువమంది రచయితల, కవుల ఇంటర్వ్యూలతో తెలుగు సాహిత్యంలో మొదటిసారిగా వెలువడిన బృహత్తర ఇంటర్వ్యూల సంకలనంగా ఈ గ్రంథాన్ని పేర్కొనవచ్చు. ఈ ఇంటర్వ్యూలన్నీ మూడేళ్లపాటు ఈతకోట సుబ్బారావు సంపాదకత్వంలో, 'ముఖాముఖి' శీర్షిక పేరుతో విశాలాక్షి మాసపత్రికలో ధారావాహికంగా వెలువడ్డాయి. ఈ ఇంటర్వ్యూలకు సంబంధించి గతంలో 'సాహిత్యంలో విప్లవం'(ఇందులో శ్రీశ్రీ వ్యాసాలు, ఉపన్యాసాలతో బాటు వివిధ అంశాల మీద ఆయనతో జరిపిన 16 ఇంటర్వ్యూలు చోటుచేసుకున్నాయి),'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే' (వేమూరి రాధాకృష్ణ వివిధ రంగాల ప్రముఖులతో మీడియాలో చేసిన ఇంటర్వ్యూల సంకలనం) వంటి సంకలనాలు వెలువడ్డాయి. మాజీ ప్రధాని పి.వి. నరసింహా రావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా అంతకుముందు వివిధ సందర్భాల్లో ఆయనతో వివిధ అంశాలపై వివిధ మీడియాల ప్రతినిధులు చేసిన ఇంటర్వ్యూలన్నీ ఒక సంకలనంగా (దస్ స్పేక్ పీవీ: ఇంటర్వ్యూస్ విత్ పి.వి. నరసింహారావ్) వచ్చింది. పీవీ అంతరంగంలోని వివిధ పార్శ్వాలను ఆ ఇంటర్వ్యూలు ఆవిష్కరించాయి. ప్రజావ్యతిరేక వ్యవసాయ చట్టాలకు నిరసనగా దేశమంతా రైతు ఉద్యమం రాజుకున్న సందర్భంగా ఆ ఉద్యమంలో పాల్గొన్న 21 మంది రైతు నేతలతో పాటు, కార్యకర్తలతో చేసిన ఇంటర్వ్యూలతో 512 పేజీలతో 'ది జర్నీ ఆఫ్ ది పార్మర్స్ రెబెల్లన్' అనే సంకలనం వెలువడింది. అందులో చోటుచేసుకున్న రైతునేతల ఇంటర్వ్యూలు వారి నిర్దిష్ట అభిప్రాయాలను ప్రతిబింబింపజేస్తే, కార్యకర్తల ఇంటర్వ్యూలు రైతుల జీవనస్థితిగతులను ప్రతిఫలింపజేశాయి.

అనేక సాహిత్య విశేషాలతో మిళితమైన ఈ సంకలనంలో ప్రసిద్ధులైన కొలకలూరి ఇనాక్, కె. శివారెడ్డి, బి.ఎస్. రాములు, శ్రీరామకవచం సాగర్, రంగనాథ రామచంద్రరావు తదితరులతో పాటు యువతరానికి చెందిన గోపగాని రవీందర్, వైష్ణవిశ్రీ, బిల్ల మహేందర్, సాంబమూర్తి లండ, ఈ. రాఘవేంద్ర, సుంకర గోపాల్, బాలసుధాకరమౌళి, మెర్సీ మార్గరెట్, తగుళ్ల గోపాల్, కంచరాన భుజంగరావు, పల్లిపట్టు నాగరాజు, మెట్టా నాగేశ్వరరావు తదితరులతో చేసిన ఇంటర్వ్యూలు చోటుచేసుకున్నాయి. ఇంటర్వ్యూకర్త ప్రాంతాలవారీగా కూడా బ్యాలెన్స్ పాటించాడని, ఇందులోని ఇంటర్వ్యూలన్నీ ఒకే మూసలో కాకుండా వైవిధ్యభరితంగా వుండడానికి ఎన్నో జాగ్రత్తలూ తీసుకున్నాడని చెప్పవచ్చు.

అంతరంగ వీక్షణం
(సాహితీవేత్తలతో కొమ్మవరపు విల్సన్‌రావు ముఖాముఖి)
నవమల్లెతీగ ప్రచురణ
పేజీలు 443: వెల రూ.400,
ప్రతులకు: ఇంటర్వ్యూకర్త మొబైల్: 8985435515

ఈ సంకలనంలోని ఇంటర్వ్యూలలో ఆయా రచయితల, కవుల దృక్పథాలు, నేపథ్యాలను బట్టి అనేక సాహిత్య అంశాలు, కవనమథనంలో ఆయా కవులు అవలంభించిన టెక్నిక్‌లకు సంబంధించిన అంశాలు చోటుచేసుకున్నాయి. రచనల్లో రచయిత నిబద్ధత, కవులు అవలంభించిన కవిత్వ నిర్మాణ పద్ధతులు, కవిత్వంలోని క్లిష్టత, జీవిత మూలాల్లోంచి వచ్చే అనుభవసారం, కవిత్వంలో మాండలికభాష, దీర్ఘకవితా నేపథ్యం, కవిత్వంలో వస్తుశిల్పాలు అమరిన విధానాలు, ప్రచ్ఛన్న వస్తుశిల్పాలు, అప్రచ్ఛన్న వస్తుశిల్పాలు, పదచిత్రాల పోహళింపు, సంఘటనాత్మక కవిత్వం, నోస్టాల్జియా కవిత్వం, తెలుగులో రూబాయీల ప్రాచుర్యం, ప్రాయోగిక విమర్శ, వినిర్మాణ విమర్శ. శైలీ సంవిధానం తదితర అంశాలపై ఆయా కవులు, రచయితల నుంచి ఇంటర్వ్యూకర్త ధీటైన సమాధానాలను రాబట్టారు. ఈ ఇంటర్వ్యూలు గత దశాబ్ద కాలపు ఆధునిక కవిత్వ తీరుతెన్నులను తెలియజేయడంతో బాటు రాయలసీమ, ఉత్తరాంధ్ర, తెలంగాణ... ఈ మూడు ప్రాంతాల కవిత్వంలోని అస్తిత్వ ఉద్యమాల నేపథ్యాలను, ఆ ఉద్యమాల వెనుక వున్న కారణాలనూ ప్రతిఫలింపజేశాయి. బిల్ల మహేందర్ తన సంపాదకత్వంలో దివ్యాంగులపై ప్రత్యేకంగా వెలువరించిన 'కాలాన్ని గెలుస్తూ' కవితాసంపుటి నేపథ్యం, గోపగాని రవీందర్ ఉద్యోగరీత్యా అడవిజీవితంతో మమేకమై తన కవిత్వంలో ప్రతిఫలింపజేసిన అదిలాబాద్ ఆదివాసీ జీవనసౌందర్యం, మనిషినీ, మనసునూ నిలువెల్లా గాయపరిచే ఒక సంస్కృతిని ప్రతిబింబించే జి. వెంకటకృష్ణ 'దేవరగట్టు' కథా నేపథ్యం, తండా హరీష్ గౌడ్ కల్లుగీత కవిత్వనేపథ్యం, మువ్వా శ్రీనివాసరావు కవిత్వంపై 366 మంది విశ్లేషణలతో వెలువడిన 'అనితరుడు' పుస్తక నేపథ్యం, శ్రీరామకవచం సాగర్ ఆధునికోత్తర సాహిత్య నేపథ్యం, మెర్సీ మార్గరెట్ ఆన్ లైన్ సాహిత్య కార్యక్రమాలు వంటి ఆసక్తికర అంశాలు ఈ ఇంటర్వ్యూలలో చోటుచేసుకున్నాయి.

ఈ సంకలనంలో సీనియర్లతో చేసిన ఇంటర్వ్యూలు అనేక ఆలోచనలను రేకెత్తిస్తాయి. కవులకు దిశానిర్దేశం చేస్తాయి. ముఖ్యంగా వారు తమ రచనల్లో తీసుకున్న కథావస్తువుల నేపథ్యాలు నేటిరచయితలకు ప్రేరణ కలిగిస్తాయి. ఇంటర్వ్యూకర్త అడిగిన ప్రశ్నలకు జూనియర్లు తమ దృక్పథాలను ఖచ్చితమైన ధోరణిలో వెల్లడించారు. ప్రతిభావంతంగా సమాధానాలిచ్చారు. వారంతా తమ రచనల్లో చొప్పించిన సామాజికతను వెలికితీయడంలో ఇంటర్వ్యూకర్త కృతకృత్యుడయ్యాడు. ఇందులో ఇంటర్వ్యూకర్త సంధించిన ప్రశ్నలన్నీ ఆధునిక కవిత్వాన్నీ అధ్యయనం చేయడానికి సోపానాలుగా ఉపయోగపడతాయని నిస్సందేహంగా చెప్ప వచ్చు. ఇంటర్వ్యూకర్త విల్సన్‌రావు స్వయంగా కవి, అధ్యయనశీలి కావడం ఈ ఇంటర్వ్యూలను ఇంత లోతుగా నిర్వహించడానికి దోహదపడింది. ఆయనలో కనిపించే ఈ లక్షణాలను, ఆయన కవిత్వతత్వాన్ని ఈ సంకలనం చివర్లో చోటుచేసుకున్న ఆయనతో చేసిన ఇంటర్వ్యూలు నిర్ధారిస్తాయి. ఇలాగే ఇలాంటి ఇంటర్వ్యూలు కొనసాగిస్తే అవన్నీ భవిష్యత్తు సాహిత్య పరిశోధనలకు ఉపకరిస్తాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. కలం పట్టిన ప్రతి రచయితకూ, కవికీ, పరిశోధకుడికీ ఈ సంకలనం ఒక కరదీపిక కాగలదు. మరెన్నో సాహిత్య అధ్యయనాలకు ఇది లైట్‌హౌస్‌లా ఉపయోగపడగలదు.

డాక్టర్ కొత్వాలు అమరేంద్ర, 9177732414

జైశంకర్‌కు నేషనల్ ఎమినెన్స్ పురస్కారం

చెన్నై: విదేశాంగమంత్రి జైశంకర్ చంద్రశేఖరేంద్ర సరస్వతి నేషనల్ ఎమినెన్స్ అవార్డు అందుకున్నారు. ప్రజా నాయకత్వ విభాగం (పబ్లిక్ లీడర్‌షిప్)లో సౌత్ ఇండియన్ ఎడ్యుకేషన్ సొసైటీ (ఎస్ఐఈఎస్) ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేసింది. ప్రజా నాయకత్వంలో జైశంకర్ చేసిన కృషికి ఈ అవార్డు ఇస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ దేశంలోని పురాతన విద్యా సంఘాలలో ఒకటైన ఎస్ఐఈఎస్ తనకు ఈ అవార్డు బహూకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ వేదికలకు మహా పెరియవర్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పెరియవర్ ప్రపంచ వేదికపై మన దేశం గొప్పదనాన్ని నిలబెట్టారన్నారు. పబ్లిక్ లీడర్‌షిప్, హ్యూమన్ ఎండీవర్, సోషల్ లీడర్‌షిప్, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి సౌత్ ఇండియన్ ఎడ్యుకేషన్ సొసైటీ కంచి కామకోటి పీఠాధిపతి పూర్వపు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి పేరు మీద ప్రదానం చేస్తుంటుంది.

సంభల్‌లో కొనసాగుతున్న 'పురావస్తు' తవ్వకాలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని సంభల్ జిల్లాలో పురావస్తుశాఖ తవ్వకాలు కొనసాగిస్తోంది. చందౌసి ప్రాంతంలో ఒక మెట్ల బావిని ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) బృందం గుర్తించినట్లు సంభల్ జిల్లా కలెక్టర్ రాజేంద్ర పెన్సియా ప్రకటించారు. 400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో150 ఏళ్ల నాటి 'బావోలి'ని కనుగొన్నట్లు చెప్పారు. ఈ మెట్ల బావి చుట్టూ నాలుగు గదులతో కూడిన పాలరాతి నిర్మాణాలు, కొన్ని అంతస్తులు ఉన్నాయని వివరించారు. 'ఈ అహ్-బావోలి తలాబ్‌ను బిలారి రాజు తాత కాలంలో నిర్మించినట్లు చెబుతున్నారు. రెండు, మూడు అంతస్తులు పాలరాతితో, పై అంతస్తులు ఇటుకలతో నిర్మించారు. తవ్వకం చుట్టూ నాలుగు గదులు ఉన్నాయి' అని రాజేంద్ర మీడియాతో అన్నారు. కాగా, శనివారం స్థానికంగా సమావేశం నిర్వహించిన తర్వాత పురావస్తు శాఖ ఆధ్వర్యంలో అక్కడ తవ్వకాలు ప్రారంభమైనట్లు కలెక్టర్ తెలిపారు. మెట్ల బావిని గుర్తించిన నిర్మాణం పూర్తిగా మట్టితో కప్పి ఉందని చెప్పారు. మున్సిపల్ సిబ్బంది మట్టిని తొలగిస్తున్నారని... ప్రస్తుతం 210 చదరపు మీటర్లు మాత్రమే బయట పడిందని పేర్కొన్నారు. మిగిలిన ప్రాంతం ఆక్రమణలో ఉందని, వాటిని తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు.

బాల్య వివాహాలపై కఠినచర్యలు... 416 మంది అరెస్టు

గౌహతి: బాల్య వివాహాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. రాత్రి వేళ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. 400 మందికిపైగా అరెస్ట్ చేశారు. బీజేపీ పాలిత అసోంలో ఈ సంఘటన జరిగింది. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఆ రాష్ట్రంలో కేసులు నమోదు చేస్తున్నారు. మూడో విడతలో భాగంగా 335 కేసులు నమోదు చేశారు. శనివారం అర్ధరాత్రి వేళ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ కేసులకు సంబంధించి 416 మందిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిని ఆదివారం కోర్టులో ప్రవేశపెడతామని సీఎం హిమంత బిస్వా శర్మ తెలిపారు. ఈ సాంఘిక దురాచారాన్ని అంతం చేసేందుకు సాహసోపేతమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. కాగా, అసోం ప్రభుత్వం 2023లో రెండు దశల్లో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. గత ఏడాది ఫిబ్రవరిలో చేపట్టిన తొలి దశ డ్రైవ్‌లో 4,515 కేసులు నమోదు చేసిన పోలీసులు... 3,483 మందిని అరెస్టు చేశారు. గత ఏడాది అక్టోబర్‌లో నిర్వహించిన రెండో దశ డ్రైవ్‌లో 710 కేసులు నమోదు చేసి 915 మందిని అరెస్టు చేశారు.

కుటుంబంతో కలిసి సజీవ దహనానికి రైతు యత్నం

జైపూర్: రాజస్థాన్‌లోని ఝుంఝును జిల్లాలో భూమికి పరిహారం కోసం కుటుంబంతో కలిసి సజీవ దహనానికి ఒక రైతు ప్రయత్నించాడు. రోడ్డుపై చితి పేర్చి నిరసన తెలిపాడు. దీంతో పోలీసులు అడ్డుకున్నారు. తాజాగా ఆ రైతుకు పోలీసులు షాక్ ఇచ్చారు. రూ.9.91 లక్షల జరిమానా విధించారు. రైతు కుటుంబం సజీవ దహనాన్ని అడ్డుకునేందుకు అయిన ఖర్చుల మొత్తాన్ని వారంలో చెల్లించాలంటూ నోటీస్ పంపారు. వివరాలివి. ఈ నెల 10వ తేదీన విద్యాధర్ యాదవ్ అనే రైతు, తన కుటుంబంతో కలిసి నిరసన తెలిపాడు. సిమెంట్ కంపెనీకి ఇచ్చిన భూమికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశాడు. పరిహారం అందని పక్షంలో తన కుటుంబంతో కలిసి సజీవ దహనానికి అనుమతించాలని కోరాడు. రోడ్డుపై కట్టెలతో చితిని ఏర్పాటు చేసి నిరసన తెలిపాడు. దీంతో దిగి వచ్చిన ఆ సిమెంట్ కంపెనీ ఆ రైతుకు రూ.3 కోట్లు నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించింది. కాగా, పోలీసులు రైతు విద్యాధర్ యాదవ్‌కు ... కుటుంబంతో కలిసి సజీవ దహనానికి పాల్పడతానని బెదిరించినందుకు రూ.9.91 లక్షల జరిమానా విధించారు. ఎస్పీ శరద్ చౌదరి ఆ రైతుకు ఈ మేరకు నోటీసు జారీ చేశారు. రైతు కుటుంబం స్వీయ దహనానికి పాల్పడకుండా నిరోధించడానికి పోలీస్ శాఖకు భారీగా ఖర్చు అయిందని అందులో పేర్కొన్నారు. మరోవైపు అధికార వాహనాల వినియోగంతో పాటు ఏఎస్పీ, ఇద్దరు డీఎస్పీలతోపాటు 99 మంది పోలీసు సిబ్బందిని మోహరించినట్లు ఆ నోట్‌లో పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర ఖజానాపై అదనపు ఆర్థిక భారం పడిందని వివరించారు. ఈ నెల 24లోగా ఎస్పీ కార్యాలయంలోని ఖాతాల శాఖలో రూ.9,91,577 జమ చేయాలని ఆ రైతుకు పంపిన నోటీస్‌లో డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈసీ సమగ్రత నాశనానికి కుట్ర

మోదీ సర్కారు విధ్వంసంపై పోరాడతాం: మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ : కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్పులు చేయడాన్ని తప్పుపట్టారు. ఇది ఎన్నికల సంఘం సంస్థాగత సమగ్రతను నాశనం చేయడానికి మోదీ ప్రభుత్వం 'క్రమబద్ధమైన కుట్ర' లో భాగమని ఆరోపించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై మోదీ ప్రభుత్వం చేస్తున్న దాడికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుందని అన్నారు. సీసీటీవీ కెమెరా, వెబ్‌కాస్టింగ్ ఫుటేజీలతో పాటు అభ్యర్థుల వీడియో రికార్డింగ్‌ల వంటి కొన్ని ఎలక్ట్రానిక్ పత్రాలను దుర్వినియోగం కాకుండా నిరోధించేందుకు ప్రభుత్వం ఎన్నికల నియమావళిని సవరించింది. ఈ పరిణామాలపై ఖర్గే స్పందిస్తూ, 'ఎన్నికల కమిషన్‌ను నిర్వీర్యం చేయడానికి మోదీ ఇంతకు ముందు ఎన్నికల కమిషనర్లను నియమించే సెలక్షన్ ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించారు. ఇప్పుడు వారు చేసే కుట్రలు బయటకు రాకుండా ఉండేందుకు మార్పులు

చేస్తున్నారు. ఓటర్ల పేర్లు తొలగింపు, ఈవీఎంలలో పారదర్శకత లేకపోవడం వంటి అక్రమాల గురించి మేము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఈసీ స్పందించలేదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలు బయటకు రాకుండా చేసేందుకు పోలింగ్‌కు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజ్‌ను, అభ్యర్థులకు చెందిన వీడియో రికార్డులను తనిఖీ చేయకుండా నిషేధం విధించింది. ఇవన్నీ చూస్తుంటే ఈసీ తన స్వతంత్రతను కోల్పోతోందని స్పష్టమవుతోంది' అని ఖర్గే సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. లోక్‌సభ ఎంపీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ప్రభుత్వానికి అనుకూలంగా చర్యలు చేపడుతోందని ఆరోపించారు.

23 నుంచి మహిళా సమ్మాన్ యోజన నమోదు

అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో 'మహిళా సమ్మాన్ యోజన', 'సంజీవిని యోజన' పథకాల రిజిస్ట్రేషన్ డిసెంబర్ 23వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం ప్రకటించారు. మహిళా సమ్మాన్ యోజన పథకం కింద మహిళా లబ్ధిదారులకు ప్రతినెలా రూ.2,100 ఆర్థిక సాయం అందిస్తారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో ఆప్ పథకాలు కీలకంగా మారాయి. 'మహిళలు, సోదరీమణులకు రూ.2,100 బోనస్ మేము ప్రకటించాం. ఈ పథకం ప్రకటించినప్పటి నుంచి రిజిస్ట్రేషన్ ఎప్పటి నుంచి మొదలవుతుందని అడుగుతున్నారు. మహిళా సమ్మాన్ నిధి కోసం రిజిస్ట్రేషన్ సోమవారం నుంచి ఢిల్లీలో మొదలవుతుంది. రిజిస్ట్రేషన్ కోసం మేము మీ ఇంటికి వస్తాం' అని కేజ్రీవాల్ చెప్పారు. కాగా, 60 ఏళ్లు పైబడిన పౌరులకు ఉచిత వైద్య చికిత్స కోసం "సంజీవని యోజన" పథకాన్ని ఆప్ ప్రకటించింది. వైద్య చికిత్సకు అయ్యే ఖర్చుకు గరిష్ఠ పరిమితి అనేది లేదు. ఈ పథకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ కూడా డిసెంబర్ 23వ తేదీ నుంచి ప్రారంభం కానుందని కేజ్రీవాల్ ప్రకటించారు. రిజిస్ట్రేషన్‌కు ఢిల్లీ ఓటర్ ఐడీ మాత్రం తప్పనిసరని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు తాను, ముఖ్యమంత్రి అతిశి, సీనియర్ నేత మనీశ్ సిసోడియా కలిసి ప్రజలను కలుస్తామని, తమ చేతుల మీదుగా కూడా రిజిస్ట్రేషన్ చేయిస్తామని వెల్లడించారు.

వివాహ వేడుకలో ఠాక్రే సోదరుల మాటామంతీ

ముంబై: రాజకీయంగా ఉప్పు నిప్పులాగా ఉండే రాజ్ ఠాక్రే, ఉద్ధవ్ ఠాక్రే సోదరులు ఒక పెళ్లి వేడుకలో ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే సోదరి కుమారుడి వివాహం ముంబైలోని దాదర్‌లో జరిగింది. రాజ్ ఠాక్రేతోపాటు శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే తమ కుటుంబాలతో కలిసి ఈ వివాహానికి హాజరయ్యారు. వారిద్దరూ కలిసి వరుడైన మేనల్లుడు, వధువుపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా రాజ్, ఉద్ధవ్ ఠాక్రేలు పరస్పరం మాట్లాడుకున్నారు. ఈ వీడియో క్లిప్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. కాగా, ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రాజ్ ఠాక్రే, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని పార్టీల నేతల మాటల దాడికి దిగారు.

అయితే ఎన్నికల్లో సత్తా చాటలేకపోయారు. ఎంఎన్ఎస్ ఒక్క సీటు కూడా గెలువలేకపోయింది. ముంబైలోని మహిమ్ స్థానం నుంచి పోటీ చేసిన రాజ్ ఠాక్రే కుమారుడు అమిత్ ఠాక్రే కూడా ఓడిపోయారు. మరోవైపు శివసేన (యూబీటీ) కేవలం 20 సీట్లు గెలుచుకుంది.

మంటల్లో కలిసిన మానవత్వం

ఫొటోలు, వీడియోలు తీస్తూ రాక్షసానందం

జైపూర్: మానవత్వానికి మాయని మచ్చ ఘటన రాజస్థాన్‌లోని జైపూర్‌లో మూడు రోజుల క్రితం చోటు చేసుకుంది. ఎల్పీజీ ట్యాంకర్‌ను ఓ ట్రక్ ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న బాధితులు తమని కాపాడాలని వేడుకుంటూ హాహాకారాలు చేస్తూ పరుగులుతీశారు. స్థానికులు బాధితులను రక్షించేందుకు ముందుకు రాకపోగా... వీడియోలు, ఫొటోలు తీస్తూ రాక్షసానందం పొందినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే... శుక్రవారం తెల్లవారు జామున 5.30 గంటలకు జైపూర్-అజ్మీర్ హైవేపై ఓ పెట్రోల్ బంకులో ఎల్పీజీ ట్యాంకర్‌ను ఓ ట్రక్కు ఢీకొట్టింది. మంటలు చెలరేగి దగ్గరలో ఉన్న పెట్రోల్ బంకుకు వ్యాపించాయి. బంకు వద్ద ఉన్న పలు వాహనాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో 14 మంది మృతి చెందగా... దాదాపు 40 మంది గాయపడ్డారు. వీరిలో రాధేశ్యామ్ అనే వ్యక్తి మంటల్లో చిక్కుకుని తనను కాపాడాలని కోరుతూ 600 మీటర్ల వరకు పరిగెత్తారు. అక్కడే ఉన్న వారు రాధేశ్యామ్‌ను రక్షించేందుకు ముందుకు రాకపోగా .. వీడియోలు, ఫొటోలు తీస్తూ రాక్షసానందం పొందినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రాధేశ్యామ్ చౌదరి నేషనల్ బేరింగ్స్ కంపెనీ లిమిటెడ్‌లో మోటార్ మెకానిక్. తెల్లవారు జామున విధులు నిమిత్తం ఇంటి నుంచి కంపెనీకి తన బైక్‌పై బయలు దేరాడు. ఎల్పీజీ ట్యాంకర్‌ను, ఓ ట్రక్ ఢీకొట్టే సమయంలో రాధేశ్యామ్ అక్కడే ఉన్నారు. మంటల్లో చిక్కుకున్నారు. తనని తాను రక్షించుకునేందుకు 600 మీటర్లు పరుగులు తీశారు. అనంతరం కుప్పకూలాడు. కొద్ది సేపటికి స్థానికులు రాధేశ్యామ్ చౌదరి సోదరుడు అఖేరామ్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. రాధేశ్యామ్ అగ్ని ప్రమాదానికి గురయ్యాడని, వెంటనే హీరాపురా బస్ టెర్మినల్‌కు రావాలని కోరాడు. దీంతో భయాందోళనకు గురైన అఖేరామ్ ఘటనా స్థలానికి చేరుకున్నాడు. ఆ సమయంలో ఏం జరిగిందో కళ్లకు కట్టినట్లు మీడియాకు వివరించారు. 'నా సోదరుడు తీవ్రంగా కాలిన గాయాలతో రోడ్డుపై ఆపస్మారస్థితిలో కనిపించాడు. పేలుడు జరిగిన ప్రదేశం నుంచి సుమారు 600 మీటర్లు పరిగెత్తినట్లు స్థానికులు చెప్పారు. తనని కాపాడాలని ఆర్తనాదాలు చేశారని, సాయం కోసం అర్థిస్తే ఒక్కరూ ముందుకు రాలేదని, బదులుగా చాలా మంది వీడియోలు తీశాడని విలపించారు. రాధేశ్యామ్‌ను అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ రాకకోసం ఎదురు చూశాం. కానీ రాలేదు. దీంతో కారులో నా సోదరుణ్ని జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ ఆస్పత్రికి తరలించాం. అతడు బతుకుతాడనే నమ్మకం ఉంది. కానీ 85 శాతం కాలిన గాయాలు మరింత ఇబ్బంది పడుతున్నట్లు అఖేరామ్ కన్నీటి పర్యంతరమయ్యారు.

టోల్ రుసుము శాశ్వతం కాదు

స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మౌలిక వసతుల ప్రాజెక్టుల అమల్లో అధికారులు నిజాయితీగా వ్యవహరించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఓ కేసులో కీలక తీర్పు ఇచ్చింది. టోల్ రుసుము వసూలు శాశ్వత ప్రక్రియగా ఉండరాదని నొక్కి చెప్పింది. దాన్ని నిరంతరం వసూలు చేస్తామంటే అది నిరంకుశత్వం కిందకే వస్తుందని తెలిపింది. ఈ ప్రాజెక్టులు ప్రజా ప్రయోజనానికి ఉద్దేశించినవే తప్ప ప్రైవేటు సంస్థలు లాభాలు ఆర్జించడానికి కాదని... ప్రజానీకంపై భారం మోపుతూ అన్యాయంగా ఇతరులకు లాభాలు వచ్చేలా సహకరిస్తామంటే అనుమతించబోమని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం వెలువరించిన తీర్పులో తెలిపింది. ఢిల్లీ-నోయిడా డైరెక్ట్ (డీఎన్‌డీ) ఫ్లైవేపై టోల్ రుసుము వసూలు విషయమై కుదిరిన రాయితీ ఒప్పందాన్ని 2016లో అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ నోయిడా టోల్ బ్రిడ్జి కంపెనీ(ఎన్‌టీబీసీ) సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం హైకోర్టు తీర్పును సమర్థించింది. అసలు రాయతీ ఒప్పందమే లోపభూయిష్టమని పేర్కొంది. ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకునే విధానాలు, నిబంధనలను ప్రభుత్వం రూపొందించాలి. అవి నిజంగా ప్రజలకు ప్రయోజనం కలిగించాలి. వాటి ద్వారా ఎవరూ అనుచిత లబ్ధి పొందరాదని... ప్రజానీకాన్ని ఇబ్బంది పెట్టి ప్రజల ఆస్తి ద్వారా ఎవరూ అక్రమ లాభాలు పొందకూడదు. అవసరమైన ప్రజా మౌలిక సదుపాయాలను కల్పించిందన్న కారణంతో ప్రజలు వందలాది కోట్ల రూపాయలు ఎన్‌టీబీసీఎల్, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంస్థలకు చెల్లించేలా చేశారు. రుసుము రూపంలో ఆ ఫ్లై వేకు అయిన ఖర్చును ఎన్‌టీబీసీఎల్ తిరిగి వసూలు చేసుకుంది. లాభాలు కూడా ఆర్జించింది. అందువల్ల ఇంకా ఫీజు/టోల్ వసూలు చేయకుండా హైకోర్టు ఆదేశాలు ఇవ్వడంలో తప్పేమీ లేదు అని పేర్కొంది. రాయితీ ఒప్పందంలోని 14వ ఆర్టికల్‌లో... టోల్‌ను శాశ్వత ప్రాతిపదికన వసూలు చేసుకోవచ్చన్న అర్థం వస్తుండడంతో దాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ విషయంలో కూడా హైకోర్టు నిర్ణయంతో సుప్రీంకోర్టు ఏకీభవించింది. ప్రజాప్రయోజనం అత్యధికంగా ఉండే ప్రాజెక్టులు చేపట్టే సమయంలో అధికారులు ఏకపక్ష వైఖరికి దూరంగా ఉండాలి. న్యాయమైన, పారదర్శకతతో కూడిన స్పష్టమైన విధానాన్ని అమలు చేయాలని తెలిపింది.

కుప్పకూలిన భవనం... యువతి మృతి

చండీగఢ్: పంజాబ్‌లోని మొహాలీలో మూడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ఘటనలో ఓ యువతి మరణించింది. ఆమెను హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన దృష్టి వర్మగా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. మొహాలీ జిల్లాలో ఓ భవనంలో బేస్‌మెంట్ కోసం తవ్వకాలు జరుగుతుండగా.. పక్కనే ఉన్న మూడంతస్తుల భవనం కుప్పకూలింది. శనివారం సాయంత్రం ఈ ఘటన జరగ్గా... రంగంలోకి దిగిన ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నిర్విరామంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు ఓ యువతి మృతదేహాన్ని వెలికి తీశామని, భవనం శిథిలాల కింద పది మంది వరకు చిక్కుకుని ఉంటారని ఆదివారం అధికారులు తెలిపారు. ఇప్పటికే అనేకమందిని రక్షించామని, అత్యవసర చికిత్స నిమిత్తం వారిని ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయన్నాయని... కూలిపోయిన భవనంలో జిమ్ కూడా నడుస్తున్నట్లు చెప్పారు. కాగా, ఈ ఘటనపై బీఎన్ఎస్ 105 సెక్షన్ కింద భవన యజమానులు పర్విందర్ సింగ్, గగన్‌దీప్ సింగ్‌లపై పోలీసులు కేసు నమోదుచేశారు. భవనం కూలిపోవడంపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సింగ్ విచారం వ్యక్తం చేశారు. బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్ సహా మూడు నగరాలకు భారీ వలసలు

పూణే: ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. వాతావరణ మార్పుల కారణంగా రాబోయే కాలంలో బెంగళూరు, హైదరాబాద్, పూణే నగరాలకు భారీ ఎత్తున వలసలు ఉంటాయని చెప్పారు. వలసల నివారణకు ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పూణేలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...'భారత్ సహా వివిధ దేశాల్లో ఇటీవలి కాలంలో వాతావరణ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ కారణంగా ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా రాబోయే రెండు దశాబ్దాల్లో కొన్ని దేశాల ప్రజలు భారత్‌వైపు చూసే అవకాశం ఉంది. దేశంలోని కొన్ని ప్రాంతాలు నివాసయోగ్యంగా ఉండటంతో వారు ఇక్కడికి వచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. ఫలితంగా పెద్ద ఎత్తున వలసలు కొనసాగుతాయని అన్నారు. ఇదే సమయంలో భారత్ విషయానికి వస్తే హైదరాబాద్, బెంగళూరు, పూణే వంటి నగరాల్లోకి వలసలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఇక్కడ పరిస్థితులు అనుకూలంగా ఉంటాయి. అందుకే వారంతా ఇక్కడికి వచ్చేందుకు చూస్తారు. అప్పుడు ట్రాఫిక్ సమస్యలు, కాలుష్యం కారణంగా ఇక్కడ పరిస్థితులు దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో వలసలను అడ్డుకునేందుకు ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు. కార్పొరేట్ ప్రపంచం, రాజకీయ నాయకులు, బ్యూరోక్రాట్లు కలిసి వాతావరణ మార్పు సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఇదిలా ఉండగా... అంతకుముందు ... అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ చేరాలంటే దేశ యువత వారానికి 70 గంటలు పని చేయాల్సిందేనని కుండ బద్దలుకొట్టారు. లేకుంటే పేదరికం నుంచి ఎలా బయటపడగలమని? ప్రశ్నించారు. మన దేశంలో ఇంకా 80కోట్ల మంది ఉచిత రేషన్ అందుకుంటున్నారు. అంటే ఆ 80 కోట్ల మంది ఇంకా పేదరికంలో ఉన్నట్లే కదా... అందుకే మన ఆశలు, ఆకాంక్షలను ఉన్నతంగా ఉంచుకోవాలి. భవిష్యత్తు కోసం మనమంతా కలసికట్టుగా బాధ్యత తీసుకోవాలని పిలుపు ఇచ్చారు.

సీటీ రవి అభ్యంతరకర వ్యాఖ్యలపై ఆధారాలున్నాయ్

సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు: కర్నాటక మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్‌పై బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి వాడిన అభ్యంతరకర భాషకు సంబంధించి ఆడియో, వీడియో ఆధారాలు తమ వద్ద ఉన్నాయని సీఎం సిద్ధరామయ్య అన్నారు. ఆయన అలా మాట్లాడటం కొందరు ఎమ్మెల్సీలూ విన్నారని తెలిపారు. ఇది క్రిమినల్ నేరం అయినందున పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సీఎం చెప్పారు. మరి దీనిపై ఎమ్మెల్సీ రవి జ్యుడీషియల్ విచారణ ఎందుకు అడుగుతున్నారో ఆశ్చర్యంగా ఉందన్నారు. బీజేపీ సీనియర్ నేతగా ఉన్న రవి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. బెళగావిలో జరిగిన కర్నాటక అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో భాగంగా ఈ నెల 19న అధికార, విపక్ష సభ్యుల మధ్య నెలకొన్న వాగ్వాదం వ్యక్తిగత దూషణలకు దారితీసింది. ఈ క్రమంలో మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్-సీటీ రవి మధ్య మొదలైన మాటల యుద్ధం చివరకు పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాల వరకు వెళ్లింది. తనపట్ల బీజేపీ ఎమ్మెల్సీ వ్యక్తిగత దూషణలు చేశారంటూ మంత్రి ఫిర్యాదు చేయడంతో ఆయన్ను పోలీసులు అరెస్టు చేశారు. తొలుత ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌కు, ఆ తర్వాత రామ్‌దుర్గా స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో ఆయనకు బెయిల్ రావడంతో విడుదలయ్యారు.

ఇందిరపై విమర్శలా?

బీజేపీపై జైరాం రమేశ్ ధ్వజం

న్యూఢిల్లీ : పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగంలో 42వ సవరణపై చేసిన ఎంపిక విమర్శలను కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ఎత్తి చూపారు. 42వ సవరణకు సంబంధించి ప్రధాని మోదీ, ఆయన సహచరులు ఇందిరా గాంధీపై విమర్శలు చేయడాన్ని తప్పుపట్టారు. ఇందిర ఇతర కాంగ్రెస్ ఎంపీలతో కలిసి 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశపెట్టిన అనేక నిబంధనలను తొలగించిన 44వ సవరణకు అనుకూలంగా ఓటు వేసినట్లు వారు ప్రస్తావించలేదని ఆదివారం ఆయన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'రాజ్యాంగంపై సందర్భంగా డిసెంబరు 1976లో పార్లమెంటు ఆమోదించిన 42వ సవరణ కోసం ప్రధాని, అతని సహచరులు ఇందిరా గాంధీపై తీవ్ర దాడి చేశారు. మొరార్జీ దేశాయ్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు 1978 డిసెంబరులో 44వ సవరణకు అనుకూలంగా ఇందిరాగాంధీ, ఇతర కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ఓటు వేశారన్న విషయాన్ని వారు ప్రస్తావించలేదు' అని మండిపడ్డారు. 1976లో ఇందిరాగాంధీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ ప్రవేశికలో 'సోషలిస్టు', 'సెక్యులర్' అనే పదాలు చేర్చడం జరిగిందని అన్నారు. ఈ సవరణ ఉపోద్ఘాతంలో భారతదేశం వివరణను 'సార్వభౌమ, ప్రజాస్వామ్య గణతంత్రం' నుంచి 'సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర గణతంత్రం' గా మార్చిందని తెలిపారు. 42వ సవరణ ద్వారా ప్రవేశపెట్టిన అనేక నిబంధనలను 44వ సవరణ తొలగించిందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ నెల ప్రారంభంలో 'భారత రాజ్యాంగం 75 సంవత్సరాల ప్రయాణం' పై లోక్‌సభ, రాజ్యసభ రెండు రోజుల చర్చను నిర్వహించాయి. ఇది అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదానికి దారితీసింది.

పాప్‌కార్న్‌పై వేర్వేరు పన్ను స్లాబ్‌లా!

జీఎస్‌టీ (వస్తు సేవల పన్ను) కింద పాప్‌కార్న్‌కు మూడు వేర్వేరు పన్ను స్లాబ్‌ల నిర్ణయం 'అసంబద్ధత' వ్యవస్థకు సంబంధించి పెరుగుతున్న సంక్లిష్టతను మాత్రమే వెలుగులోకి తెస్తుందని కాంగ్రెస్ ఆదివారం పేర్కొంది. జీఎస్‌టీ 2.0 ను స్థాపించడానికి పూర్తి సవరణను ప్రారంభించే ధైర్యాన్ని మోదీ చూపుతుందా అని ప్రశ్నించింది. జీఎస్‌టీ ఎగవేత గణనీయమైనదని, ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ మోసం సర్వసాధారణమని, జీఎస్‌టీ వ్యవస్థను 'గేమ్' చేయడానికి స్థాపించబడిన బోగస్ కంపెనీల సంఖ్య వేలల్లో ఉందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. 'సరఫరా గొలుసులు బలహీనంగా ఉన్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ లోపభూయిష్టంగా ఉంది. టర్నోవర్ మినహాయింపులలోని లొసుగుల నుంచి ప్రయోజనాలు తీసుకుంటున్నారు. సమ్మతి అవసరాలు ఇప్పటికీ గజిబిజిగా ఉన్నాయి. వస్తువుల తప్పుడు వర్గీకరణ తరచుగా జరుగుతుంది' అని తెలిపారు. పన్ను మోసాలపై జీఎస్‌టీ డైరెక్టరేట్ జనరల్ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) ఇటీవల వెల్లడించిన వివరాల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.01 లక్షల కోట్ల జీఎస్‌టీ ఎగవేతను స్పష్టం చేస్తోందని అన్నారు. 'కేంద్ర బడ్జెట్‌కు కేవలం 40 రోజుల సమయం మాత్రమే ఉంది. పూర్తి సవరణను ప్రారంభించి, జీఎస్‌టీ 2.0ని స్థాపించడానికి ప్రధాన మంత్రి, ఆర్థిక మంత్రి ధైర్యం చేస్తారా?' అని ఆయన ప్రశ్నించారు.

అసోంలో భారీగా డ్రగ్స్ స్వాధీనం

గౌహతి: అసోంలో పోలీసులు భారీ ఎత్తున మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో దాదాపు 125 గ్రాముల హెరాయిన్, 60,000 యాబా టాబ్లెట్లను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఐజీ పార్థసారథి మహంత పేర్కొన్నారు. దీని విలువ రూ.20 కోట్లకు పైగా ఉంటుందని తెలిపారు. కాచర్ జిల్లాలోని సిల్కూరి రోడ్డు వద్ద ఓ వ్యక్తి మాదకద్రవ్యాలను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) సంయుక్తంగా సోదాలు చేపట్టగా... సాహిల్ అహ్మద్ లస్కర్ అనే వ్యక్తి డ్రగ్స్‌ను తరలిస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేశామన్నారు. దీని వెనుక అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. వీటిని ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విశాలాంధ్ర హైదరాబాద్

అల్లు అర్జున్‌లో కనిపించని పశ్చాత్తాపం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : అల్లుఅర్జున్ వ్యవహారశైలి చాలా దారుణంగా ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. జరిగిన ఘటనపై కనీసం అల్లు అర్జున్‌లో కనీసం ప్రశ్చాత్తాపం కనిపించడం లేదని ఆయన ఓ ప్రకటనలో మండిపడ్డారు. రేవతి కుటుంబంపైన అల్లు అర్జున్ కనీస సానుభూతి చూపించలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన మాటలను తప్పు పట్టేలా అల్లు అర్జున్ తీరు ఉందని విమర్శించారు. అక్బరుద్దీన్ ఓవైసీ అసెంబ్లీలో చేసిన ప్రస్తావన పైనే సీఎం రేవంత్ రెడ్డి స్పందించారని పేర్కొన్నారు. తొక్కిసలాటలో ఇద్దరు చనిపోయారని అల్లు అర్జున్‌కి పోలీసులు చెప్పిన తర్వాత థియేటర్‌లో షో చేశారని విమర్శించారు. అల్లు అర్జున్ సమాజంలో నీ గురించి ఏమనుకుంటున్నారో అడిగి చూడని చురకలు అంటించారు. వ్యక్తిగత ప్రతిష్ట గురించే తప్ప చనిపోయిన రేవతి, ఆస్పత్రిలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న బాబు గురించి ఆలోచన లేదని మండిపడ్డారు. నీ పేరు ప్రతిష్టలు అవతలి వారు ప్రాణాల కంటే ఎక్కువా అంటూ మండిపడ్డారు. అల్లు అర్జున్ ఇంకా దబాయించి మాట్లాడుతున్నాడని, మా సీఎం అసెంబ్లీలో పోలీసులు ఇచ్చిన అధికారిక సమాచారాన్ని ఇచ్చారన్నారు. అల్లు అరవింద్ మాట్లాతున్న తీరు సిగ్గుతో తలదించుకునేలా ఉందని, .తన కొడుకు మూడీ గా ఉంటున్నాడని అల్లు అరవింద్ అంటున్నాడని కానీ అవతల ఒక ప్రాణం ఐసీయూలో ఉలుకు పలుకు లేకుండా పడి ఉందనే విషయం గుర్తు పెట్టుకోవలన్నారు..అల్లు అర్జున్ తీరు పైన తెలంగాణ ప్రజలు ఆలోచించాలని సూచించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సంపూర్ణ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఉద్ఘాటించారు. నిబద్ధతను ప్రతిబింబించే ప్రతిభ, సృజనాత్మకత, క్రమశిక్షణ విద్యార్థులు కలిగి ఉండాలని, వ్యక్తిగత, సామాజిక అభివృద్ధికి విద్య మూలస్తంభం అని తెలిపారు. హైదరాబాద్ శివార్లలోని దూలపల్లిలో డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ 22వ వార్షికోత్సవం 'అభ్యుదయ' పేరుతో ఆదివారం ఘనంగా జరిగింది. స్కూల్ క్యాంపస్‌లో జరిగిన ఈ వార్షికోత్సవంలో స్కూల్ పూర్వ విద్యార్థి, యువ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా మైనంపల్లి రోహిత్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గౌరవ అతిథిగా నక్క ప్రభాకర్ గౌడ్, డిఆర్ఎస్ ఐఎస్ చైర్మన్ దయానంద్ అగర్వాల్, డైరెక్టర్లు అంజనీ కుమార్ అగర్వాల్, సంజయ్ కుమార్ అగర్వాల్, గార్వ్ అగర్వాల్, ప్రిన్సిపాల్ షణ్ముగం పరమశివాన్, వైస్ ప్రిన్సిపాల్ డా.కృష్ణ మోహన్ వేదికపై ఆసీనులైనారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర బహుముఖమైందని, కీలకమైందని, విద్యార్థులు ఒక దేశం యొక్క భవిష్యత్తు నాయకులు, ఆవిష్కర్తలు, మార్పును సృష్టించేవారని, వారు దేశం యొక్క అభివృద్ధి, పురోగతికి దోహదపడే జ్ఞానం, నైపుణ్యాలు, సామర్థ్యాలను సంపాదించాలన్నారు. డిఆర్ఎస్ ఐఎస్ పూర్వ విద్యార్థిగా ఈ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నందుకు గర్వంగా ఉందని, విద్యార్థులు తమ ప్రతిభతో వివిధ రంగాల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. దయానంద్ అగర్వాల్ మాట్లాడుతూ మన జీవితాన్నంతటినీ మార్చే శక్తి విద్యకు ఉందని, నేర్చుకోవడం మీ ఆలోచనా సామర్థ్యాలను అవగాహనను మారుస్తుందన్నారు. విద్య యొక్క ప్రాముఖ్యత విద్య అనేది ఒకరి జీవితంలో ఒక ముఖ్యమైన అంశామని, ఇది భవిష్యత్తులో విజయం సాధించడానికి, మన జీవితంలో అనేక అవకాశాలకు కీలకం అని అన్నారు. మన జీవితాలను ఆధునిక సాంకేతికతతో గడుపుతున్నామని, అనేక విధాలుగా మనం జీవిస్తున్న ప్రపంచంలో కంప్యూటర్లు, సెల్‌ఫోన్‌లు, ఇంటర్నెట్‌ను ఉపయోగించకుండా పని చేయడంలేదని, కానీ ఈ సాంకేతికతలను మంచికే ఉపయోగించాలని దుర్వినియోగం చేయవద్దని కోరారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ విద్యార్థులకు అకడమిక్‌తో పాటు కో-కరిక్యులర్ విభాగాల్లో సర్టిఫికెట్లు, బహుమతులు అందజేసి పలువురు టీచర్లను సన్మానించి వారితో ముచ్చటించి తన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులచే ఆర్కెస్ట్రా, ఫ్యూజన్ డ్యాన్స్, చిన్నారుల అదుతేమైన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. క్యాంపస్ ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యార్థుల పెయింటింగ్ ప్రదర్శన పలువురును ఆకట్టుకుంది.

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం194 మోడల్ స్కూళ్లలో 2025-26 విద్యా సంవత్సరానికి 6 నుంచి 10వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 6 నుంచి ఆన్‌లైన్ దరఖా స్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. ఈ మేరకు పరీక్షలకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. వివరణాత్మక నోటిఫికేషన్ సోమవారం జారీ చేస్తామని మోడల్ స్కూల్ అదనపు సంచాలకుడు శ్రీనివాసాచారి తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. 6వ తరగతిలో అన్నీ సీట్లకు ప్రవేశాలు ఉంటాయని, ఏడు నుంచి పదో తరగతి వరకు మాత్రం ఆయా స్కూళ్లలోని ఖాళీల ఆధారంగా భర్తీ చేస్తామని పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూ ఎస్ కేటగిరీ విద్యార్థులు రూ.125, ఓసీలు రూ.200 చొప్పున దరఖాస్తు ఫీజు చెల్లించి, అప్లై చేసుకోవచ్చని వివరించారు. ఆసక్తి కలిగిన వారు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

అభివృద్ధి పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ నగరపాలక సంస్థ 21 డివిజన్ పరిధిలోని బాలాజీహిల్స్ కాలనీల్లో పార్కు గోడ నిర్మాణ పనులను ఆదివారం ఉదయం కాలనీల అసోసియేషన్ సభ్యులతో కలిసి స్థానిక కార్పొరేటర్ భూక్య సుమన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని గుత్తేదారును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీల సీనియర్ సభ్యులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

అల్లు అర్జున్‌పై కాంగ్రెస్ నేతల ఫైర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రముఖ హీరో అల్లుఅర్జున్‌పై కాంగ్రెస్ నేతలు ముక్తకంఠంతో ఎదురుదాడి చేశారు. తాజాగా శనివారం అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుష్ప 2 సినిమా విడుదల రోజు సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై స్పందించగా దీనిపై వెంటనే శనివారం హీరో అల్లుఅర్జున్ స్పందించిన విషయం తెలిసిందే. ఆయన పరోక్షంగా సీఎంను టార్గెట్ చేయడంపై అటు కాంగ్రెస్ నేతలతో పాటు నెటిజన్లు కూడా అల్లుఅర్జున్‌ను టార్గెట్ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రెస్‌మీట్‌లో బట్టి పట్టి రియల్ హీరోగా కాకుండా రీల్ హీరోగా ప్రవర్తించిన తీరు కనబడుతుందని మండిపడ్డారు. మీరు మూడు సంవత్సరాలు కష్టపడి తీసిన సినిమా నష్టం జరగద్దనే ఉద్దేశంతోనే టికెట్ ధరలు పెంచినా కూడా ప్రభుత్వం ఒప్పుకుందని గుర్తు చేశారు. రానున్న రోజులలో ఇటువంటి సంఘటనలు జరగకుండా చూసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే బెన్ఫిట్ షోలకు పర్మిషన్ కూడా ఇవ్వమని సీఎం రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారన్నారు. ఆరోజు సంధ్య థియేటర్లో మీరు సినిమా చూస్తున్నప్పుడు బయట అంబులెన్స్ వచ్చింది అంతా గందరగోళంగా ఉంది ఏం జరుగుతుందనే కనీస ధ్యాస కూడా మీకు లేదని దుయ్యబట్టారు. మీకు సినిమా కలెక్షన్ల మీద ధ్యాస ఉంది తప్ప, ప్రజలు ఏమైతేంద్రు బయట ఏం జరుగుతుందనే ధ్యాస మీకు లేదని ధ్వజమెత్తారు. మీరు రియల్ హీరోగా మాట్లాడలేదు స్క్రిప్టు తీసుకొచ్చి చదివిన విధంగా ఉందన్నారు. ప్రజలకు ఏం సంజాయిషీ ఇస్తారో మీకే క్లారిటీ లేదనే విషయం ప్రెస్‌మీట్‌లో మీరు మాట్లాడిన తీరు చూస్తే అర్థం అవుతుందన్నారు. మీరు ఒక బాధ్యత యుతంగా ఉండాలి కానీ ప్రజలను నష్టపరిచే విధంగా ఉండొద్దని సూచించారు. నా క్యారెక్టర్‌ను దెబ్బతీశారు అనడం విడ్డూరంగా ఉందని, సినిమాలోనే హీరో కాదు బయట కూడా హీరోలాగా వివరించాలని అల్లు అర్జున్ ని కోరారు.

అల్లు అర్జున్‌పై ఎమ్మెల్సీ వెంకట్ ఫైర్....

అల్లు అర్జున్ తన మాటలు వెనక్కి తీసుకోని ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఎమ్మెల్సీ వెంకట్ అన్నారు. ఆకస్మికంగా ఆయన ప్రెస మీట్ పెడుతున్నాడు అంటే పశ్చాతాపం ప్రకటిస్తాడు అనుకున్నామని అన్నారు. కానీ ఆయన అందుకు విరుద్ధంగా వ్యవహరించరన్నారు. అల్లు అర్జున్ సినిమా హాల్‌లో ఎంత సేపు ఉన్నాడో, వెళ్ళేప్పుడు ఎలా వెళ్ళాడో పూర్తి ఫుటేజ్ ఉందన్నారు. తెలుగు వాడి సత్తా చాటడం అంటే ప్రాణాలు పోయినా పట్టించుకోకపోవడమా అంటూ ధ్వజమెత్తారు. రేవతి చనిపోయిన మరుసటి రోజు అల్లు అర్జున్ తన ఇంటి వద్ద టపాసులు కాల్చారని అన్నారు.

అంబేద్కర్ చరిత్రను వక్రీకరించడానికి బీజేపీ కుట్ర

కేంద్ర హోంమంత్రి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారత రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కీర్తిని మసకబారేలా చేయడానికి బిజెపి కుట్ర చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ అన్నారు. ఆదివారం హిమయాత్ నగర్ రాజ్ బహదూర్ గౌర్ హాల్‌లో డి.ఏ.హెచ్.పీ.ఎస్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం కె.యేసు రత్నం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం.బాల నరసింహ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి మను ధర్మశాస్త్ర విధానాలను అనుసరించడం కొరకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తుందన్నారు. మనుధర్మ శాస్త్రం మనుషులను మనుషులుగా చూడడానికి నిరాకరించింది. అలాంటి మనుధర్మ శాస్త్రాన్ని అంబేద్కర్ దగ్ధం చేయడం జరిగింది. రాజ్యాంగబద్ధంగా అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ హక్కులకు పదేపదే ఉల్లంఘనకు పాలు పడుతుంది. మత రాజ్యాలన్నీ చీకటి రాజ్యాలు అయితే భారత రాజ్యాంగం సర్వసత్తాక గణతంత్ర సామ్యవాద సోషలిస్టు భావాలను సంతరించుకుందని చెప్పారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొస్తున్న ఆర్ఎస్ఎస్ బిజెపి అట్టడుగు వర్గాల హక్కులను కాలరాస్తుందన్నారు. దేశ సమైక్యత సమగ్రతల కోసం లౌకిక విలువల కోసం నేటి యువతరం కట్టుబడి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగం మౌలిక పునాదులుగా ఉన్న ప్రజాస్వామ్యం ఫెడరలిజం సామాజిక న్యాయం లౌకికత్వం నాలుగు మూల స్తంభాలను కాపాడుకోవాలని అన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని తద్వారా సామాజిక న్యాయానికి బాట వేయాలని కోరారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 110 దేశాల రాజ్యాంగాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి విభిన్న వైవిధ్యాలు కలిగిన దేశంలో దేశ ప్రజలందరినీ ఒకే తాటిపైన నిలబెట్టడానికి, కులం మతం భాషా ప్రాంతం అతీతంగా ప్రజలందరికీ సమాన హక్కులు ఉండే విధంగా భారత రాజ్యాంగాన్ని రూపొం దించారని ఆయన చెప్పారు. ప్రాచీన మనువాద సంస్కృతి సైద్ధాంతిక భావన కలిగి ఉన్న ఆర్ఎస్ఎస్ కనుసనల్లోని బీజేపీ ఆ రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి అంబేద్కర్ ఆలోచనలను తుద ముట్టించటానికి కుట్రలు కుతంత్రాలు చేస్తుందని, సామాజిక శక్తులు అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎఐడీఆర్‌యం 2వ జాతీయ మహాసభలు 2025 జనవరి 5,6,7 తేదీల్లో హైదరాబాద్ మోక్షగుండా విశ్వేశ్వరయ్య భవన్‌లో జరగనున్నాయి. 5న బహిరంగ సభను అత్యధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఆరుట్ల రాజ్ కుమార్, జేరుపోతుల కుమార్, టి.రామకృష్ణ, కే.వెంకటస్వామి, బి.లక్ష్మీపతి, కే.రాజరత్నం పాల్గొన్నారు.

జెడ్‌ఆర్‌యుసీసీ సభ్యులుగా నూర్

విశాలాంధ్ర - మల్కాజిగిరి : సౌత్ సెంట్రల్ రైల్వే తెలంగాణ ప్రాంత రైల్వే ప్రయాణికుల తరఫున జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల సలహా సభ్యులుగా అధ్యక్షలు బోనగిరి లాంగ్ ట్రైన్, ఎంఎంటీఎస్ ట్రావెలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, మల్కాజిగిరి సబర్బన్ ట్రైన్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నూర్ నియమితులయ్యారు. తమ సేవలను గుర్తించి తమ ప్రయాణికుల సంఘాలను సిఫారస్ చేసిన సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయనాథ్ కోట్ల, రైల్వే శాఖ మంత్రి అశ్విని, వైష్ణవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్యంవైపే విద్యార్థుల దృష్టి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : మీ లక్ష్యం వైపు మీ దృష్టి ఉండాలి అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవిఎస్ కళాశాల పరిధిలోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థులతో కలిసి ఆయన అల్పాహారం తీసుకున్నారు. అంతకుముందు హాస్టల్ పరిసర ప్రాంతాలతో పాటుగా హాస్టల్ గదులను, కిచెన్‌ను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీళ్ళు, నిధులు, నియామకాలు, కొరకు తెలంగాణ రాష్ట్రం కోసం ఎందరో ఉద్యోగాలు వదిలి ఉద్యమం చేసి తెలంగాణ రాష్ట్రం తెచ్చుకకున్నామని గత పది సంవత్సరాలుగా ఏమి సాధించలేదని, మరి ఒక్క సంవత్సరం లోగా సాధ్యం. అవుతుందా అని ఆయన ప్రశ్నించారు. ఒక కుటుంబం కోసం తెలంగాణ తెచ్చుకోలేదని, మీ భవిష్యత్తు కోసం తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని ఆయన స్పష్టం చేశారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలం అంతా కూడా విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ఆయన చెప్పారు. మేము కూడా ప్రభుత్వం పాఠశాలలో, కళాశాలలో హాస్టల్‌ల్లో చదువుకున్నామని ఆయన తెలిపారు. డిగ్రీ, పిజిల్లో కష్టపడి చదివితే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడతారని, సమయం చాలా విలువైనదని, సమయాన్ని. వినియోగించుకోవాలని, అశ్రద్ధ చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆయన తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ హాస్టల్ ను సందర్శించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారిస్తారని చెప్పారు. మీకు కావాల్సిన అన్ని రకాల మౌళిక వసతులు ఏర్పాటు చేస్తామని, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాల లిస్టు ఇవ్వాలని వార్డెన్‌కి సూచించారు. మంచిగా చదువుకొని జీవితంలో స్థిరపడాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం హాస్టల్ ఆవరణలో శ్రమదానం చేసి హాస్టల్ మైదానంలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, మొక్కను నాటి నీళ్ళు పోశారు.

మహిళలు వారి కాళ్లపై వాళ్ళు నిలబడాలి..

మహిళలు ఎదిగి వారి కాళ్ళపై వాళ్లు నిలబడాలి అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మగువ స్వశక్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఆరోహి సూయింగ్ ఎంటర్ప్రైజెస్ సౌజన్యంతో మహబూబ్ నగర్ పట్టణంలోని, అంబేద్కర్ కళాభవన్‌లో మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరు ఈరోజు మొదటి అడుగు వేస్తున్నారని, రానున్న రోజుల్లో ఎన్నో గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పరంగా, నా పరంగా ఏ సహాయం అవసరమైన చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మహిళలు బయటికి వెళ్ళితే మన దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన చెప్పారు. తెలంగాణలోని మీరు చేసే ప్రొడక్టు నంబర్ వన్‌గా కావాలని, మీరు తయారు చేసే వస్తువులకు మార్కెటింగ్ సృష్టించుకోవాలని ఆయన చెప్పారు. సెట్విన్, మహేంద్ర, ఇన్ఫోసిస్ లాంటి సంస్థలతో యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించే విధంగా చర్యలు తీసుకున్నామని, 64 కోట్లతో ఐటిఐ కళాశాల ను ఎటిసి సెంటర్‌గా అభివృద్ధి చేసుకొని ఆరు కోర్సులు ప్రారంభించడం జరిగిందని ఈ కోర్సులలో 170 మంది బాలికలు శిక్షణ పొందుతున్నారని, ఆయన చెప్పారు. భవిష్యత్తులో మహబూబ్ నగర్ తిర్పూర్‌గా అభివృద్ధి చెందేందుకు అందరం కలిసి కట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎంబ్రాయిడరీ వర్క్ మిషన్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యేని ఘనంగా నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, మూడ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కౌన్సిలర్ రాజు, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు అజ్మత్ అలి, ఫయాజ్, పోతన్ పల్లి మోహన్‌రెడ్డి, జేసిఆర్, మోయిజ్, కిషన్ నాయక్, గోవింద్ యాదవ్, పోల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అస్తిత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బ

అమ్మ లాంటి తెలంగాణ తల్లిని కాపాడుకుందాం

బతుకమ్మ లేని తెలంగాణ తల్లిని ఊహించుకోలేము

ఎన్ఆర్ఐ బీఆర్ఎస్, జాగృతి, వివిధ తెలంగాణ ఎన్ఆర్ఐ సంస్థల సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోందని, ఆ చర్యను తెలంగాణ సమాజం కలిసికట్టుగా అడ్డుకోవాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ మహిళలను, పండుగలను అవమానించారని ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి అందరి అమ్మ వంటిదని, ఆ తల్లిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్, తెలంగాణ జాగృతి ఎన్నారై విభాగాల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆన్‌లైన్ సమావేశంలో అనేక దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ వాసులతో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ ఎన్నారై విభాగం మహేశ్ బిగాల సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎన్నారైలు పోషించిన పాత్రను మరవలేమని అన్నారు. ఉద్యమ సమయంలో ఎన్నో అవహేళనలకు గురైనా కూడా తెలంగాణ తల్లి మనతో స్ఫూర్తిని నింపిందని పేర్కొన్నారు. తెలంగాణ తల్లికి ఉద్యమ కారులు, కవులు, కళాకారులు కలిసి రూపం ఇచ్చారని, అటువంటి తల్లి రూపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. జొన్నలు, మక్కలు విదేశాల్లో కూడా పండుతాయని, అలాంటప్పుడు అవి తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమంటూ ప్రభుత్వం చెప్పడం సరికాదని సూచించారు. విగ్రహం మార్చడం విషయంలోనూ ప్రభుత్వం గోప్యత పాటించిందని, అంత అవసరం ప్రభుత్వానికి ఎందుకని అడిగారు. ప్రజల ఆమోదం ఉన్నట్లయితే గోప్యత ఎందుకు పాటించినట్లని ప్రశ్నించారు. ఉద్యమ తెలంగాణ తల్లి కోసం మరొక పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఉద్యమ తెలంగాణ తల్లి పట్ల ప్రేమతో విగ్రహ ప్రతిష్టాపన కోసం అనేక గ్రామాల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని వెల్లడించారు. కొత్త తెలంగాణ తల్లికి గెజిట్ జారీ చేసి ప్రజల మనోభావాలను దెబ్బతీశారని చెప్పారు. భారత మాత, అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు కూడా గెజిట్ ఉందా అని ప్రశ్నించారు.

బతుకమ్మకు ప్రపంచస్థాయి గుర్తింపునకు ఎమ్మెల్సీ కవిత కృషి : ఎన్నారైలు

బతుకమ్మ పండుగకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు రావడానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎంతగానో కృషి చేశారని ఎన్నారై నాయకులు అన్నారు. తెలంగాణ అస్తిత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దాడిని తిప్పికొట్టడంలో తాము కూడా భాగస్వాములవుతామని ప్రకటించారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ వేదికపై కాంగ్రెస్ ప్రభుత్వం తీరును ఎండగుతామని, మన సంస్కృతిని, సాంప్రదాయాలను కాపాడుకోవడం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఉద్యమ తెలంగాణ తల్లిని రక్షించుకునే క్రమంలో తమ వంతు సాయం చేస్తామని స్పష్టం చేశారు.

ఈ ఆన్ లైన్ సమావేశంలో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం, జాగృతి రాష్ట్ర నాయకులు నవీన్ ఆచారి, వివిధ దేశాల బీఆర్ఎస్, జాగృతి నాయకులు జ్యోతి ముద్దం, నవీన్ రెడ్డి, నాగెందర్ రెడ్డి, సుమన్ బల్మూరి, నాగరాజు గుర్రాల, కల్యాణ్ కాసుగంటి, నందిని, అనిల్ శ్రీకర్, శేఖర్, కిశోర్, ప్రభాకర్, సంపత్, రవి దన్నపునేని, హరి ప్రసాద్, శ్వేత, ఆదర్శ, సుకృతి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు



విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విలువైన ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహారిస్తుండడంటో కబ్జాదారుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్ 63/1 దేవేందర్ నగర్ ఫైజ్-2లో, అంబేద్కర్ నగర్ ఫేజ్-3లో కబ్జాదారులు రాత్రికి రాత్రే ఇళ్లు నిర్మించడం రెవెన్యూ, మున్సిపల్ అధికారుల కూల్చివేయడం సర్వసాధారణంగా మారిపోయింది. ఇటీవల బోడుప్పల్ మేయర్ అజయ్ యాదవ్ ప్రభుత్వ భూముల పరిరక్షనలో భాగంగా పర్యటించిన రోజు బోడుప్పల్ డబుల్ బెడ్ రూమ్ పక్కనే ఇందిరానగర్ ఫేజ్-2లో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. తిరిగి మరుసటిరోజు రాత్రి ఇంటిని నిర్మించడంతో మేడిపల్లి మండల అధికారులు మరల కూల్చివేశారు. శని, ఆదివారం సెలవు రోజుల్లో ఓ స్థానిక నాయకుడి అండతో రియల్ మాఫియా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి చిన్నచిన్న గదులు నిర్మిస్తూ అమాయక ప్రజలకు అమ్మి సొమ్ము చేసుకుంటూ కోట్లకు పడగలెత్తుతున్నారు. మేయర్ అజయ్ యాదవ్ పర్యటించి కొత్తవి నిర్మించవద్దని చెప్పిన కొద్ది రోజులకే తిరిగి నిర్మాణాలు చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణదారులు రాత్రికి రాత్రి నిర్మాణం పూర్తి చేసి సున్నాలు వేసి వినియోగంలోకి తీసుకోస్తు ప్రభుత్వ అధికారులకు సవాలు విసురుతున్నారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంతోనే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో మౌనం ప్రదర్శిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తప్పును సరిదిద్దుకుంటే ఎవరైనా హర్షిస్తారు

ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తాము చేసిన తప్పును సమర్థించుకోకుండా దాని సరిదిద్దుకుంటే ఎవ్వరైనా హర్షిస్తారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. ఘటనకు కారణమైన హీరో ప్రభుత్వం నా పైన తప్పుడు ప్రచారం చేస్తుందని మళ్ళీ హీరో ఇజం చూపే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. అసలు ఆయన శనివారం ఎవరిని ఉద్దేశిస్తూ మాట్లాడుతున్నారని సూటిగా ప్రశ్నించారు. ఆదివారం సీఎల్పీలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరోక్షంగా అయిన ప్రత్యక్షంగానో మన వల్ల తప్పిదం జరిగినప్పుడు మానవత్వంతో అదుకునే ప్రయత్నం ఎవరైనా చేయాలన్నారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన పబ్లిసిటీ కోసం వదుకుంటుంటే బాధ వేస్తుందని, ఇప్పటికే రేవతి చనిపోగ ఆమె కొడుకు శ్రీతేజ్ చావుబతుకుల మధ్య కొట్టు మిట్టడుతున్నారని పేర్కొన్నారు. సినిమా చూసేందుకు వచ్చిన హీరో ఎవరికి కనబడకుండా పబ్లిసిటీ లేకుండా వెళితే అయిపోయేదన్నారు. కానీ అభిమానం చూపుతున్నారని విచ్చల విడిగా రెచ్చిపోయి, రోడ్ షో చేయడంతో తొక్కిసలాట జరిగిందని వివరించారు. పోలీసులు పర్మిషన్ ఇచ్చారు. అందుకే చేతులు ఊపమంటున్నారని, పోలీసులు వెళ్ళిపోమన్నారు అని హీరోనే చెబుతున్నాని మరి వెళ్ళిపోయే సమయంలో కూడా రోడ్ షో చేసి హీరో ఇజం ప్రదర్శించారని ధ్వజమెత్తారు. రేవతి చనిపోయిన తర్వాత కూడా కుటుంబాన్ని 11 రోజులు అయిన కనీసం పరామర్శించారని, రేవతి చనిపోయింది అని తెలిసిన తర్వాత ఎందుకు పరమర్శించలేదన్నారు. లీగల్ అడ్వైజ్ ఇచ్చిన వారు, కోర్టులో పరిధిలో కేసు ఉన్నప్పుడు, ప్రెస్‌మీట్ పెట్టవద్దని అడ్వైజర్లు చెప్పలేదా అని విమర్శించారు. తప్పుడు ప్రచారం ప్రభుత్వం చేస్తుందని తప్పు పడుతున్నారని కానీ ఘటన జరిగిందని ఎటువంటి ఆవేదన మీ హావభావాల్లో ఎక్కడ కనిపించలేదని దుయ్యబట్టారు. అభిమానులు ఆపదలో ఉన్నప్పుడు హీరోలు ఎందుకు పట్టించుకోవడం లేదని, మిమ్మల్ని ఎవరో ప్రొవోక్ చేస్తున్నారని కనిపిస్తుందని పేర్కొన్నారు. సినిమాల్లోనే కాదు నిజజీవితంలో కూడా హీరోలా వ్యవహరించాలని, ప్రెస్‌మీట్‌లో ఉపయోగించిన పదాలు చాలా అభ్యంతరకరమని అవి కరెక్ట్ కాదన్నారు.

కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు

రూ.10 వేలు వేతనం అమలు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన నెల జీతం 10వేల రూపాయలను వెంటనే పెంచి అమలు చేయాలని ఎఐటీయుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారానికి వచ్చిన తర్వాత ఎన్నికల వాగ్దానాలను మర్చినట్టు మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను మర్చిపోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండిరచారు. నేడు ఎఐటీయుసి రాష్ట్ర కార్యాలయం, సత్యనారాయణ రెడ్డి భవన్‌లో తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నిర్మాణ మహాసభలకు రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేమపావని అధ్యక్షత వహించారు. మధ్యాహ్న భోజన పథకం బ్రిటీష్ కాలంలోనే 1925లో మద్రాసు కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసి నేటి వరకు కొనసాగుతున్న మధ్యాహ్న భోజన పథకం ప్రధాన ఉద్దేశం 14 సంవత్సరాలలోపు బాలబాలికలు చదువుకోవాలని, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని తీసుకొచ్చిన ఈ పథకంలో తెలంగాణ రాష్ట్రంలో 54వేల మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తూ నెల ఒక్కంటికి 3వేల రూపాయలకు పనిచేయటాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రభుత్వం కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయకుండా శ్రమ దోపిడికి పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు సెలవు దినాలలో ఎండకాలం సెలవులలో కూడా పూర్తి జీతం చెల్లిస్తూ మధ్యాహ్న భోజన కార్మికులకు సెలవు దినాలలో వేతనాలు చెల్లించకపోవడాన్ని ఇది ప్రభుత్వ విధానామా, ప్రైవేటు యాజమాన్యమా అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి బాలబాలికలపై ప్రభుత్వానికి వ్యతిరేకత ఎందుకని ఆయన ప్రశ్నించారు. గురుకుల పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులకు చెల్లిస్తున్న మెనూ చార్జీలను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వీర్యం చేయడానికి హరే రామ హరే కృష్ణ స్వచ్ఛంద సంస్థకు మధ్యాహ్న భోజన పథకం దారాదత్తం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో నడుపుతున్న మధ్యాహ్న భోజన పథకం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి రూ.25లు మెనూ చార్జీలు పెంచాలని, అదే విధంగా కోడి గుడ్లు, గ్యాస్ వంట సరుకులను, వంట పాత్రలను ప్రభుత్వమే సరఫరా చేయాలని ఆయన కోరారు. వంట కార్మికులకు వంట బిల్లులు, నెల నెల వేతనాలు ప్రతినెలా చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఎఐటీయుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి యం.నర్సింహ్మా మాట్లాడుతూ ఇయస్ఐ, పిఎఫ్, రిటైర్‌మెంట్ బెనిఫిట్ కల్పించాలని వంట కార్మికులకు యూనిఫాం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎఐటీయుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రేంపావని మాట్లాడుతూ అల్పాహారంపై పునర్ సమీక్ష చేసి వంట కార్మికుల టిఫిన్లు వేడి వేడిగా విద్యార్థులకు ఇవ్వాలన్న నిబంధన ప్రకారం ప్రతి విద్యార్థికి 30 రూపాయలు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. రాగిజావ తయారు చేసి ప్రతి విద్యార్థికి వేడివేడిగా అందిస్తున్నందుకు ప్రభుత్వం ప్రతి విద్యార్థికి రోజుకు 2 రూపాయల చొప్పున చెల్లించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. నిర్మాణ మహాసభలో ఆదిలాబాద్ జిల్లా కుంటాల రాములు, నిజామాబాద్ జిల్లా తోపునూరి చక్రపాణి, పెద్దపల్లి జిల్లా పూసల రమేష్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొరిమి సుగుణ, ములుగు జిల్లా జంపాల రవీందర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సత్తెనపల్లి విజయలక్ష్మి, ఖమ్మం జిల్లా నిమ్మటూరి రామక్రిష్ణ, హన్మకొండ జిల్లా ధర్మల రాంమూర్తి, యాదాద్రి భువనగిరి జిల్లా యం.డి.ముంతాజ్ బేగం, నల్గొండ జిల్లా రామస్వామి, సిద్ధిపేట జిల్లా ఆది రంగారెడ్డి, సంగారెడ్డి బోయిన ప్రసాద్, నిర్మల్ జిల్లా భూక్యా రమేష్, నారాయణపేట జిల్లా పొలప్పోలు వెంకటేష్, సిరిసిల్ల జిల్లా యం.లక్ష్మణ్, కరీంనగర్ జిల్లా బొజ్జా సాయిలు, కొండా రజిత పాల్గొని ప్రసంగించారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

విశాలాంధ్ర - కాప్రా : కుషాయిగూడ వైష్ణవి ఎంక్లేవ్‌కు చెందిన బజరంగ్ దళ్ నాయకుడు, సామాజిక కార్యకర్త సుమంత్ ముప్ప 29వ పుట్టినరోజు సందర్భంగా శనివారం రాత్రి నగరంలో పెరుగుతున్న చలి, పొగమంచుతో బాధపడుతున్న యాచకులు, అనాథలు, గాంధీ ఆస్పత్రిలోని రోగులకు ముప్పా సుమంత్ యువసేన సభ్యులు దుప్పట్లను పంపిణీ చేశారు. రాత్రి 10 నుంచి 2 గంటల వరకు సికింద్రాబాద్, తార్నాక, బన్సీలాల్ పేట్ తదితర ప్రాంతాలలో సంచరిస్తూ రైల్వేస్టేషన్, బస్టాండ్, ఫుట్ పాత్, మార్కెట్, గుడిసెల్లో నివసించే పేదలకు 300కు పైగా రగ్గులను అందజేశారు. శ్రీకాంత్ కండోజు, సంతోష్ ముప్పా, రాహుల్ గౌడ్, అర్జున్, ప్రవీణ్, శివ సాయి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరం బదిలీలు, ప్రమోషన్ ఇవ్వాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ప్రతి ప్రాథమిక పాఠశాలకు తరగతి ఒక ఉపాధ్యాయుడు, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు కేటాయించాలని ప్రైమరీ స్కూల్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా శిరందాసు రామదాసు అన్నారు. ప్రైమరీ స్కూల్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులను ఎన్నుకోకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా శిరందాసు రామదాసు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వస్కుల రవికుమార్, రాష్ట్ర కోశాధికారిగా పానుగంటి నర్సింహా చారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కనుకుంట్ల విద్యా సాగర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా డా.వేద ప్రకాష్ జోషి, మహిళా కార్యదర్శిగా భవానీ, కార్యదర్శి కర్నాటి గిరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శిరందాసు రామదాసు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బదిలీలు నెలవారీగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులకు యం.ఎల్.సీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఎం అలవెన్స్ 125లో నుండి 5000లకు పెంచాలని, ప్రాథమిక పాఠశాలలలో పనిచేస్తున్న యస్‌జిటీ ఉపాధ్యాయుల పేరును ప్రథమ శ్రేణి ఉపాధ్యాయుడిగా మార్చాలన్నారు. గతంలో అసెంబ్లీలో ప్రకటించిన 10,000 పియస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేసి వెంటనే బీఈడి డీయిడి వారికి ప్రమోషన్స్ కల్పించాలన్నారు. గత అన్ని పిఆర్సీలో యస్‌జిటీ ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందన్నారు. పిఆర్‌సీలో యస్జిటీ యస్ఎ వేతన వ్యత్యాసం తగ్గించి యస్‌జిటీలకు బేసిక్ పే పెంచాలని కోరారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు 10 వ తరగతి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఇన్విజిలేషన్ విధుల నుండి మూల్యాంకనం విధుల నుంచి మినహాయింపు కల్పించాలని కోరారు. సిపియస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని తీర్మానం చేశారు. వస్కుల రవికుమార్, విద్యాసాగర్ రెడ్డి, నరేందర్, గిరిబాబు, సందిప్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విహారిక కాలనీ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి కాలనీలో సొంత నిధులతో సిసి కెమెరాలు, సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్లోని విహారిక కాలనీ సి సెక్టార్ కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. స్థానిక 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి పాల్గొని కాలనీలో జరిగిన అభివృద్ధి పనుల గురించి చర్చించారు. అందులో భాగంగా మిగిలిన రోడ్ పనులను త్వరలో పూర్తి చేపిస్తామని హామీ ఇచ్చారు, అనంతరం కాలనీలో సిసి కెమెరా లు, సైన్ బోర్డ్సను ఏర్పాటు చేపిస్తానని కాలనీ అసోసియేషన్‌కు హామీ ఇవ్వడం జరిగింది. కాలనీ అభివృద్ధి సహకరించిన కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డికి కాలనీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కార్యదర్శి విజయ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు, అడ్వైజర్లు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సామూహిక సీమంతాలు

విశాలాంధ్ర - కాప్రా : ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ఎర్రకుంట అంగన్‌వాడి కేంద్రంలో ఉప్పల్ సెక్టర్ నాచారం, ఎర్రకుంట అంగన్‌వాడి సెంటర్ 20 మందికి సామూహిక సీమంతాలు, అన్నప్రాసన్న కార్యక్రమాలు నిర్వహించారు. జ్ఞానసిధి సేవాట్రస్ట్ సహాయంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టిసిడిఎస్‌సిడిపిఓ స్వాతి మేడం, సూపర్వైజర్ వెంకట రమణ, అడ్వకేట్ యమునా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వాతి ప్రసంగిస్తు గర్భిణి స్త్రీలకు పోషకా హారం గురించి స్వాతి వివరించారు. ఆశావర్కర్లు, అంగన్‌వాడి టీచర్స్ పాల్గొన్నారు.

మల్లంపేట్‌లో నో రూల్స్...

భారీ అక్రమ కట్టడాలు
చోద్యం చూస్తున్న అధికారులు
అక్రమ నిర్మాణాలపై చర్యలకు వెనకడుగు
అన్ని అనుమతులు ఉన్నాయంటూ సిబ్బందే అక్రమార్కులకు వంతపాడుతున్న దుస్థితి

విశాలాంధ్ర-దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో అడ్డూ అదుపు అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి.ఇక్కడ నిర్మాణాలు చేపట్టే బిల్డర్ లకు, కొందరు బడా బాబులకు సిబ్బంది సంపూర్ణ సహాయ సహకారాలందిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. చేనుకు కాపలాగా ఉండే కంచే చేనుమేస్తున్న చందంగా, అనుమతులు లేని భారీ అక్రమ నిర్మణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయంటే వాటికి ఇక్కడున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఎలా అండగా నిలుస్తున్నారోనని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలను నివారించాల్సిన అధికారులు లోలోన కుమ్మక్కై బయటకు మాత్రం తమకేమీ తెలియదన్నట్టు వ్యవహరిస్తున్నారు. కళ్ల ముందే అక్రమంగా నిర్వాహకులు భారీ నిర్మాణాలు చేస్తున్నా అడిగే నాథుడే లేడని స్థానికులు విమర్శలు వెళ వేత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్‌లో సాయి సురేందర్ నగర్ సర్వే నెంబర్ : 208, ప్లాట్ నెంబర్ 36 లో జి+2 అనుమతులు పొంది ఎలాంటి సెట్ బ్యాక్స్ లేకుండా జి+5 అంతస్తుల భారీ అక్రమ నిర్మాణ భవనాలను చేపడుతున్నారు.ఇది టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పక్కా స్కెచ్‌తో, నిర్మాణదారులు అమ్యామ్యాలకు తలొగ్గి ఇలాంటి దుశ్చర్యాలకు బరితెగిస్తున్నారు. ఒకటి రెండు కాదు ఇలాంటి నిర్మాణాలు పదుల సంఖ్యలో కనిపిస్తాయి. అక్రమ నిర్మాణాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరిపి సదరు నిర్మాణాలకు ముందస్తుగా టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇవ్వాలి. నోటీసు సమయం పూర్తయినప్పటికీ సరైన రీతిలో నిర్మాణ దారుడి నుంచి స్పందన రాకపోతే ఆ నిర్మాణాన్ని కూల్చేయాల్సిందిగా టాస్క్ ఫోర్స్ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లాలి. కానీ ఇక్కడ అక్రమ నిర్మాణాల విషయంలో తమ తప్పు ఏమీ లేదు అనిపించుకునే విధంగా నామ మాత్రపు టౌన్ నోటీసులు ఇచ్చి, కొన్ని నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ సిబ్బందే అంతా తామే చూసుకుంటామని, అక్రమ నిర్మాణం సక్రమం చేసేలా మేమే చూసుకుంటామని అక్రమ నిర్మాణదారులకు భరోసా కల్పిస్తున్నారు. సర్వేనెంబర్ 208లో వెలిసిన అక్రమ బవంతిపై మల్లంపేటలోని సదరు టౌన్ ప్లానింగ్ సిబ్బందిని వివరణ కోరగా, అట్టి నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నాయంటూ ఆ నిర్మాణం దగ్గరికి వెళ్లొద్దంటూ బుకాయించడం విడ్డూరంగా ఉంది. తీరా చూస్తే అట్టి నిర్మాణానికి ఎస్+2 అనుమతులు తీసుకొని, "ఎస్ ౦5 "నిర్మాణాలు చేస్తున్నారంటే అక్రమ నిర్మాణాల దారులతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఏ స్థాయిలో వసూళ్లకు పాల్పడుతున్నారో చెప్పనక్కర్లేదని స్థానికంగా విమర్శలు గుప్పుమంటున్నాయి.

అధికారులు, సిబ్బంది అండతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి...

మున్సిపల్ నుంచి అనుమతులు పొందేందుకు రుసుములు చెల్లించి ఆ తరువాత అనుమతులకు లోబడి నిర్మాణాలు చేపట్టాలి.

కానీ రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని 5, 6 అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. ఇందులో మర్మమేంటంటే కింది స్థాయి అధికారుల సమన్వయంతోనే అక్రమ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ప్రభుత్వానికి రుసుము రూపంలో రావాల్సిన ఖజానా కాస్త పక్క దారిన పడుతుంది. అలాంటి కొందరు అధికారులు, సిబ్బంది వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా నష్టం వాటిల్లుతోందని పలువురు అధికారులను ఎద్దేవా చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలు, వాటికి సహకరిస్తున్న అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చెస్తాం...

మేడ్చెల్ జిల్లా కలెక్టరేట్ కు పదుల మైళ్ళ దూరంలో ఉన్న దుండిగల్ మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని, తప్పుడు మార్గంలో అక్రమార్కులకు అండగా నిలుస్తున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించండి

ఎంపీ మల్లు రవికి చిరువ్యాపారుల వినతి

విశాలాంధ్ర - ఆమనగల్లు : నాలుగు మండలాలకు ప్రధాన కూడలి అయిన ఆమనగల్లు మండల కేంద్రంలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కార్యాలయ ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి చిరు వ్యాపారులను ఆదుకోవాలని కోరుతూ ఆదివారం ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు ఆధ్వర్యంలో చిరువ్యాపారులు నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవికి వినతి అందించారు. గతంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఉన్నతాధికారులకు చిరు వ్యాపారులకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి, ఆదుకోవాలని వినతులు అందించినట్లు ఎంపీ దృష్టికి చిరు వ్యాపారులు తీసుకువెళ్లారు. రోజు రోజుకు అభివృద్ధి చెందుతున్న ఆమనగల్లు పట్టణంలో షాపింగ్ కాంప్లెక్స్ లేక చిరు వ్యాపారులు జాతీయ రహదారికి ఇరువైపులా వ్యాపారాలు కొనసాగిస్తున్నారని, ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉంటుందో అని, ఆందోళన చెందుతున్నామని ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ మల్లు రవి ప్రిన్సిపల్ సెక్రటరీ, పంచాయతీరాజ్ కమిషనర్లతో మాట్లాడి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్రం కేశవులు, చిరు వ్యాపారులు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో చిరు వ్యాపారుల అధ్యక్షులు గాజుల శ్రీనివాస్, రూపం వెంకటరెడ్డి, ధ్యాసం నరేందర్, భీమనపల్లి సుధాకర్, ఎండి రజాక్, జానీతో పాటు పలువురు చిరు వ్యాపారులు ఉన్నారు.

జ్ఞాన సంపదకు ధ్యానమే మార్గం

విశాలాంధ్ర - ఆమనగల్లు : ఒత్తిళ్లను అధిగమించి జ్ఞాన సంపదను పెంచుకోవడానికి ధ్యానమే ఏకైక మార్గమని ప్రముఖ ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ సతీమణి స్వర్ణమాల పత్రీజీ అన్నారు. కడ్తాల్ మండలం అన్మాస్ పల్లి కైలాసపురి పిరమిడ్ పత్రీజీ ధ్యాన మహాయాగం ఉదయం 5 గంటలకు ప్రాంత కాల ధ్యానంతో ప్రారంభమయ్యాయి. అనంతరం స్వర్ణమాల పత్రీజీ మాట్లాడుతూ కర్నూలులో మొదలైన పిఎస్ఎస్ఎం వేడుకలు నేడు విశ్వవ్యాప్తం అయ్యాయని, పత్రీజీ ముళ్ళ బాట మీద నడిచి మనకు పూలబాట చూపారని అన్నారు. ధ్యానం ద్వారా జ్ఞానజ్యోతిని వెలిగించుకోవాలని, పత్రీజీ వేసిన పునాదులపై ప్రతి ఒక్కరు నిలబడాలన్నారు. అన్నదాన కార్యక్రమంలో వేదికపై చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపర్లను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఫైటర్స్ రామ్ లక్ష్మణ్, ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, ట్రస్టీలు రాంబాబు, శ్రీరామగోపాల్ సాంబశివరావు, నిర్మలా దేవి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన బూత్ అధ్యక్షులకు ఘన సన్మానం

విశాలాంధ్ర - కాప్రా : నాచారం డివిజన్‌లో బిజెపి సంస్థాగత ఎన్నికల్లో భాగంగా నాచారంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ శక్తి కేంద్రం ఇంచార్జి రాగిరి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో188,189,191 బూత్ అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ విచ్చేసి కొత్తగా ఎన్నికైన బూత్ అధ్యక్షులకు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ప్రకాష్, డివిజన్ ఎన్నికల నిర్వహణ ఇంచార్జి చంద్రమౌళి, సీనియర్ నాయకులు వై.సత్యనారాయణ, రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి రవి నాయక్, జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్‌రావు, గోపాల్ గౌడ్ బేక్కరి రవీందర్ రెడ్డి, కాటిపల్లి రవీందర్ రెడ్డి, అనిత రెడ్డి, వినోదరెడ్డి, నవీన్, యోగేశ్వర్ రెడ్డి, అంజి, రాజిరెడ్డి, ఉదయ్ కిరణ్, పాదం వెంకటేష్, మోర నరసింహరెడ్డి, నవీన్ గౌడ్, వెంకటేష్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, అమర్, బాలు మొదలగు వారు పాల్గొన్నారు.

ఘనంగా "షీరోస్" ధీర వనితలు - స్ఫూర్తి కాంతులు పుస్తకావిష్కరణ



విశాలాంధ్ర-బషీర్ బాగ్: ప్రాజెక్టు ఎబీసీడిలో భాగంగా పదేళ్ల పాటు కృషి చేసి షీరోస్ పేరుతో భారత దేశంలో వివిధ రంగాలలో పని చేసిన మహిళలను పరిచయం చేస్తూ వెలువరించిన ఇంగ్లీష్ పుస్తకాన్ని "షీరోస్" పేరుతో 256 మంది ధీర వనితలు - స్ఫూర్తి కాంతులు పేరుతో తెలుగులోకి అనువదించి పిల్లలకు చేరువ చేయాలనే లక్ష్యంతో పుస్తకం తీసుకు వచ్చామని పుస్తక రచయితలు, డాక్టర్ జాస్తి శివరామకృష్ణ తెలిపారు. ఈ పుస్తకావిష్కరణ సభ ఆదివారం హిమాయత్ నగర్‌లోని ఆక్స్ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో జరిగింది. రాష్ట్రాలలోని వేరు వేరు స్కూల్స్‌కు చెందిన వందలాది మంది విద్యార్థినులకు, టీచర్స్‌కు, తల్లిదండ్రులకు ఈ పుస్తకావిష్కరణ సందర్భంగా ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ ఆతిధ్యం ఇచ్చింది. ఈ తరం పిల్లలకు ధీర వనితలను పరిచయం చేయాలని, వారు చూపిన దారుల, చైతన్యం ఈ తరం ఆడపిల్లలు అందు పుచ్చుకోవాలని, తిరిగి మరింత మంది షీరోస్‌గా వారు ఎదగలనేది తన ప్రయత్నం అన్నారు. ఇందులో భాగంగా ఈ రోజు 256 మంది పిల్లలు షీరోస్‌గా అలంకరించుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ పుస్తకంలో భాగం కానీ షీరోస్‌ను కూడా కొందరు పిల్లలు తమదైన శైలిలో ప్రదర్శించడం గొప్ప విషయం అన్నారు. ఈ పుస్తక రచయితలు అయ్యాల సోమయాజుల అహల, ఇంగ్లీష్ నుండీ తెలుగులోకి అనువాదకులు వంగపల్లి పద్మ, ఈ పుస్తకానికి అందమైన బొమ్మలు రూపొందించిన దుంద్రపెల్లి బాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జమిలి బిల్లులకు ఆమోదం కష్టమే

రాహుల్‌పై ఆరోపణల్లో నిజం లేదు

కాంగ్రెస్ నేత దిగ్విజయ్‌సింగ్

భోపాల్: ఒక దేశం, ఒక ఎన్నిక లక్ష్యంగా కేంద్రం దూకుడు ప్రదర్శిస్తోంది. ఇందుకోసం రాజ్యాంగాన్ని సవరించేందుకు సిద్ధమైంది. ఇదే క్రమంలో బిల్లులను ఇప్పటికే లోక్‌సభ ముందరకు రావడం జేపీసీకి పంపడం జరిగింది. అయితే జమిలి ఎన్నికల కోసం కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లులకు పార్లమెంటు ఉభయ సభలు ఆమోదం లభించడం కష్టమేనని కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ దిగ్విజయ్ సింగ్ అభిప్రాయపడ్డారు. జమిలి బిల్లులపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఏర్పాటు కావడాన్ని ప్రస్తావించారు. ఈ బిల్లులను చట్టసభలు ఆమోదిస్తాయని తాను అనుకోవడంలేదని దిగ్విజయ్ సింగ్ చెప్పారు. మధ్రప్రదేశ్‌లోని అగర్ మాల్వా జిల్లాలో విలేకరులతో మాట్లాడిన ఆయన పై వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో పార్లమెంటు వద్ద ఎంపీల బాహాబాహీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేసు గురించి విలేకరుల

ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. రాహుల్‌పై చేసినవన్నీ తప్పుడు ఆరోపణలని దిగ్విజయ్ సింగ్ అన్నారు. 'బీజేపీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. వారు ఒకరిపై ఒకరు పడ్డారు. ఇద్దరికి గాయాలయ్యాయి. కింద పడిన బీజేపీ ఎంపీ తనను రాహుల్ తోసేశారన్నారు. తన ఎదుట రాహుల్ ఉన్నట్లు చెప్పారు. ముందు నిలబడిన వ్యక్తి ఆయనను ఎలా తోస్తారు' అని కాంగ్రెస్ నేత ప్రశ్నించారు. మందిర్-మసీదు వివాదాలపై ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్ ఆందోళన, అయోధ్య ఆలయం కట్టించినంత మాత్రానా హిందువులకు నాయకులు కాబోరంటూ వ్యాఖ్యలపై ఓ ప్రశ్నకు స్పందించారు. హిందూ-ముస్లిం వివాదాలు సృష్టించడం ద్వారా నాయకులుగా ఎదగాలని అనుకునే వారికి ప్రధాని మోదీ కంటే మంచి ఉదాహరణ ఇంకెవరూ లేరని దిగ్విజయ్ సింగ్ అన్నారు. భగవంత్ బాగానే ప్రకటనలు చేశారు... మరి మోదీకి అర్థమయ్యేలా ఎందుకు చెప్పరని కాంగ్రెస్ ఎంపీ ప్రశ్నించారు. భగవత్ కేవలం ప్రకటనలు ఇస్తున్నారని విమర్శించారు. ముస్లింలపై దురాగతాలు జరిగినప్పుడు ఎందుకు మౌనం వహిస్తారని భగవత్‌ను దిగ్విజయ్ సింగ్ నిలదీశారు. భగవత్ మాటలు సానుకూలమే కానీ ముందుగా ఆయన సంఘ్ అనుబంధ సంస్థల (వీహెచ్‌పీ, బజరంగ్ దళ్‌నుద్దేశించి)ను ఆపాలన్నారు.

బీజేపీది చౌకబారు ప్రచారం

న్యూఢిల్లీ: కేరళలోని వయనాడ్ స్థానం నుంచి ప్రియాంక గాంధీ వాద్రా విజయాన్ని బీజేపీ తరపున పోటీ చేసి ఓడిన నవ్య హరిదాస్ సవాల్ చేయడాన్ని కాంగ్రెస్ ఖండించింది. ఇది చౌకబారు ప్రచార తంతని దుయ్యబట్టింది. నవ్య పిటిషన్‌ను తిరస్కరించి ఆమెకు కోర్టు జరిమానా విధిస్తుందని విశ్వాసంగా తెలిపింది. నవ్యపై పిటిషన్ వేస్తామని పేర్కొంది. వయనాడ్ నుంచి ప్రియాంక గెలుపు చెల్లదంటూ తీర్పు ఇవ్వాలని కోరుతూ కేరళ హైకోర్టును నవ్య ఆశ్రయించారు. ప్రియాంక నామినేషన్ పత్రాలు తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయని, ఆమె ఆస్తుల వివరాలను మొత్తంగా పొందుపర్చలేదని పిటిషన్‌లో ఆరోపించారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కూ ఫిర్యాదు చేశామన్నారు. హైకోర్టు సెలవుల తర్వాత జనవరి 5న తెరుచుకుంటుంది. నవ్య పిటిషన్‌పై కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ స్పందించారు. కొందరికి చౌకబారు ప్రచారాలు చేయడం అలవాటు... అలాంటి వారే నవ్య హరిదాస్. 4లక్షల ఓట్లతో ప్రియాంక గాంధీ విజయాన్ని నవ్య సవాల్ చేస్తుండటం హాస్యాస్పదం అన్నారు.

'పుష్ప' ఘటనలు పునరావృతం కారాదు: నారాయణ

విశాలాంధ్ర-విజయవాడ: 'పుష్ప' ఘటనలు పునరావృతం కారాదని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ ఆదివారం ఓ ప్రకటనలో అన్నారు. దొంగల వ్యవస్థకు, ముఖ్యంగా ఎర్రచందనం దొంగ వ్యాపారాన్ని గౌరవంగా చూపుతూ... హింసాయుత నేర ప్రవృత్తిని "తగ్గేది లే" అని డైలాగులతో ప్రోత్సహించి, హీరోయిజాన్ని యువకులలో కల్పించేవిధంగా "పుష్ప" సినిమా తీస్తే, ఆ సినిమాకు రాయితీలు ప్రకటించి ప్రజలపై భారం మోపడానికి సిద్ధపడిన తెలంగాణ ప్రభుత్వం అసలు ముద్దాయి అని ధ్వజమెత్తారు. ప్రజలు అంతగా ఆదరించని సందేశాత్మక చిత్రాలకు రాయితీలివ్వా లన్నారు. పుష్ప సినిమాను సభ్యతగల కుటుంబాలు కలిసి కూర్చుని చూడగలవా అని ప్రశ్నించారు. "లేస్తే ఒకసారి, కూర్చుంటే ఒకసారి" అనే చౌకబారు సంభాషణలు ఏ కళకు నిదర్శనం అని నిలదీశారు. ఏ తెలుగు భాషకు, యాసకు ఆదర్శం అని అన్నారు. ప్రముఖ ఆదర్శ నటులు "అల్లు" తరం వారు ఇటువంటి సినిమాలు ప్రోత్సహించడం తగదన్నారు. నవమాసాలు మోసిన మాతృమూర్తి తన ప్రాణాలను లెక్కచేయకుండా తన పుత్రరత్నాన్ని కాపాడుకోడానికి తెగించి బలైపోయిందన్నారు. చౌకబారు ప్రచారానికి సినిమా వాళ్లు పాల్పడవచ్చేమోగాని రాజకీయ నాయకులు అంత కక్కుర్తి పడాలా అని నిలదీశారు. సభ్యసమాజం సిగ్గుతో తలదించుకొనే ఇలాంటి సంఘటనల్ని తీవ్రంగా ఖండించాలన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రగతిశీల కళాకారులు, సాహితీవేత్తలు , సామాజిక స్పృహ ఉన్నవాళ్లంతా ముక్త కంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. బాధితకుటుంబానికి పుష్ప యాజమాన్యం ఇచ్చే ముదనష్టపు ఆర్థికసాయాన్ని తిరస్కరించాలన్నారు. ప్రభుత్వం, సభ్యసమాజం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సాంస్కృతిక పునర్వికాసం అవశ్యం

అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: భారత సమాజంలో సాంస్కృతిక పునర్జీవనం, పునర్వికాసం నేడు అవశ్యమని అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించిన సందర్భంగా స్థానిక రామన్నపేటలో ఉన్న జనచైతన్య వేదిక హాలులో లక్ష్మీనారాయణకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో అభినందన సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కులాలు, మతాలు, అసమానతలు, విద్వేషాలు లేని సమాజాన్ని సాధించుకున్న రోజున గురజాడ, శ్రీశ్రీ, గుర్రం జాషువా సాహిత్యం చదివే అవసరం ఉండదన్నారు. ప్రజలు పఠనా శక్తిని పెంచుకోవాలని, అద్భుతమైన తెలుగు సాహిత్యాన్ని నిరంతరం అధ్యయనం చేస్తూ సమాజ చైతన్యానికి తోడ్పడాలన్నారు. రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న సామ్యవాద, లౌకిక వాదాలకు తూట్లు పొడుస్తూ కాషాయీకరణ జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా సాహితీ వేత్తలపై దాడులు చేస్తూ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నారని, తన తల్లి దండ్రులు తనను అత్యంత ప్రజాస్వామ్యంగా పెంచారని, నేడు తనకు లభిస్తున్న పురస్కారం అరసం సంస్థకే దక్కుతుందన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ పెనుగొండ లక్ష్మీ నారాయణ గత 50 సంవత్సరాలుగా అందిస్తున్న సాహిత్యం సమాజ మలుపులో కీలక పాత్ర పోషించిందన్నారు. పెనుగొండతో ముచ్చట్లు, వారి మాండలీకంతో కూడిన ఛలోక్తులు అర్థవంతంగా ఉండి ఆలోచన రేకెత్తిస్తాయని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ పెనుగొండ లక్ష్మీనారాయణ కథా ప్రేమికుడని, నిర్మోహమాట విమర్శకులని అన్నారు. తన జీవితాన్ని పొగాకు కంపెనీలో గుమస్తాగా ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగి స్వయం కృషితో జాతీయ స్థాయికి చేరడం హర్షణీయమన్నారు. లక్ష్మీనారాయణ విమర్శ వ్యాసాలు దీపికకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందించడం అభినందనీయమన్నారు. హిందూ కళాశాల తెలుగు శాఖాధిపతి ప్రొఫెసర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు మాట్లాడుతూ సాహిత్యానికి రచ్చబండ, వేల మిత్రులకు అండ మా పెనుగొండ అని వారి సాహితీ సేవలను కొనియాడారు. ఫోటోజనిక్ మెమొరీ పెనుగొండ లక్ష్మీనారాయణకు కలిగిన అద్భుత వరమని కొనియాడారు. అరసం రాష్ట్ర కార్యదర్శి కె.శరత్ చంద్ర మాట్లాడుతూ అరసంలో సామాన్య సభ్యునిగా చేరి, 50 సంవత్సరాలు పయనించి జాతీయ అధ్యక్షులుగా ఎంపిక కావటం, నేడు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. పెనుగొండ లక్ష్మీనారాయణకు శాలువా కప్పి, మెమెంటో అందించి ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, ప్రముఖ సాహితీ వేత్తలు డాక్టర్ వి.సింగారావు, డాక్టర్ సూర్యదేవర రవికుమార్, కాట్రగడ్డ దయానంద్, సీనియర్ జర్నలిస్ట్ ఎన్.చలపతిరావు, రచయిత సామాజిక విశ్లేషకులు టి.ధనుంజయ రెడ్డి, సీనియర్ న్యాయవాది గూడవల్లి నాగేశ్వరరావు, డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు తదితరులు ప్రసంగించారు.

యువ న్యాయవాదులకు తర్ఫీదు అవసరం

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: న్యాయవాదుల నైపుణ్యం పెంచడం ద్వారానే న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించవచ్చని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి కె. సురేష్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఐఏఎల్ ఆధ్వర్యంలో రోడ్లు భవనాల అతిథి భవనంలో ఐఏఎల్ 2025 క్యాలెండర్ విడుదల కార్యక్రమం జరిగింది. జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రసూల్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి సురేష్ రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో న్యాయవాదుల నైపుణ్యం అవసరమని... ఆదిశగా యువ న్యాయవాదులకు తగిన తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ మాజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐదుకల్లు రవీంద్రనాథ్, జాతీయ కార్యవర్గ సభ్యులు జె. రాజారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాలపాటి వేణుగోపాల్, నాయకులు విశ్వనాథ్, కె.వి.రమణారెడ్డి, చంద్రశేఖర్, ఎం.నారాయణస్వామి, ఆర్.ఎల్.ఎన్.వరప్రసాద్ , వహీదా పాల్గొన్నారు.

శ్రీతేజ్‌కు రామకృష్ణ పరామర్శ

విశాలాంధ్ర-హైదరాబాద్: పుష్ప-2 సినిమా రిలీజ్ సందర్భంగా సంధ్యా థియేటర్ వద్ద తొక్కిసలాటలో గాయపడిన శ్రీతేజ్‌ను సీపీఐ ఏపీ కార్యదర్శి కె.రామకృష్ణ పరామర్శించారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్, ఈటీ నరసింహతో కలిసి ఆయన ఆదివారం కిమ్స్ ఆసుపత్రికి వెళ్లారు. బాబు ఆరోగ్యంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వెంటిలేటర్‌పై శ్రీతేజ్‌కు చికిత్స అందిస్తున్నామని సీపీఐ నేతలతో వైద్యులు తెలిపారు. రామకృష్ణ అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు బాధాకరమన్నారు. మళ్లీ ఇలా జరగకూడదంటే బెనిఫిట్ షోలకు అవకాశం ఇవ్వరాదని చెప్పారు. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్‌లో బెనిఫిట్ షోలను అనుమతించేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించటాన్ని రామకృష్ణ స్వాగతించారు. ఏపీ ప్రభుత్వం కూడా ఇలాంటి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వారి ఫౌండేషన్ ద్వారా బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సహాయం చేయటాన్ని రామకృష్ణ అభినందిచారు. లాభార్జన కోసం సినిమాలు తీసి... సామాజిక బాధ్యత లేదన్నట్లు నటులు ప్రవర్తించటం ఆక్షేపణీయమన్నారు. ఇకనైనా సినీ నటులు, దర్శక, నిర్మాతలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రామకృష్ణ హితవు పలికారు. ఆయన వెంట సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, కార్యవర్గ సభ్యుడు నెర్లకంటి శ్రీకాంత్ కూడా ఉన్నారు.

పాటియాలాలో ఆప్ విజయం

అమృత్‌సర్‌లో కాంగ్రెస్ ముందంజ

చండీగఢ్ : పంజాబ్‌లోని అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పాటియాలాలో మునిసిపల్ ఎన్నికలలో విజయం సాధించింది. రెండు పౌర సంస్థలలో అతిపెద్ద పార్టీలుగా అవతరించినప్పటికీ లూథియానా, జలంధర్ మునిసిపల్ కార్పొరేషన్లలో మెజారిటీకి దూరమైంది. మునిసిపల్ కార్పొరేషన్ ఫలితాల ప్రకారం అమృత్‌సర్, ఫగ్వారాలో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఐదు మునిసిపల్ కార్పొరేషన్లు... లూథియానా, జలంధర్, పాటియాలా, అమృత్‌సర్, ఫగ్వారా, పంజాబ్‌లోని 44 మున్సిపల్ కౌన్సిల్‌లు, నగర పంచాయతీలకు శనివారం ఎన్నికలు జరిగాయి. మాజీ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్‌కు కంచుకోటగా ఉన్న పాటియాలాలో ఆప్ తన మేయర్‌ను ఎన్నుకోనుంది. పాటియాలాలో మొత్తం 53 వార్డులకు గాను 43 వార్డులను అధికార పార్టీ కైవసం చేసుకుని అఖండ విజయం సాధించింది. కాంగ్రెస్, బీజేపీ చెరో నాలుగు వార్డులు గెలుచుకోగా, శిరోమణి అకాలీదళ్ రెండు వార్డులు గెలుచుకున్నాయి. 95 వార్డులున్న లూథియానా మునిసిపల్ కార్పొరేషన్‌లో ఆప్ 41 వార్డులను గెలుచుకోగా, కాంగ్రెస్ 30 వార్డులను గెలుచుకుంది. బీజేపీ 19, స్వతంత్రులు మూడు, ఎస్‌ఏడీ రెండు వార్డులను గెలుచుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి భరత్ భూషణ్ అషు భార్య లూథియానా పౌరసంఘాల ఎన్నికల్లో ఓడిపోయారు. జలంధర్‌లో ఆప్ అతిపెద్ద పార్టీగా అవతరించింది. మొత్తం 85 వార్డులకు గాను 38 వార్డులను గెలుచుకోగా, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్‌పీ, స్వతంత్రులు వరుసగా 25, 19, ఒకటి, రెండు వార్డులను గెలుచుకున్నారు. ఫగ్వారా, అమృత్‌సర్‌లో కాంగ్రెస్ మంచి పనితీరు కనబరిచింది. మునిసిపల్ కార్పొరేషన్లలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. అమృత్‌సర్ మునిసిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 85 వార్డుల్లో కాంగ్రెస్ 40 వార్డులను గెలుచుకోగా, ఆప్ 24 వార్డులను గెలుచుకుంది. బీజేపీ తొమ్మిది, ఎస్‌ఏడీ 4, స్వతంత్రులు 8 స్థానాల్లో విజయం సాధించారు. ఫగ్వారాలో 50 వార్డుల కార్పొరేషన్‌లో ఏ రాజకీయ పార్టీ సగం మార్కును దాటలేనప్పటికీ, కాంగ్రెస్ 22 వార్డులలో విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఆప్ 12 వార్డులను గెలుచుకోగా, బీజేపీ నాలుగు వార్డులను గెలుచుకుంది. శిరోమణి అకాలీదళ్ (ఎస్‌ఏడీ) మూడు వార్డులను, బీఎస్‌పీ మూడు వార్డులను గెలుచుకున్నాయి.

ఎంపీలకు జవాబుదారీతనం అవసరం: ఉపరాష్ట్రపతి ధన్కర్

న్యూఢిల్లీ: చట్టసభ సభ్యులు జవాబుదారీ తనం కలిగి ఉండాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లేదంటే చట్టసభ సభ్యులుగా పార్లమెంటుకు ఎందుకు పంపారో ఆలోచించమని ప్రజలు వారిని బలవంతం చేస్తారని అన్నారు. పార్లమెంటులో అంతరాయాల కారణంగా ఉత్పాదకత తక్కువగా ఉన్న నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఏదైనా ప్రజాస్వామ్యం విజయవంతం కావాలంటే, భావవ్యక్తీకరణ, సంభాషణ రెండు వైపులా గొప్ప బాధ్యతతో కలిసి కొనసాగాలని తెలిపారు. 'తప్పు చేయవద్దని నేను పార్లమెంటేరియన్లకు సూచిస్తున్నాను. మీరు అక్కడికి (పార్లమెంటు) ఎందుకు వెళ్లారు? ఆలోచించమని ప్రజలు మిమ్మల్ని బలవంతం చేస్తారు. ' అని అన్నారు. చౌదరి చరణ్ సింగ్ అవార్డులు-2024 అవార్డు గ్రహీతలను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ వ్యవసాయం గ్రామీణ అభివృద్ధికి వెన్నెముక అని అన్నారు. వ్యవసాయం అభివృద్ధి చెందకపోతే గ్రామీణ రూపురేఖలు మారవని, గ్రామీణ రూపురేఖలు మారితే తప్ప అభివృద్ధి చెందిన దేశం కావాలని ఆకాంక్షించలేమని ఆయన అన్నారు. 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఉండాలంటే, ప్రజల ఆదాయం ఎనిమిది రెట్లు పెరగాలన్నారు. ఇది 'చాలా పెద్ద సవాలు' అని తెలిపారు. గ్రామ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని కూడా ధన్కర్ నొక్కి చెప్పారు. 'మనకు ఉన్న గొప్ప మార్కెట్ వ్యవసాయోత్పత్తులయినప్పటికీ వ్యవసాయ సంఘాలు దానితో చాలా తక్కువ ప్రమేయం కలిగి ఉన్నాయి. వ్యవసాయ రంగానికి ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలి, అది ఆర్థిక అభివృద్ధికి ఇంజిన్‌గా మారాలి' అని అన్నారు.

మూగజీవాలపై దూసుకెళ్లిన బస్

200 గొర్రెలు, మేకల మృత్యువాత

యాదవ సంఘీయుల ఆందోళన

విశాలాంధ్ర-దాచేపల్లి: పల్నాడు జిల్లా గురజాల నియోజక వర్గం దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. అద్దంకి నుంచి నార్కెట్ పల్లి వెళ్లే ప్రధాన రోడ్డుపై చోటు చేసుకున్న ఈ దుర్ఘటనలో దాదాపు 200 గొర్రెలు, మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఇద్దరు కాపరులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెలంగాణలోని మహబూబ్ నగర్ జిల్లా ధన్వాడ నుంచి వందలాది గొర్రెలు, మేకలను తోలుకుంటూ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. గురజాల మండలం పులిపాడు నుంచి దాచేపల్లి మండలం మాదినపాడు గ్రామం వైపునకు కాపరులు వాటిని తీసుకెళ్తున్నారు. అదే సమయంలో మారుతీ ప్రైవేట్ ట్రావెల్ బస్సు హైదరాబాద్ నుంచి ఇంకొల్లు వెళ్తోంది. నారాయణపురం వద్ద బ్రిడ్జిపైకి అతి వేగంగా గొర్రెలు, మేకల మంద మీదుగా బస్ దూసుకెళ్లింది. 200 మేకలు, గొర్రెలు అక్కడికక్కడే దుర్మరణం చెందాయి. కాపరులు ఆవుల మల్లేష్, కర్రెప్పకు తీవ్ర గాయాలయ్యాయి. బస్ డ్రైవర్ పరారయ్యాడు. ప్రయాణికులు దిగి వెళ్లిపోయారు. క్షతగాత్రులను గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మల్లేష్‌కు మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృత్యువాత పడిన గొర్రెలన్నింటినీ అలుగుమల్లెపాడు రోడ్డులోని క్వారీ ప్రాంతానికి తీసుకెళ్లి పోస్టు మార్టం అనంతరం అక్కడే ఖననం చేశారు. బాధితులకు మద్దతుగా దాచేపల్లి మండలంలోని యాదవ సంఘీయులు వందలాది మంది వచ్చి రోడ్డెక్కారు. బాధితులకు న్యాయం చేయాలని రాస్తారోకో చేశారు. తీవ్ర గాయాలపాలైన ఇద్దరికీ చెరో రూ. కోటి ఇవ్వాలని, మృతి చెందిన గొర్రెలు, మేకలకు రూ. రెండు కోట్లు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బస్సు యజమానితో పాటు డ్రైవర్ ను కూడా తక్షణమే అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. కాగా, బస్సు యజమానిని పిలిపించి తగిన న్యాయం చేస్తామని పోలీసులు భరోసా ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బాధితులను ఆదుకుంటాం: మంత్రి గొట్టిపాటి

ఈ ఘటనపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ విచారం వ్యక్తంచేశారు. బాధితులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. కలెక్టర్‌తో మాట్లాడతానని, కాపరులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్పీ శ్రీనివాసరావు, సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, దాచేపల్లి సీఐ భాస్కర్, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ శేషిరెడ్డి, జిల్లా పశు సంవృద్ధిశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కాంతారావుతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదిక పంపుతామని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐలు సౌందర్ రాజన్, పాపారావు తెలిపారు.

బీజేపీ, కాంగ్రెస్ ఒకే తాను ముక్కలు: మాయావతి

లక్నో: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌కు పార్లమెంటులో జరిగిన అవమానంపై కాంగ్రెస్ చేసే నిరసనల్లో నిజాయతీ ఎంత అని బీఎస్‌పీ అధినేత్రి మాయావతి ప్రశ్నించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను విస్మరించిన పార్టీ ఇప్పుడు స్వప్రయోజనాల కోసం మోసపూరిత రాజకీయం చేస్తోందని విమర్శించారు. అంబేద్కర్ పేరిట ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడంలో అధికార బీజేపీకి కాంగ్రెస్‌కు మధ్య తేడా లేదని, ఈ రెండు పార్టీలు ఒకే తాను ముక్కలని మాయావతి 'ఎక్స్'లో దుయ్యబట్టారు. 'అంబేద్కర్‌నుద్దేశించిన అమిత్‌షా వ్యాఖ్యలపై ప్రజలు మండిపడుతున్నారు. అంబేద్కర్ సేవలను పట్టించుకోని కాంగ్రెస్ స్వప్రయోజనాల కోసం మోసపూరిత రాజకీయం చేస్తోంది. అంబేద్కర్ మద్దతుదారులను కట్టడి చేసేందుకు బీఎస్‌పీని దెబ్బతీసేలా అన్ని పార్టీలు కుట్ర చేస్తున్నాయి' అని మాయావతి పేర్కొన్నారు.









Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.